ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

గురువారం 15 అక్టోబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 119 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

ఇజ్రాయెల్ వెళ్లే విమానాల్లో

పాక్ పైలట్లపై నిషేధం

పై దుబాయ్ ఘటన నేపథ్యంలో ఎయిర్ ఫ్రాన్స్ నిర్ణయం 2





సీఈసీకి వ్యతిరేకంగా పిటిషన్

రిజిష్టర్ చేసిన సుప్రీంకోర్టు 2

ఇక రోజువారీ విచారణ

జగన్ అక్రమాస్తుల కేసులపై కీలక పరిణామం

- జగన్ ఈడీ కేసులపైనా ఇక రోజువారీ విచారణ
- విచారణ వేగవంతం చేయాలని సీబీఐ కోర్టు నిర్ణయం
- జగన్‌తో పాటు 70 మంది నిందితుల వ్యక్తిగత విచారణ
- పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 9 ఈడీ ఛార్జిషీట్లు



2

బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి

విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు

గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికిన ప్రముఖులు

ఆలయంలో వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్న రాష్ట్రపతి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతిలో...

సింగరేణి ఖిల్లాస్

బొగ్గును దోచుకుంటున్నడు

కోట్లలో కుంభకోణాలు చేస్తున్నరు



కార్మికులే కాపాడుకోవాలె....

గని కార్మికులకు కెసిఆరే అండ

బిజెపి,కాంగ్రెస్ కలిసి నాశనం చేస్తున్నరు...

42 రోజులపాటు సకల జనుల సమ్మె చేసి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఊతమందించిన సింగరేణి కార్మికులను కెసిఆర్ గుండెల్లో పెట్టి కాపాడుకున్నారని.., అయితే ఇప్పుడు అదే సింగరేణి గొంతు పిసకడానికి రేవంత్ రెడ్డి బిజెపితో కలిసి కుట్ర చేస్తున్నారని మాజీ మంత్రి, టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బామ్మర్ది సూదిని సుజన్ రెడ్డితో కలిసి సింగరేణిని నాశనం పట్టించబోతున్నారని, అవసరమైతే మంత్రులు, కేంద్ర పెద్దలతో కలిసి అమ్మడానికి కూడా సిద్ధమవుతున్నారని ఆయన ఆరోపించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం లోని గోదావరిఖని పట్టణంలో జరిగిన సింగరేణి కార్మికుల సింహగర్జనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లేందుకు కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఆయనన్నారు.సింగరేణి సంస్థను, బొగ్గు గని కార్మికుల హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులపైనే ఉందని ఆయన పేర్కొన్నారు.

(గోదావరిఖని - సింగిడి)

గోదావరిఖనిలో సింగరేణి కార్మికుల సింహగర్జన ప్రభుత్వాలపై నిప్పులు చెరిగిన కేటీఆర్



బొగ్గు దోపిడీ.. కుంభకోణాలు

సింగరేణి సంస్థలో జరుగుతున్న పరిణామాలపై కేటీఆర్ చాలా వివరంగా మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన బామ్మర్దితో కలిసి సింగరేణి బొగ్గు వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. సంస్థలో టెండర్ల కేటాయింపులు, బొగ్గు కాంట్రాక్టుల వ్యవహారాల్లో భారీ అవినీతి చోటు చేసుకుంటున్నదని, వేలాది కోట్ల రూపాయల కుంభకోణాలు చేస్తున్నారని ఆయన అన్నారు. అవినీతి కోసం నిబంధనల పేరిట సింగరేణి ...మిగతా 2లో

ట్రిలియన్ డాలర్ ఎకానమీగా

తెలంగాణ

తెలంగాణలో పెట్టుబడులకు పూర్తి భద్రత, లాభం, సత్వర అనుమతులు : సీఎం రేవంత్ రెడ్డి



పెట్టుబడులు పెట్టే యువ పారిశ్రామిక వేత్తలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆహ్వానం పలుకుతుందని రేవంత్ రెడ్డి తెలిపారు. కొత్త పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమి, రాయితీలు, ప్రోత్సాహకాలతో సమగ్ర విధానం రూపొందించిందన్నారు. తెలంగాణను మూడు ఎకనామిక్ జోన్లుగా అర్బన్, పెరి-అర్బన్, రూరల్ విభజించి అభివృద్ధి చేస్తామన్నారు. సర్వీస్, తయారీ, వ్యవసాయ రంగాలకు సమప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వ ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామని రేవంత్ రెడ్డి తెలిపారు. దేశ జనాభాలో రాష్ట్ర వాటా 2.5 శాతమే అయినా జీడీపీలో 5 శాతం తెలంగాణ నుంచే అందిస్తున్నామని చెప్పారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 2

-హైదరాబాద్, అక్టోబర్ 14 (సింగిడి)

ఎల్‌నినో ప్రభావం, కరవు పరిస్థితులపై

సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

విద్యుత్ అంతరాయాలపై సీఎం రేవంత్ ఆగ్రహం

సరఫరా సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం 2



సర్‌పై సుప్రీంకోర్టులో

ఒవైసీ పిటిషన్

ఎన్నికల సంఘంపై సుప్రీంకోర్టుకు వెళ్లిన అసదుద్దీన్ ఒవైసీ 2

నిబంధనలు పాటించకుండా ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపణ

ఈ ప్రక్రియపై స్టే విధించాలని కోర్టుకు విజ్ఞప్తి

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను ఆయన తన పిటిషన్‌లో సవాల్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి సరైన ప్రక్రియ పాటించకుండా పెద్ద ఎత్తున ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆయన తన పిటిషన్‌లో తీవ్ర ఆరోపణలు చేశారు.

-న్యూఢిల్లీ, అక్టోబర్ 14 (సింగిడి)

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల

షెడ్యూల్ విడుదల

మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు

తొలి దశ నవంబర్ 26న పోలింగ్.. మూడో దశ డిసెంబర్ 2న ఎన్నికలు

మున్సిపల్ ఎన్నికలు ఈ నెల 28న..మున్సిపల్ ఫలితాలు ఈ నెల 30న

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నవంబర్ 3న



2

ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా బుధవారం విజయవాడలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చింది. తొలి విడతలో భాగంగా 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, 19న పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.

-హైదరాబాద్, అక్టోబర్ 14 (సింగిడి)



మూసీకి కొత్త రూపు

తొలి దశలో 21 కి.మీ. టెండర్ల ప్రక్రియ ప్రారంభం

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు ఏడీబీ నుంచి ఆమోదం

రెండు ప్యాకేజీల్లో రూ.7,345 కోట్ల అంచనాతో పనులు 2

టెండర్ల దాఖలుకు నవంబర్ 26 తుది గడువు

నది ప్రక్షాళన, సుందరీకరణతో పాటు ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం

హైదరాబాద్ నగరాన్ని సుందరంగా మార్చే మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కీలక దశకు చేరుకుంది. ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) నుంచి అనుమతులు రావడంతో, తొలి దశ పనులకు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) టెండర్లను ఆహ్వానించింది. మొత్తం 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులను రెండు ప్యాకేజీల కింద చేపట్టనున్నారు. ఎంఆర్‌డీసీఎల్ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, అక్టోబరు 15 నుంచి టెండర్ పత్రాలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. టెండర్లు దాఖలు చేయడానికి నవంబర్ 26ని చివరి తేదీగా నిర్ణయించారు. ఈ నెలాఖరు నాటికి అర్హత కలిగిన సంస్థను ఎంపిక చేసే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

-హైదరాబాద్, అక్టోబర్ 14 (సింగిడి)

విమానాల్లో ఆ పవర్ బ్యాంకులపై నిషేధం 2

జనసేనలో చేరిన

వంగవీటి రాధా

కండువా కప్పి ఆహ్వానించిన పవన్ కల్యాణ్

విజయవాడ మేయర్ రేసులో రాధా పేరు 2

జనసేనలో చేరిన తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్

విజయవాడలో 35 డివిజన్లు జనసేన కోరుతున్నట్లు సమాచారం

కూటమి సీట్ల సర్దుబాటుపై కొనసాగుతున్న చర్చలు



మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారు. బుధవారం అమరావతిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కూడా జనసేనలో చేరారు. ఈ పరిణామంతో విజయవాడ మేయర్ అభ్యర్థిగా రాధాకృష్ణ పేరు తెరపైకి వచ్చింది.

- విజయవాడ, అక్టోబర్ 14 (సింగిడి)

ఇజ్రాయెల్ వెళ్లే విమానాల్లో పాకిస్తాన్ పైలట్లపై నిషేధం

ఇటీవల ఫ్లైదుబాయ్ విమాన ఘటన ప్రపంచాన్ని కుదిపేసింది. ఈ ఘటన అనేక అనుమానాలకు తావిస్తూనే.. కీలక నిర్ణయా లకు ఉపయోగపడింది. ఈ ప్రమాద ఘటనను దృష్టిలో ఉంచుకుని ఫ్రాన్స్‌కు చెందిన ఎయిర్ ఫ్రాన్స్ అనే విమానయాన సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. తమ సంస్థ నుంచి ఇజ్రాయెల్ వెళ్లే విమానాల్లో పాకిస్తాన్ పైలట్లను నిషేధించింది. దీనికి ఇజ్రాయెల్ తీసుకున్న నిర్ణయమే కారణం. తమతో దౌత్య సంబంధాలు లేని, అలాగే, ద్వంద్వ పౌరసత్వం కలిగిన దేశాలకు చెందిన విమానయాన సిబ్బందిని ఇజ్రాయెల్ నిషేధిస్తూ నిర్ణయం తీసుకుంది. అంటే.. ఇజ్రాయెల్ నుంచి ఇతర చోట్లకు



వెళ్లే విమానాల్లో.. అలాగే ఇతర దేశాల నుంచి ఇజ్రాయెల్ వచ్చే విమానాల్లో.. తమ దేశంతో శతృత్వం కలిగిన దేశాల సిబ్బంది, అలాగే దౌత్య సంబంధాలు లేని దేశాల సిబ్బంది పని చేయడానికి వీల్లేదు. అలాంటి పైలట్లు, ఇతర సిబ్బంది ఉన్న విమానాల్ని ఇజ్రాయెల్ నిషేధించింది. ఈ నిర్ణయం శతృదేశాలకు సంబంధించిన వారు ఇతర దేశ విమాన సంస్థల్లో పని చేసినా వర్తిస్తుంది.

పాకిస్తాన్‌తో ఇజ్రాయెల్‌కు సత్సంబంధాలు లేవు. కాబట్టి, పాకిస్తాన్ పైలట్ అమెరికా విమానయాన సంస్థలో పని చేసినా సరే.. తమ దేశానికి వచ్చే విమానాల్లో విధులు నిర్వహించడానికి వీల్లేదు. ఇజ్రాయెల్‌కు 31 దేశాలతో సత్సంబంధాలు లేవు. దీంతో ఆయా దేశాల సిబ్బంది ఏ దేశ విమాన సంస్థల్లో పని చేసినా సరే.. ఇజ్రాయెల్ రావ డానికి అనుమతించదు. ఇతర దేశాలకు ఆయా సిబ్బంది వెళ్లొచ్చు. ఈ నిషేధిత దేశాల జాబితాలో పాకిస్తాన్ కూడా ఉంది. అందుకే, పాక్ సిబ్బందిని ఇజ్రాయెల్ వెళ్లే విమానాల్లో నిషేధిస్తున్నట్లు ఎయిర్ ఫ్రాన్స్ ప్రకటించింది. దీనివల్ల ప్రధానంగా ముస్లిం దేశాల సిబ్బందిపై నిషేధం అమలవుతుంది. పాకిస్తాన్‌తోపాటు అల్జీరియా, ట్యునీసియా, ఇరాన్, ఒమన్, సౌదీ అరేబియా, నైగర్, ఆఫ్గనిస్తాన్, బంగ్లాదేశ్, బ్రూనే, కొమోరోస్, క్యూబా, జిబూటి, ఇండోనేసియా, ఇరాక్, కువైట్, లెబనాన్, లిబియా, మలేసియా, మాల్దీవ్స్, మాలి, మౌరటేనియా, ఉత్తర కొరియా, ఖతార్, సౌదీ అరేబియా, సోమాలియా, సూడాన్, సిరియా, వెనిజు వెలా, యెమెన్ దేశాల సిబ్బందిపై ప్రభావం పడుతుంది. ప్రస్తుతం ఫ్రాన్స్ ఈ నిర్ణయం తీసుకోగా.. త్వరలోనే ఇతర దేశాల విమా నయాన సంస్థలు కూడా ఇదే నిర్ణయాన్ని అమలు చేయనున్నాయి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతిలో సింగరేణి ఖల్లాస్

ఆగం పట్టిస్తున్నారన్నారు. టెండర్లు లో వాటా కోసం సైట్ విజిట్ అనే కొత్త రూల్ పట్టుకొచ్చి దోచుకు తింటున్నారు అన్నారు ఇప్పటికే 10 వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని, 40 మిలియన్ తన్నుల బొగ్గు మాయమైందని, ఇదేమని అడిగితే ఉన్నదని కొత్త కొత్త సమాధానం చెబుతున్నారని ఆయన అన్నారు.

కార్మికులే కాపాడాలె

సింగరేణి సంస్థను కాపాడుకోవడానికి కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.కా ర్మికుల సంక్షేమం, హక్కులు, ఉద్యోగ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తమ డిమాండ్ చేస్తే నోటికి వచ్చినట్టు పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడుతున్నాడని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమ నేల గోదా వరిఖని నుండే తమ పోరాటం మొదలుపెట్టామని, ఎట్టి పరిస్థితుల్లోని వెనుకడుగు వేయబమని గని కార్మి కులందరికీ కేసీఆర్ మాత్రమే అండ అని ఆయన స్పష్టం చేశారు.సింగరేణి కార్మికులకు కేసీఆర్ హయాంలోనే మేలు జరిగిందని, చంద్రబాబు నాయుడు నిలిపివేసిన కారుణ్య నియమకాలను అమలు చేశారని, లాభాల్లో వాటా పెంచారని, భారత దేశంలోనే గొప్ప చరిత్ర సృష్టించిన జైపూర్ పవర్ ప్లాంట్ నిర్మాణం జరిగిందంటూ ఆయన సింగరేణిలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు.

కాంగ్రెస్, బీజేపీ లు ఒకటే

సింగరేణి సంస్థను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, అయితే రెండు పార్టీలు కలిసి సంస్థను దెబ్బతీస్తున్నాయని కేటీఆర్ ఆరోపించారు. సంస్థలో రాష్ట్ర ప్రభుత్వ వాటా విక్రయించే ప్రయత్నాలు తెర వెనుక వేగంగా జరుగుతున్నాయని, కార్మికులం దరూ ఇది గ్రహించాలని ఆయన కోరారు. తెలంగాణ



ట్రాన్స్ కో లో వాటా అమ్మినట్టుగానే సింగరేణిలో కూడా వాటాలు అమ్మడానికి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన బామ్మర్దులతో ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన అన్నారు.

నక్సలైట్ల లెక్క కొట్లాడాలె

సింగరేణి లో దొరల రాజ్యం పోవడానికి, సంస్థ బతక డానికి, కార్మికుల హక్కులు కాపాడడానికి పుట్టిన సికాస ను కేటీఆర్ గుర్తు చేశారు. గోదావరిఖని కేంద్రంగా ఎన్నో పోరాటాలు చేసిన సింగరేణి కార్మిక సమాఖ్యను గుర్తుతెచ్చుకొని ఆ స్ఫూర్తితో పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఐక్య పోరాటాల ద్వారా మాత్రమే సింగరేణి కాపాడబడుతుందని, కార్మికుల పోరాటాలకు ముందు కేసీఆర్ ఉంటాడని ఆయన అన్నారు.

ఆ మూడక్షరాలంటే.. హడల్.. బాల్క సుమన్.

మూడు అక్షరాలు చెబితే మోడీ నుంచి రేవంత్ రెడ్డి వరకు లాగులు తడుస్తున్నాయని, ఆ మూడు అక్షరాలే కెసిఆర్ అని మాజీ ఎంపీ ,మాజీ ఎమ్మెల్యే , మాజీ బాల్క సుమన్ అన్నారు. దగుల్బాజీ కాంగ్రెస్ మెదలు వంచి చి తెలంగాణ సాధించి మూడు అక్షరాలను చరిత్రగా ఎలా మలిచాడో... ఇప్పుడు రేవంత్ రెడ్డి



ప్రభుత్వానికి కూడా కేటీఆర్ అనే మూడు అక్షరాలు ముచ్చెమటలు పట్టిస్తున్నాయన్నారు. కేటీఆర్ ను తల వకుండా ఒక నిమిషం కూడా ఉండలేకపోవడం రేవంత్ రెడ్డి బలహీనతకు భయానికి నిదర్శనమ న్నారు. సింగరేణి కార్మికులు తమ పౌరుషాన్ని చూపెట్టి మళ్లీ బిఆర్ఎస్ ను అధికారంలోకి తీసుకొచ్చి కేసీఆర్ ను ముఖ్యమంత్రి చేయాలని ఆయన పిలుపుని చ్చారు.

గర్జనకు భారీగా కార్మికులు

కాగా కార్మికుల సింహ గర్జన విజయవంతమైంది. సింగరేణి అన్ని ప్రాంతాల నుండి కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, మాజీ మంత్రి, కరీంన గర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య లతో పాటు కార్పొరేటర్లు, రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు.



ఇక రోజువారీ విచారణ

జగన్ అక్రమాస్తుల కేసులపై కీలక పరిణామం

హైదరాబాద్, అక్టోబర్ 14 (సింగిడి)

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనపై ఉన్న సీబీఐ కేసులతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులను కూడా రోజువారీగా విచారించాలని సీబీఐ కోర్టు నిర్ణయించింది. ఈ నిర్ణయంతో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ వేగవంతం కానుంది. ఈ కేసుల్లో జగన్‌తో పాటు మరో 70 మంది నిందితులను వ్యక్తిగతంగా విచారించాలని న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. జగన్‌పై దాదాపు దశాబ్దకాలంగా 9 ఈడీ ఛార్జిషీట్లు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఈడీ అధికారులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.
సీబీఐ కోర్టులో నిందితులు దాఖలు చేసుకున్న డిశ్చార్జ్ పిటిషన్లపై తీర్పులు రాకపోవడంతో కేసుల విచారణ ముందుకు సాగడం లేదని ఈడీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈడీతో పాటు మాజీ మంత్రి హరిరామజో గయ్య, మరికొందరు కూడా విచారణను వేగవంతం చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సీబీఐ కోర్టు తీసుకున్న తాజా నిర్ణయంతో జగన్‌పై ఉన్న కేసుల విచారణ ఇకపై వేగంగా ముందుకు సాగే అవకాశం కనిపిస్తోంది.

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల

రెండో విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 3న పోలింగ్, 5న ఫలితాలు వెల్లడిస్తారు. ఇక మూడో విడతలో గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్, లెక్కింపు ప్రక్రియ పూర్తి చేస్తారు. రిజ ర్వేషన్లపై న్యాయపరమైన చిక్కుముడులు వీడి, ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగ మమైంది.



బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం విజయవాడ లోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మ వారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఆమె అమ్మవారి సన్నిధికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటన కోసం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగ లపూడి అనిత, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఇంద్రకీ లాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర హోంమంత్రి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఆలయ చైర్మన్ రాధాకృష్ణ, ఈవో షీనా నాయక్ ఆమెను ఆలయంలోకి ఆహ్వానించారు. గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, వేద పండితులు రాష్ట్రపతికి వేదాశీర్వ చనాలు అందించారు. ఆలయ అధికారులు ఆమెకు పట్టువస్త్రాలు, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను రాష్ట్రపతి ఆప్యాయంగా పలకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి యోగక్షేమా లను అడిగి తెలుసుకుంటూ ఆమె ముందుకు సాగారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికా రులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

సర్‌పై సుప్రీంకోర్టులో

ఒవైసీ పిటిషన్

ఒవైసీ తరపున న్యాయవాది నిజాముద్దీన్ పాషా వాదనలు వినిపించారు. ఈ అంశంపై దాఖలైన ఇతర పిటిషన్లతో కలిపి తమ పిటిషన్‌ను కూడా గురువారం విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వం లోని ధర్మాసనాన్ని కోరారు. ఈ అభ్యర్థనను పరిశీలిస్తామని, సంబంధిత కేసులతో కలిపి విచారణ జాబితాలో చేర్చే అంశాన్ని చూస్తామని సీజేఐ తెలిపారు. ప్రస్తుతం కొనసా గుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై తక్షణమే స్టే విధించాలని ఒవైసీ తన పిటిషన్‌లో కోరారు. ముఖ్యంగా ఫారం-6 దరఖాస్తులకు సంబంధించి మ్యాపింగ్ వంటి నిబంధనలు ఓటర్లకు భారంగా ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు ఇదే అంశంపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒవైసీ పిటిషన్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ పిటిషన్లన్నింటినీ కలిపి సుప్రీం కోర్టు రేపు విచారించనుంది.



మూసీకి కొత్త రూపు

మొదటి దశ పనుల కోసం రూ.7,345 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇందులో భాగంగా, జోన్-1ఏ కింద హిమాయత్‌సాగర్ నుంచి బాపుఘాట్ వరకు ఈసా నదిపై 9.8 కి.మీ., జోన్-1బీ కింద గండిపేట నుంచి బాపుఘాట్ వరకు మూసీపై 11.2 కి.మీ. మేర అభివృద్ధి పనులు చేపడతారు. నది ప్రక్షాళన, వరద నివారణకు రిటైనింగ్ గోడల నిర్మాణం, సుందరీకరణ, రోడ్లు, బ్రిడ్జిలు, రబ్బర్ డ్యామ్‌లు నిర్మిస్తారు. ఔటర్ రింగ్ రోడ్‌పై ఒక ఐకానిక్ కేబుల్ స్టేడ్ బ్రిడ్జి నిర్మాణం కూడా ఈ ప్రాజెక్టులో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.
మొత్తం 55 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు ఏడీబీ రూ.4,500 కోట్ల వరకు రుణం అందించనుండగా, మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. డిసెంబర్ 2027 నాటికి తొలి దశ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం రాజేంద్రనగర్ పరిధిలో భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుండగా, పరి హారంపై కొందరు స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు వేగవంతం కానున్నాయి.

విమానాల్లో ఆ పవర్ బ్యాంకులపై నిషేధం

పవర్ బ్యాంక్‌ల విషయంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) కీలక నిర్ణయం తీసుకుంది. విమానాల్లో మొబికిన్స్ ఎంకే-పీబీ-04 మోడల్ పవర్‌బ్యాంకులపై (power bank) నిషేధం విధించింది. ఇటీవల దిల్లీ నుంచి చెన్నైకి వెళ్తున్న ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ నుంచి మంటలు చెలరేగాయి. సిబ్బంది వెంటనే అప్రమత్తమై శంషాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ క్రమంలో మొబికిన్స్ ఎంకే-పీబీ-04 మోడల్ పవర్‌బ్యాంక్‌ను విమానంలో తీసుకువెళ్లడం, రవాణా చేయడం జరగకుండా చూసుకోవాలని విమానయాన సంస్థలను డీజీసీఏ ఆదేశించింది. లగేజ్ బ్యాగ్‌లు, క్యాబిన్ బ్యాగుల్లో గానీ, కార్గోలో గానీ వీటిని తీసుకెళ్లొద్దని ప్రయాణికులకు, విమానయాన సంస్థలకు ఆదేశాలిచ్చింది. భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

జనసేనలో చేరిన

వంగవీటి రాధా

విజయవాడ మేయర్ పదవికి రాధాకృష్ణ పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, మేయర్ సీటును కూటమిలో జనసేనకు కేటాయిస్తారా? అన్నది ఇంకా స్పష్టం కాలేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి రాధాకృష్ణ కృషి చేశారు. వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత టీడీపీతో కలిసి పనిచేస్తూ వచ్చారు. ఇప్పుడు జనసేనలో చేరడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. మరోవైపు, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటిం చారు. మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, జడ్పీ చైర్మన్ల పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఇప్పటికే గెజిట్‌లు విడుదల చేసింది. ఈ తరుణంలో రాధా చేరికకు ప్రాధాన్యం ఏర్పడింది. స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై కూటమి నేతలు చర్చలు జరుపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో జనసేన నేతలు నాదెండ్ల మనోహర్, లింగమనేని రమేశ్, హరిప్రసాద్ సమావేశమ య్యారు. విజయవాడలోని 86 డివిజన్లలో 35 స్థానాలు తమకు కేటాయించాలని జనసేన కోరుతున్నట్లు సమాచారం. అయితే, 15 స్థానాలు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సీట్ల పంపకాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

ఎల్‌నినో ప్రభావం, కరవు పరిస్థితులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

విద్యుత్ అంతరాయాలపై సీఎం రేవంత్ ఆగ్రహం - సరఫరా సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 14 (సింగిడి)

విద్యుత్ అంతరాయాలపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితుల్లో మార్పు రావడం లేదన్న సీఎం ప్రమాదం ఉన్నా ఉత్పత్తి పెంచడం లేదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, కరవు పరిస్థితులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీ క్షించారు. ఏంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎస్ సంజయ్ జాజు, ఉన్నతాధికారులు హాజర య్యారు. జిల్లాలవారీగా వర్షాభావ పరిస్థితు లను సీఎంకు అధికారులు వివరించారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తాం

నైనీ, మహానది నుంచి బొగ్గు లింకేజీలు ఏర్పాటు చేశామని రేవంత్ రెడ్డి తెలిపారు. బొగ్గు లింకేజీలు ఉన్నా విద్యుత్ ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఏ ఒక్కరినీ ఉపేక్షిం చేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ అంతరాయాలకు వెంటనే కారణాలు తెలపాలని అధికారులను సీఎం ఆదేశించారు. విద్యుత్, తాగునీటి సమస్యలు తీవ్రం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్న రేవంత్ రెడ్డి తాగునీటి సరఫరా సజావుగా సాగేలా ప్రణాళికలు రూపొందించాలని అదికారులను ఆదేశాలు జారీ చేశారు.

పంటలు ఎండిపోకుండా
విద్యుత్ సరఫరా చేయాలి

తెలంగాణలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతుల పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు విద్యుత్ సరఫరా చేయాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పంటలు చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ కొరత కారణంగా రైతులు పంట నష్టపోకూడదని హెచ్చరించారు. వ్యవసాయానికి విద్యుత్ అవసరం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అందుకు అనుగుణంగా సరఫరా పెంచాలని సూచించారు.
"ఎల్‌నినో ఒక విపత్తని, దీని ప్రభావం, రాబోయే సంక్షోభ పరిస్థితులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. దసరా తర్వాత దీపావళి వరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు" - సీఎంవో ట్వీట్

ఎల్‌నినో విపత్తుపై ప్రజల్లో
అవగాహన కల్పించాలి

క్యూర్ పరిధిలో నిర్మాణ రంగానికి ఎస్టీపీలు శుద్ది చేసిన నీరు వాడాలని అధికారులను సీఎం ఆదేశించారు. పశుగ్రాసానికి ఇబ్బందులు రాకుండా చూడాలని, ఎల్‌నినో విపత్తుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మండలంలో గ్రూప్-1, 2 అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిం చాలని, మండలాల్లో పరిస్థితులను ఎప్పటిక ప్పుడు సీఎస్‌కు అందించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.



సీఈసీకి వ్యతిరేకంగా పిటిషన్

సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో పాటు ఇండియా బ్లాక్‌కు చెందిన 11 పార్టీలు కలిసి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌కు సుప్రీంకోర్టు రిజిస్ట్రర్ చేసి, విచారణకు స్వీకరించింది. దీని ప్రకారం అక్టోబర్ 26న కేసు విచారణకు వచ్చే అవకాశం ఉంది.
సుప్రీంకోర్టు నిబంధనలకు అనుగుణంగా ఈ పిటిషన్‌కు ఒక రిట్ నెంబర్ రావడంతో, వరుస ప్రకారం విచారణ మొదలవుతుంది. ఈ పిటిషన్‌ను మొదట రాహుల్ గాంధీ, ఆ తర్వాత మరో 11 పార్టీలు కలిసి దాఖలు చేశాయి. ఆ తర్వాత టి.తిరుమావలవన్, సజ్జాద్ అహ్మద్ కిచ్లూ కలిసి పిటిషన్లో చేరారు. దీంతో ఈ పిటిషన్ దాఖలు చేసిన వారి సంఖ్య 13కు చేరింది. భారీ స్థాయిలో ఓట్ల తొలగింపు, సర్‌లో అవకతవకలు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా వంటి అంశాలతో ఈ పిటిషన్ దాఖలైంది. అయితే, ఈ పిటిషన్‌లో 14 తప్పులు ఉన్నట్లు సుప్రీంకోర్టు రిజిష్ట్రీ తెలిపింది. దీంతో పిటిషనర్లకు సంబంధించి తగిన ధృవపత్రాలు సమర్పించాలని సంబంధిత న్యాయవాదికి సూచించింది. తగిన కోర్టు ఫీజు (రూ.220) కూడా చెల్లించలేదని తెలిపింది. అనంతరం వీటిని సరిదిద్దడంతో సుప్రీంకోర్టు కేసు రిజిష్టర్ చేసినట్లు తెలుస్తోంది.

ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 14(సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130 – సుభాష్ నగర్ డివిజన్ "వాసు లేఔట్" కాలనీలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని, మౌళిక వసతులను మెరుగు పరిచాలని కాలనీ వాసులు ఎమ్మెల్యే ను కోరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ సుభాష్ నగర్ వాసు లే ఔట్ లో గతంలో ఎన్నో రకాల మౌలిక వసతులను కాలనీ అభివృద్ధికి అనుగుణంగా అభివృద్ధి పరిచామని, నూతనంగా ఏర్పాటైన కొన్ని గల్లీలల్లో త్రాగునీటి సరఫరా, సీసీ రోడ్లు వంటి మౌలిక వసతులను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరుస్తామన్నారు. కాలనీలో ప్రజలకు ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ తీగలను వెంటనే మార్చాలని, అదేవిధంగా దోమల బెడదను నివారించేందుకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉప కమీషనర్ లావణ్య, వివిధ విభాగాల అధికారులు, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు బలరాం రెడ్డి, ఇస్మాయిల్, గుబ్బాల లక్ష్మీ నారాయణ, కోల శ్రీకాంత్, సరస్వతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పద్మలతా రెడ్డి, కాలనీ వాసులు భాస్కర్ రెడ్డి, హరీష్, రమణయ్య, రాంబాబు, శ్రీనివాస్, యోగేష్, ఆది నారాయణ, భాస్కర్ రావు, వెంకటేష్, వందన, స్వాతి, నిత్య, లక్ష్మీ, వసంత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

- చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన కొలను హనుమంత రెడ్డి



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 14(సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 290వ డివిజన్, సుభాష్ నగర్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, నియోజకవర్గ అభివృద్ధికి పార్టీ చేస్తున్న కృషికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఎం.డి. నదీమ్, ఎం.డి. తమ్మీత్, ఎం.డి. రఫీక్, ఎం.డి. మునాఫ్, ఎం.డి. సమద్, ఎం.డి. షఫీ, ఎం.డి. ఉసాన్, ఎం.డి. ఇర్ఫాన్, ఎం.డి. ఆవేజ్, ఎం.డి. అజాస్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో 290వ డివిజన్ అధ్యక్షులు ద్వారంపూడి నాగిరెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ అబ్దుల్ గఫ్ఫార్, వైస్ చైర్మన్ ఖైమ్ పాషా, సాయిబాబా నగర్ డివిజన్ మైనారిటీ అధ్యక్షులు ఎం.డి. యాసీమ్, ఎం.డి. జబ్బర్, షేక్ ఇర్ఫాన్, రవి, రాజు, ఎం.డి. కైఫ్ తదితర సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 14(సింగిడి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏ బి వి పి) ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొన్ని పాఠశాలలను బంద్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ రేగోడ్ నాగేష్ మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ మండల విద్యాశాఖ అధికారి పరిధిలోని దేవేందర్ నగర్‌లో ఉన్న సోనీ స్కూల్, సంఘమిత్ర స్కూల్, శ్రీనివాస్ నగర్‌లోని చైతన్య విద్యానికేతన్ తదితర పాఠశాలలు ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థులపై అనవసరమైన ఒత్తిడిని తగ్గించి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పాఠశాలలు నిర్వహించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు గుర్తించిన పాఠశాలలపై విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత మండల విద్యాశాఖ అధికారి ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి, ఆయా పాఠశాలలను స్వయంగా సందర్శించి పరిస్థితులను పరిశీలించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలను పాటించేలా అన్ని ప్రైవేట్ పాఠశాలలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, అవసరమైన చోట నోటీసులు అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల విద్యా హక్కులు, సంక్షేమం మరియు మానసిక ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించాలని ఏబీవీపీ శాఖ కోరారు.

పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష



సిద్ధిపేట బ్యూరో,అక్టోబర్ 14(సింగిడి): దసరా నుండి జిల్లాలో పత్తి కొనుగోలు ప్రారంభించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ లక్ష్మీ కిరణ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం రోజున ఐడిఓసి సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 9 వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 23 సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేయాలని అన్నారు. పత్తి కొనుగోలు చేసేందుకు అన్ని కొనుగోలు కేంద్రాలలో తూకం యంత్రాలు, తేమ శాతం కలిసి యంత్రాలు సిద్ధం చేయాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా కొనుగోలు కేంద్రాల వద్ద త్రాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి దుర్గం ప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా తూనికలు మరియు కొలతల అధికారి శివరంజని, సిసిఐ అధికారులు, పత్తి మిల్లర్లు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మలగన్న అమ్మ... మాత అన్నపూర్ణేశ్వరి

లక్ష్మీ నరసింహ కాలనీ ఫేస్ 1లో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు



జవహర్ నగర్, అక్టోబర్ 14(సింగిడి): అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ ఆ మాత అన్నపూర్ణేశ్వరి దేవియే...అని లక్ష్మీ నరసింహ కాలనీ ఫేస్ 1 చత్రపతి శివాజీ టీం యూత్ సభ్యులు పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసరసర్కిల్ జవహర్ నగర్ శ్రీ లక్ష్మీనరసింహ కాలనీ ఫేస్ 1 లో దేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. లోకానికి ఆహారాన్ని ప్రసాదించే అన్నపూర్ణాదేవి అవతారాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు ఆర్సి శ్రీకాంత్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాత అన్నపూర్ణాదేవి ప్రజలను చల్లంగా చూసి ఈతి బాధలు పడి లేకుండా రక్షించాలని వేడుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు ఇంద్రపాల సత్యనారాయణ, అంబాల విష్ణు, దావత్ అరుణ్, అంబాల మల్లేష్, తదితరులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు. భవాని మాలలు ధరించిన చంద్రయ్య, సుజాత, దత్త, ప్రసన్నరావు, కనకలక్ష్మి, యశ్వంత్, అరుషి, సాయి, లక్ష్మీ, శ్రీనివాస్, వెంకటేష్, సంతోష్, శ్యామల, చితారి, హరీష్, సురేష్, కమలాకర్, శ్రావణ్ తదితర కాలనీవాసులు యూత్ సభ్యులు అమ్మవారి సేవలో తరించి పునీతులయ్యారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఫేస్‌బుక్‌లో ఆన్‌లైన్ గేమింగ్ పెట్టుబడుల పేరుతో మోసం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ స్నేహ మెహ్రా



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 14(సింగిడి): కళ్యాణ్ మార్నింగ్ మిలన్ మార్నింగ్ శ్రీదేవి పేర్లతో నకిలీ విజేతల వీడియోలు, మనీ వోచర్ల ద్వారా సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పీ ఎస్ సూచించారు. సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాను ఉపయోగించుకొని ప్రజలకు అధిక లాభాలు వస్తాయనే ఆశ చూపిస్తూ, ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, పెట్టుబడుల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు ఇలాంటి ప్రకటనలను నమ్మి డబ్బులు పంపవద్దని ఆమె ప్రజలకు సూచించారు. ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త పద్ధతులను అనుసరిస్తున్న నేపథ్యంలో అపరిచిత వ్యక్తులు సోషల్ మీడియాలో పెట్టే పెట్టుబడి ప్రకటనలు, నకిలీ విజేతల వీడియోలు డబ్బులు గెలుచుకున్నట్లు చూపించే వోచర్లు, బహుమతులు పొందేందుకు ముందుగా రుసుములు చెల్లించాలనే సందేశాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ హెచ్చరించారు. కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గట్టనపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఫేస్‌బుక్‌లో ఆన్‌లైన్ గేమింగ్, పెట్టుబడుల ప్రకటనను చూసి సైబర్ మోసానికి గురైన ఘటన వెలుగులోకి వచ్చిందని ఈ ఘటనపై కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 35/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితుడు ఫేస్‌బుక్‌లో కళ్యాణ్ మార్నింగ్ పేరుతో ఉన్న ఆన్‌లైన్ గేమింగ్ ప్రకటనను చూసి, అందులో ఇచ్చిన మొబైల్ నంబర్ ద్వారా సంబంధిత వ్యక్తులను సంప్రదించాడు. మొదట కొంత మొత్తాన్ని పంపితే పెట్టుబడి ద్వారా ఆదాయం పొందవచ్చని నమ్మించారు. అనంతరం ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని కోరడంతో బాధితుడు డబ్బులు బదిలీ చేశాడు. తదనంతరం బాధితుడికి 'కళ్యాణ్ మార్నింగ్ మిలన్ మార్నింగ్ శ్రీదేవి పేర్లతో గెలుపొందినట్లు చూపించే నకిలీ మనీ వోచర్లు పంపించి, సుమారు రూ. 2,65,000 గెలుచుకున్నట్లు నమ్మించారు. అయితే ఆ మొత్తాన్ని విడుదల చేయాలంటే సర్వీస్ ఛార్జీలు, జీఎస్టీ, ఇతర పన్నులు చెల్లించాలని చెప్పి విడతలవారీగా డబ్బులు వసూలు చేశారు. ఈ విధంగా బాధితుడి నుంచి పలు ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా మొత్తం సుమారు రూ. 1,58,300 బదిలీ చేయించుకున్నట్లు కేసు దర్యాప్తులో వెల్లడైంది. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930ను సంప్రదించి, అనంతరం కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. 03 మార్చి 2026న ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేశారు.

పథకం ప్రకారం సోషల్ మీడియా ద్వారా మోసం

దర్యాప్తులో లభించిన సమాచారం ప్రకారం, నిందితులు ఆన్‌లైన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, గేమింగ్ అప్లికేషన్లను ఉపయోగించి ప్రజలను ఆకర్షించే ప్రకటనలు, నకిలీ విజేతల వీడియోలు, డబ్బులు గెలుచుకున్నట్లు చూపించే వోచర్లు తయారుచేసి ప్రచారం చేసినట్లు పోలీసులు గుర్తించారు. వీటిని చూసిన అమాయక ప్రజలు నిజంగానే డబ్బులు గెలుచుకున్నారని నమ్మి సంప్రదించేలా చేసి, గెలుపొందిన మొత్తాన్ని పొందాలంటే ముందుగా ప్రాసెసింగ్ ఫీజు, సర్వీస్ ఛార్జీలు, జీఎస్టీ తదితర పేర్లతో డబ్బులు చెల్లించాలని కోరినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాధితులు పంపిన డబ్బులను వివిధ బ్యాంకు ఖాతాలు, ఆన్‌లైన్ పేమెంట్ స్కానర్ల ద్వారా బదిలీ చేసినట్లు కేసు దర్యాప్తులో గుర్తించారు. మరో ముగ్గురు నిందితులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ తమ సిబ్బందితో కలిసి తెలంగాణలోని కామారెడ్డి పట్టణ బస్‌స్టాండ్ ప్రాంతంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఒక తెల్లరంగు మారుతి సుజుకి స్విఫ్ట్ డిజైర్ కారు, పలు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ కేసులో గతంలోనూ కొందరు నిందితులను అరెస్ట్ చేయడం జరిగింది. మిగిలిన నిందితుల కోసం దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ మరియు ఆయన బృందం సాంకేతిక ఆధారాలు, బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ ఆధారాల పరిశీలనతో దర్యాప్తు చేపట్టారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, నిందితుల పాత్రను గుర్తించేందుకు పోలీసులు చర్యలు కొనసాగిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ప్రజల ఆశలు, అత్యవసర అవసరాలు, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆకాంక్షలను ఆసరాగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. అపరిచిత వ్యక్తులు చెప్పే మాటలను గుడ్డిగా నమ్మి కష్టపడి సంపాదించిన డబ్బును కోల్పోవద్దు. ఏదైనా ఆన్‌లైన్ పెట్టుబడి లేదా గేమింగ్ ప్రకటన కనిపించినప్పుడు ముందుగా దాని నిజానిజాలను పరిశీలించాలి. అనుమానాస్పద లావాదేవీలకు దూరంగా ఉండాలి. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు, ఇలాంటి మోసాల గురించి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, పరిచయస్తులకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు.

వృద్ధులకు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ది నెస్ట్ వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

వృద్ధుల హక్కులు, సంక్షేమం మరియు చట్టపరమైన రక్షణ గురించి అవగాహన





సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 14(సింగిడి): సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్‌లోని ది నెస్ట్ వృద్ధాశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య మంగళవారం అమీన్‌పూర్‌లోని శ్రీవాణి నగర్‌లో ఉన్న ది నెస్ట్ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో వృద్ధులకు కల్పిస్తున్న వసతి, ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు, పరిశుభ్రత మరియు ఇతర మౌలిక సదుపాయాల గురించి వివరాలు తెలుసుకున్నారు. వృద్ధులకు నాణ్యమైన ఆహారం, తగిన వైద్య సంరక్షణ, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంతో పాటు వారి ఆరోగ్యం, భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడిన కార్యదర్శి వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలు మరియు వారి దైనందిన జీవన పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. వృద్ధాప్యంలో ఉన్నవారికి శారీరక సంరక్షణతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మీయత, గౌరవం మరియు భావోద్వేగపరమైన మద్దతు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వృద్ధుల హక్కులు, సంక్షేమం మరియు చట్టపరమైన రక్షణ గురించి అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు మరియు వృద్ధుల పోషణ, సంక్షేమానికి సంబంధించిన చట్టపరమైన నిబంధనల గురించి వివరించారు. వృద్ధులను నిర్లక్ష్యం చేయడం, వారి హక్కులకు భంగం కలిగించడం వంటి సమస్యలు ఎదురైనప్పుడు చట్టపరమైన సహాయం పొందవచ్చని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందించబడుతుందని, న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు సంస్థను సంప్రదించవచ్చని వివరించారు. వృద్ధులకు తమ హక్కులపై అవగాహన కల్పించడం, వారి సమస్యలకు తగిన పరిష్కార మార్గాలను చూపించడం న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య ఉద్దేశ్యాలలో భాగమని తెలిపారు. అలాగే, కుటుంబ సభ్యులు వృద్ధుల పట్ల ప్రేమ, గౌరవం, ఆప్యాయతతో వ్యవహరించాలని, వారి అవసరాలను గుర్తించి తగిన సంరక్షణ అందించాలని సూచించారు. వృద్ధులు సమాజానికి చేసిన సేవలను గుర్తిస్తూ, వారికి గౌరవప్రదమైన జీవనం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వృద్ధాశ్రమాల నిర్వహణలో పరిశుభ్రత, భద్రత, వైద్య సేవలు మరియు వృద్ధుల వ్యక్తిగత గౌరవానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వృద్ధుల సమస్యలను సానుభూతితో విని, వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా వారు సురక్షితమైన వాతావరణంలో జీవించేలా చూడాలని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరఫున నిర్వహించే న్యాయ అవగాహన కార్యక్రమాల ద్వారా వృద్ధులు సహా సమాజంలోని బలహీన వర్గాలకు న్యాయంపై అవగాహన కల్పిస్తూ, వారికి అందుబాటులో ఉన్న చట్టపరమైన సహాయ సేవలను చేరువ చేయడానికి కృషి చేస్తున్నట్లు కార్యదర్శి గారు తెలిపారు. ఈ సందర్శన వృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ మరియు ఉచిత న్యాయ సహాయంపై అవగాహన పెంపొందించే దిశగా నిర్వహించబడింది.

భక్తి భావానికి వేదికలు... శరన్నవరాత్రి ఉత్సవాలు

అమ్మలగన్న అమ్మ.. బెజవాడ దుర్గమ్మ

మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా



జవహర్ నగర్, అక్టోబర్ 14(సింగిడి): భక్తి భావానికి వేదికలు శరన్నవరాత్రి ఉత్సవాలని... అమ్మలగన్న అమ్మ బెజవాడ దుర్గమ్మయే అని అమ్మవారి ఆశీస్సులు జవహర్ నగర్ ప్రజలపై ఉండాలని కోరుకున్నట్టు జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ సంతోష్ నగర్ కాలనీలో కొలువుదీరిన దుర్గామాత మండపంలో మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి అభిషేకం కుంకుమార్చన చేసి ఆ తర్వాత భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తి భావంతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో పాటు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ దుర్గామాతను వేడుకున్నట్లు తెలిపారు. జవహర్ నగర్ అభివృద్ధిలో యువత ముందుండాలని, జవహర్ నగర్ సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి కరుణాకటాక్షాలతో జవహర్ నగర్ లో సమృద్ధిగా వర్షాలు పడి పాడి పంటలతో తెలంగాణ రాష్ట్రం పచ్చంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రమణప్ప, నరసింహ గౌడ్, సుధాకర్, విజయ, మనోజ్, అనిరుద్, శ్రీమన్నారాయణ, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మహిళలు భక్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాల పరిశ్రమల ఎక్స్‌పో ఏర్పాట్లపరిశీలన



కొడంగల్, అక్టోబర్ 14(సింగిడి): కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేట్‌లో నిర్వహించనున్న వ్యవసాయ అనుబంధ రంగాల పరిశ్రమల ఎక్స్‌పో రైతు మేళా కు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను తెలంగాణ అగ్రికల్చర్ ప్లానింగ్ కమిషన్ సురేంద్ర మోహన్, పరిశీలించారు. మంగళవారం ఎక్స్‌పో నిర్వహణకు అవసరమైన వేదిక ఏర్పాట్లు, ప్రదర్శన స్టాళ్లు, ఇతర మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించి, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించి ముందస్తు ప్రణాళిక తో సిద్ధం గా ఉండాలని అధికారులకు ఆదేశించారు.వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల అభివృద్ధి, రైతులకు అందుబాటులో ఉన్న వివిధ అవకాశాలను ప్రదర్శించేందుకు ఈ ఎక్స్‌పో రైతు వేదికగా నిలవనుందని అన్నారు . వ్యవసాయ రంగ అభివృద్ధికి దోహదపడే పరిశ్రమలు, అనుబంధ శాఖల మధ్య సమన్వయం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడనున్నాయి.కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేసి, రైతు ఎక్స్‌పోను విజయవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం కొడంగల్ కాడ కార్యాలయం లో వికారాబాద్, నారాయణ పేట్ జిల్లాలకు సంబందించి వ్యవసాయ, హార్టీ కల్చర్, మార్కెటింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ నవంబర్ లో మూడు రోజుల పాటు నిర్వహించే పరిశ్రమల ఎక్స్‌పో రైతు మేళా కార్యక్రమాన్ని వ్యవసాయ అనుబంధ శాఖల సమన్వయము తో ప్లానింగ్ చేయాలని, సూచించారు.

సీఎం మూడు రోజుల సమావేశాల నేపథ్యంలో ఎక్స్‌పో ఏర్పాట్లపై సమీక్ష

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు రోజుల పాటు (స్టార్ట్స్ ప్రారంభం, రైతులకు అవగాహనా కార్యక్రమాలు, సమావేశాలు) నిర్వహించనున్న నేపథ్యంలో, హకీం పేట్‌లో ఎక్స్‌పో వేదిక ఏర్పాటు, ప్రదర్శన స్టాళ్లు, ఇతర మౌలిక సదుపాయాల పురోగతిని పరిశీలించారు. ఎక్స్‌పోను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని, సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి, పరిశ్రమల ప్రోత్సాహం, ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, రైతులకు అందుబాటులో ఉన్న అవకాశాలను వివరించేందుకు ఈ ఎక్స్‌పో ఉపయోగపడనుందని తెలిపారు.. ఖరీఫ్ లో పంటల మార్పిడి ఎలా జరుగుతుంది, ఎన్ని ఎకరాలలో ఏ ఏ పంటలు వేశారు, పంటల పరిస్థితి ఎలా ఉంది, అని సంబంధిత అధికారులతో వివరాలు అడిగిన తెలుసు కున్నారు.. ఉద్యానవన పంటలపై మరియు మార్కెటింగ్, సెరికల్చర్ పై సమీక్షించారు..కొడంగల్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి వీడియోలు, ఫొటోస్ సబ్మిట్ చేయాలనీ అధికారులకు సూచించారు. దేశం లో ఎక్కడ లేని విధంగా సెరికల్చర్‌హబ్‌గా కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చి దిదాలని అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశం లో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్ పి స్నేహ మెహర, అదనపు కలెక్టర్లు ఉమా శంకర్ ప్రసాద్,శ్రీనివాస్ వ్యవసాయ, హార్టీ కల్చర్ డైరెక్టర్ లు గోపి, యాస్మిన్ బాషా, ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూరు, లక్ష్మీ, కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,రాజా రెడ్డి,సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

శ్రీ అన్నపూర్ణాదేవి కటాక్షంతో నియోజకవర్గం సస్యశ్యామలం కావాలి'

రాయసముద్రం పోచమ్మ ఆలయాన్ని దర్శించుకున్న బిఆర్ఎస్ ఇన్‌చార్జి ఆదర్శ్ రెడ్డి



రామచంద్రాపురం, అక్టోబర్ 14(సింగిడి): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రాయసముద్రం చెరువు సమీపంలోని ప్రసిద్ధ పోచమ్మ దేవాలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఆదర్శ్ రెడ్డి మంగళవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాల్లో మూడవ రోజు అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి దివ్యాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి విచ్చేసిన ఆదర్శ్ రెడ్డ

Editorial

ఎడిటోరియల్

భారత క్షిపణి పితామహుడు అబ్దుల్ కలాం

"ప్రపంచ విద్యార్థుల దినోత్సవం")

'లీడ్ ఇండియా' అంటూ యువతను దేశాభివృద్ధి మహాయజ్ఞంలో పాలు పంచుకోవాలని పిలుపును ఇచ్చిన మన ప్రియతమ ఏ. పి. జె. అబ్దుల్ కలాం భరతమాత ముద్దు బిడ్డగా జాతి గౌరవాన్ని అంతర్జాతీయ వేదికల మీద చాటి చెప్పి అనన్య సామాన్యుడు, మేరునగ ధీరుడు, అనితర సాధ్య ఘనుడు. భారత 11వ రాష్ట్రపతిగా (2002–07) విశిష్ట సేవలందించి 'పీపుల్స్ ప్రెసిడెంట్'గా ప్రజల గుండెల్లో చెరగని ముద్రను వేసిన అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం 15 అక్టోబర్ 1931న ప్రముఖ దక్షిణ భారత తీర్థ స్థలం రామేశ్వరంలో పేద తమిళ ముస్లిమ్ కుటుంబంలో ఆశియమ్మ – జైనులబ్దీన్ దంపతులకు జన్మించారు. రామేశ్వరంలో పాఠశాల విద్య, తిరుచురాపల్లి సెయింట్ జోసెఫ్ కాలేజీలో భౌతిక శాస్త్రం (1954), మద్రాస్ యంఐటిలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ (1960) పట్టాలు పొందారు.

మెసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా:

అతి సాధారణ విద్యార్థి దశ నుంచి అసాధారణ మేధావిగా కలాం ఎదిగిన క్రమం విలక్షణం, ఆశ్చర్యకరం. నాలుగు దశాబ్దాల ఉద్యోగపర్వంలో ఏరోస్పేస్ సైంటిస్ట్‌గా, సైన్స్ అడ్మినిస్ట్రేటర్‌గా విలక్షణ సేవలందించే క్రమంలో డిఆర్‌డిఓ (డిఫెన్స్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్), ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసర్చ్ అర్గనైజేషన్) సంస్థల్లో పరిపాలనాదక్షుడిగా, మిలటరీ మెసైల్ రూపశిల్పిగా తన సత్తా చాటి 'మెసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా కీర్తించబడ్డారు. ప్రధాని ముఖ్య వైజ్ఞానిక శాస్త్ర సలహాదారుగా, డిఆర్‌డిఓ సెక్రటరీగా 1992 నుంచి 1999 వరకు పని చేశారు. స్వావలంభన దిశగా భారతదేశాన్ని న్యూక్లియర్ ఎనర్జీ కలిగిన దేశంగా నిలపటానికి 1998లో పోక్రాన్–II పరీక్షలను పర్యవేక్షించి ప్రజల చేత జేజేలు అందుకున్నారు. భారత వాయు సేనలో ఫైటర్ పైలెట్‌గా పని చేయాలనుకున్న కలాం ఏరోస్పేస్ శాస్త్రజ్ఞుడిగా ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగారు. ఇంజనీర్, సైంటిస్ట్, రచయిత, ఆచార్యులు, యువత ఆరాధ్య దైవం, ఆదర్శ రాజకీయవేత్త, యువతకు మార్గదర్శిగా బహుముఖీన ప్రతిభ కలిగిన అబ్దుల్ కలాం బోధనలు అనితరసాధ్యాలు. నేను చేయగలననే దృఢ సంకల్పమే విజయాలను అందిస్తుందని, ఎవరి తలరాతను వారే లిఖించుకోవాలని, నిజాయితీగల హృదయంతోనే అసలైన ఆకర్షణీయ వ్యక్తిత్వం వ్యక్తం అవుతుందని బోధనలు చేశారు.

కలలు కందాం, సాకారం చేసుకుందాం:

'ఉన్నత కలలు కనండి, సాకారానికి కఠోర సాధన చేయండి' అంటూ నినదించిన కలాం జీవితం తెరిచిన పుస్తకం, యువతకు మార్గదర్శకం. పడవలు నడిపే వృత్తిలో పేరుగాంచిన కలాం కుటుంబం, వ్యాపారంలో నష్టం రావడంతో కష్టాల కడలిలో పట్టుదలతో చదువులను కొనసాగిస్తూ, పేపర్ బాయ్‌గా పని చేస్తూ, ఏరోస్పేస్ ఇంజనీ రింగ్‌ను పూర్తి చేయగలగడం నేటి యువతకు ప్రేరణాత్మకం. ఉద్యోగిగా తన సీనియర్స్ డా: విక్రమ్ సారాభాయ్, ఆచార్య సతీష్ ధవన్, డా: బ్రహ్మ ప్రకాశ్ లాంటి దిగ్గజాల వద్ద నాయకత్వ పటిమను, అంతరిక్ష శాస్త్రసాంకేతిక మెలకువలను నేర్చుకున్నారు. 1969లో ఇస్రోకు బదిలీ అయిన కలాం నేతృత్వంలో భారత తొలి స్వదేశీ పరిజ్ఞా నంతో 'సాటలైట్ లాంచింగ్ వెహకిల్ (యస్‌యల్ వి–3')ను రూపొందించుటలో విజయం సాధించారు. 1970–90ల మధ్య పియస్‌యల్‌వి (పోలార్ సాటలైట్ లాంచింగ్ వెహకిల్)తో పాటుగా యస్‌యల్‌వి–3లను అభివృద్ధి చేయటలో ప్రధాన భూమికను నిర్వహించారు. 'బాలిస్టిక్ మెసైల్' టెక్నాలజీతో 'ప్రాజెక్ట్ డెవిల్', 'ప్రాజెక్ట్ వాలియంట్' లను రూపొందించడంలో మార్గదర్శనం చేశారు. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మెసైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఐజియండిపి) ద్వారా కలాం చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ? 3.88 బిలియన్ పెట్టుబడితో పరిశోధనలు కొనసాగించారు. 'అగ్ని', 'పృథ్వి'మెసైల్‌లను విజయవంతంగా నిర్మించగలిగారు. 1998లో చవకైన 'కలాం–రాజు కరోనరీ స్టంట్'ను, 2012లో 'కలాం–రాజు టాబ్లెట్' హెల్త్‌కేర్ కంప్యూటర్‌ను రూపొందించారు. టెక్నాలజీ సహాయంతో ఆర్థిక, వ్యవసాయ, ఆరోగ్య, విద్యారంగాలను పరిపుష్టం చేయవచ్చని గట్టిగా నమ్మిన కలాం ముందు చూపు అద్వితీయం. 'జననం సాధారణమే కావచ్చు, మరణం మాత్రం చరిత్ర సృష్టించేదిగా ఉండాలని' ఉద్బోధించారు.

లీడ్ ఇండియా రూపశిల్పి:

25 జూలై 2002న రాష్ట్రపతి పదవిని చేపట్టి భారత తొలి పౌరుడిగా 'ప్రజా రాష్ట్రపతి'గా పేరు తెచ్చుకున్నారు. భారత అత్యుత్తమ 'భారత రత్న'ఆవార్డు పొందిన ఏకైక తొలి సైంటిస్ట్, బాచిలర్ కలాం అనంతరం రాష్ట్రపతిగా విశిష్ట సేవలు అందించారు. రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన అనంతరం అబ్దుల్ కలాం 'లీడ్ ఇండియా – 2020' ఉద్యమాన్ని ప్రారంభించి ఐదేళ్ళలో 5 లక్షల యువతకు మార్గదర్శకం చేయాలనే లక్ష్యాన్ని ఛేదించుటకు కృషి చేశారు.

'సక్సెస్ అంటే మన సంతకం ఆటోగ్రాఫ్‌గా మారాడమే' అన్న కలాం 'కల అంటే నిద్రలో వచ్చేది కాదని, నిద్ర పోనివ్వకుండా విజయం వరించే దాకా మనల్ని కార్యోన్ముఖులను చేసేది' అని నమ్మిన అపూర్వ మూర్తిమత్వ నిధి మన అజేయ అబ్దుల్ కలాం సామాన్య ప్రజల మదిలో తిష్టవేసిన ప్రేరణామూర్తి, నిత్య చైతన్య స్ఫూర్తి.

– డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

బాలల వికాస తరంగిణి
తురగా జానకీరాణి

నేడు తురగా జానకీరాణి వర్ధంతి

పిల్లలారా రారండోయ్... బాల బాలికలు రారండోయ్... బాలల ప్రోగ్రాం విన రారండోయ్... అంటూ ప్రారంభమై, పాటతో మొదలై... 'పోదామా ఇక పోదామా ఇళ్లకు... మన ఇళ్లకు...అనే ముగింపుతో వినిపించే రేడియోలో ప్రసారమయ్యే బాలానందం కార్యక్రమం కోసం పిల్లలే కాదు... పెద్దలు సైతం ఉత్సాహం తో ఎదిరి చూసిన పాత జ్ఞాపకాలు అయిదు పదుల వయసు దాటిన వారికి చేటుగి పోనివి. రేడియో అక్కయ్యగా తురగా జానకీరాణి, ఆకాశవాణి ద్వారా నిర్వహించిన పిల్లల కార్యక్రమాలు మరిచి పోలేనివి.

ఎందరో చిన్నారులు బాలా నందంలో పాల్గొనే అవకాశం పొంది, తమ కంఠం వినిపించ డం వెనుక ఆమె పాత్ర మరిచి పోలేనిది. పాటలు, నాటికలు, రూపకాలు వంటి ఎన్నో కార్యక్రమాలను రూపొందించి వాటిలో చిన్నారులతో ప్రదర్శింప చేసిన ఆమె కృషి మరిచి పోనిది. ఎందరో ప్రముఖులు తమకు చిన్నతనంలో ఆకాశవాణిలో రేడియో అక్కయ్యతో వున్న అనుభవం మర్చిపోకుండా ఉంటారు.



తురగా జనకీరాణి (ఆగష్టు 31, 1936– అక్టోబరు 15, 2014) ఆలిండియా రేడియోలో నేటికీ రేడియో అక్కయ్యగా సుపరిచి తురాలు అయిన ఆమె రచయిత్రి, సంఘ సంస్కర్త ..

ఆకాశవాణి ఉద్యోగంలో చేరక ముందు రేడియో ఆర్టిస్టుగా , రాత్రి 7 నుండి 7.50 వరకు కథానికా పఠనం చేసే వారు. ఆకాశవాణిలో ఆమె అనేక కొత్త ప్రయోగాలు చేశారు. చొప్పదంటు ప్రశ్నలు, బాలవాణి వంటి కార్యక్రమా లు, కంగారు మామయ్య, కొంటె కృష్ణయ్య, వెర్రి వెంగళప్ప వంటి పాత్రలు ప్రవేశపెట్టి చిన్నారి శ్రోతలకు చేరువ అయ్యారు. వందకి పైగా కథలు రచించారు. అవి మూడు సంపుటాలుగా వెలువ డ్డాయి. మూడు నవలలు, ఐదు బాలసాహిత్యం మీద పుస్తకాలు వచ్చాయి అనువాద రచనలు కూడా మూడు వచ్చాయి. పలు పత్రికల్లో వీరు రచించిన కథలు ప్రచురించ బడ్డాయి. సన్మానం, మంచిమనస్సు, ఉపాయం, వాదన, ఆడపిల్ల వంటి కథలతో కూడిన 'మిఠాయి పొట్లం 'కథల సంపుటి కేంద్ర ప్రభుత్వ సంస్థ 'పబ్లికేషన్స్ డివిజన్' ప్రచురించింది. మరో కథల సంపుటి 'బంగారు పిలక 'ని నేషనల్ బుక్ ట్రస్టు వారు ప్రచురించారు. రెడ్ క్రాస్ కథను అనువదించారు.

ఆకాశ వాణి ద్వారా..."ఇది నా సమస్య" అని స్త్రీల కార్యక్రమం ప్రసారం చేసి స్త్రీలు తమ సమస్యలు ఉత్తరాల ద్వారా తెలియ పరిస్తే వాటి పరిష్కారాలు నిపుణులైన డాక్టర్లు, లాయర్లు మొదలైన వారిచేచెప్పే కార్యక్రమాల, వృద్ధుల కోసం తమ జీవితా నుభవాలు తెలిపే "ప్రవంతి" అనే కార్యక్రమం వెనుక జానకీ రాణి కృషి అభినందనీయం.

దృశ్యశ్రవణ విధానంతో విజ్ఞానం అందించవచ్చని అమ్మ–పాప, చిలుక పలుకులు, ఉదయబాల, అమ్మా నేను బడికి పోతా, బంగారు పాప వంటి పలు సిడిలను రూపొందించారు. జానకీరాణి సేవలకు గుర్తింపుగా 'సనాతన ధర్మ ',బాలసాహిత్య పరిషత్ ' వంటి పలు సంస్థలు వీరిని సత్కరించాయి. వీరికి 1991,1992లో వరుసగా రెండు సార్లు నేషనల్ బెస్ట్ బ్రాడ్ క్యాస్టరుగా అవార్డు పొందారు.

ఉద్యోగ నిర్వహణలో భాగంగా ఎందరో పేరెన్నిక గల వారితో పని చేశారు .అక్కినేని నాగేశ్వర రావు, ఎస్.పి. బాలసుబ్రహ్మ మణ్యం, జె.వి. సోమయా జులు, మంజు భార్గవి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, స్థానం నరసింహారావు, వేలూరి శివానంద, గోపీచంద్.... ఇలా ఎందరితోనో కలిసి కార్యక్ర మాలు రూపొందించారు.

యూనిసెఫ్ లో, ఎన్.సి.ఆర్.టి., ప్రభుత్వ శాఖల కోసం పని చేసేటప్పుడు బాల జాగృతి (బా జా)అనే కార్యక్రమం చేపట్టి 670 (రేతీవప్ ఎష్ట్రశీఎం) వీధి ప్రదర్శనలు చేశారు. బాలల హక్కులు, సమస్యలు, బాల కార్మిక నిర్మూలన, ఇత్యాది ఎన్నో విషయాలపై ప్రజల్లో అవగాహన కల్పించేవాళ్ళు. సామాజిక స్పృహ వున్న విషయాలు, సృజనాత్మక సందేశాలు పిల్లలు, యువతీ యువకులు శిక్షణ పొంది ప్రదర్శించేవాళ్లు. జానకీరాణి... 2011లో బాల సాహిత్య పరిషత్ ద్వారా "బాలసాహిత్య రత్న" అవార్డు, గహలక్ష్మీ స్వర్ణకంకణం, రెండు సార్లు తెలుగు విశ్వ విద్యాలయ పురస్కారం, రాష్ట్రప్రభుత్వ ఉగాది పురస్కారం, పింగళి వెంకయ్య స్మారక సత్కారం, అరవిందమ్మ మాతృమూర్తి అవార్డు, సుశీల నారాయణరెడ్డి సాహితీ పురస్కారం, ఆంధ్ర సారస్వత పరిషత్తులో పరిణిత వాణి గౌరవం, 'ఈనాడు' అవార్డు, బాలబంధు, దక్షిణ మధ్య రైల్వే గౌరవ సత్కారం... ఎలా ఎన్నో పురస్కారాలను అందు కున్నారు. కొంతకాలంగా మధుమేహ వ్యాధితో బాధ పడుతూ, అక్టోబరు 15, 2014న ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

ప్రకృతి పర్యావరణానికి
ప్రమాద ఘంటికలు...
సముద్రా జలాల కాలుష్యం

మానవుని దైనందిత ఆర్థిక కార్యకలాపాల ద్వారా విడుదలయ్యే ఘన ద్రవ వాయు వ్యర్థాలు జీవావరణ సమ తౌల్యానికి హాని కలిగించే పరిస్థితులనే పర్యావరణ కాలుష్యం అంటారు. వ్యవసాయ పారిశ్రామిక విప్లవాలు ధర్మల్ శక్తి ద్వారా విద్యుత్ ఉత్పాదన ఆటోమొబైల్స్ వాడకం వల్ల అనేక వ్యర్థాలు వాతావరణం లో విడుదలవుతాయి. ఆధునిక మానవుని వినియోగస్థాయి పెరిగి నేల నీరు గాలి కలుషితం చేసే వ్యర్థాల పరిణామం పెరిగింది. ఈ వ్యర్థాలలో కొన్నింటికి జీవావరణ వ్యవస్థలో సహజంగా కలిసిపోయే గుణం ఉంటుంది .



సముద్ర జలాల కాలుష్యం (మెరైన్ పొల్యూషన్): మానవ కార్యకలాపాల వల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా అనేక రకాల వ్యర్థాలు సముద్ర గర్భంలో కలిసి సముద్ర కాలుష్యం ఏర్పడుతుంది. కాలువలు నదీ జలాలు సముద్రంలో కలుస్తున్నాయి. ఈ ప్రవాహాలలో చెత్తాచెదారం జంతు కళేబరాలు లవణాలు భారీ లోహాలు, చమురు డీజిల్ పెట్రోల్ క్రిమిసంహారక మందులు రసాయనక ఎరువులు కిరణధార్మిక వ్యర్థాలు సముద్రంలో కలవడం వల్ల సముద్ర జలాలు కలుషితమై పోతున్నాయి.

ప్రపంచ జనాభా: ప్రపంచ జనాభాలో ఎక్కువ శాతం జనాభా సముద్ర తీరాలలో నివసిస్తూ మత్స్య సంపద పగడపు దిబ్బలు సముద్ర గడ్డి మైదానాలు మాగాని క్షేత్రాల వంటి సముద్ర వనరుల ఆధారంగా జీవనం గడుపుతున్నారు. మనదేశంలో ఎక్కువమంది ప్రజలు మత్స్య పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. సముద్ర తీరాలలో జనసాంద్రత అధికమై గృహాలు భవనాలు వంటి కట్టడాలు ఇతర ప్రాంతాలకు ఇసుక తరలింపు సిమెంట్ ఉత్పత్తికి ఉపయోగపడే పగడపు దిబ్బలను దోచుకోవడం ఘన పదార్థాలను అధిక మొత్తంలో సముద్రంలోకి విడుదల చేయడం జరుగుతుంది. దీనివల్ల కాలుష్యం సముద్ర పెరిగిపోతుంది.



సముద్రపు రవాణా: సముద్రపు రవాణా ఓడలు ట్యాంకర్ల ద్వారా చమురు ఉత్పత్తులు తరలించడం వల్ల 300 మిలియన్ గ్యాలన్ల చమురు సముద్రంలోకి కలుస్తుంది. 1963 వ సంవత్సరంలో టెర్రీ కా నియన్ ప్రమాదంలో కలిసిన చమురు అర అంగుళం మందంతో 8683 చదరపు కిలోమీటర్లు సముద్రపు తీరం వరకు వ్యాపించింది. ఇంద్రా డాన్ బేసిన్ నుంచి ప్రతి సంవత్సరం 90000 లీటర్ల చమురు పదార్థాలు సముద్రంలో కలుస్తున్నాయని బొంబాయి పోర్ట్ ట్రస్ట్ వారు సముద్ర కాలుష్యంపై ఏర్పాటు చేసిన ఒక నివేదికలో వెల్లడించారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు: యునైటెడ్ స్టేట్స్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అంచనాల ప్రకారం ఇప్పటివరకు 60 మిలి యన్ల పౌండ్ల ప్లాస్టిక్ పదార్థాలు సముద్రంలో కలుస్తున్నాయని తెలిపారు మనదేశంలో 55 వేల మెట్రిక్ టన్నుల పెట్రిసైడ్ రసాయన ఎరువులు సముద్రంలో కలుస్తున్నాయని అంచనా. అలాగే హానికరం అణు ధార్మిక వ్యర్థాలు సముద్ర కాలుష్యాన్ని పెంచుతున్నాయి. మత్స్య సంపదకు నిలయమైన సముద్ర కాలుష్యం వల్ల చేపలు ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. సముద్ర తీరానికి దగ్గరగా చేపలను ఎక్కువగా సేకరించడం వల్ల మత్స్య వనరులు 90% తగ్గిపోయాయని ఫిష్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ సంస్థ తెలిపింది.

సముద్ర పక్షి జాతులు: ప్లాస్టిక్ తో కలుషితమైన ఆహారం వల్ల సుమారు 280 జాతుల సముద్ర పక్ష్యాదులు అనేక వ్యాధులకు గురైతున్నాయి. సముద్రపు కాలుష్యం కారణంగా వీటి గుడ్లపై పెంకు మందం తగ్గి వాటి పునరుత్పత్తి తగ్గుతుంది. చమురు కాలుష్యం వివిధ సముద్ర జంతువులకు అనేక క్లిష్ట సమస్యలను సృష్టిస్తుంది.

మత్స్య సంపద: ప్రపంచ సముద్ర జలాల కాలుష్యం వల్ల మత్స్య సంపద అంతరించిపోతుంది. సముద్ర కాలుష్యం వల్ల ప్రతి సంవత్సరం ఈ 50 వేల నుండి రెండు లక్షల 50వేల వరకు పక్షులు మరణిస్తున్నాయని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్ర జలాలలో చమురు కాలుష్యం పెరిగి పౌష్టికాహారంగా ఉపయోగించే చేపలలో హైడ్రో కార్బన్లు చేరి మానవులకు క్యాన్సర్ వంటి రోగాలు అనారోగ్యాలకు హేతువులు అవుతున్నాయని పర్యావరణవేత్తల ఆందోళన.

నివారణ పద్ధతులు: ప్రపంచంలో 177 దేశాలకు సముద్ర తీరాలు ఉన్నప్పటికీ కేవలం 92 దేశాలు మాత్రమే సముద్ర కాలుష్య నివారణకు యాజమాన్య పద్ధతులను అమలు చేస్తున్నాయి. ది వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ వై నేచర్ అండ్ వరల్డ్ కన్జర్వేషన్ యూనియన్ వారు సముద్ర కాలుష్య నివారణకు వివిధ సూత్రాలను వెల్లడించారు. సముద్ర కాలుష్య నివారణకు సముద్ర జీవ వైవిద్యాన్ని రక్షించడానికి అనేక ప్రణాళికను రూపొందించారు. వాటిలో ప్రజలకు సముద్రావరణ తద్వారా చేకూరే లాభాల గురించి అవగాహన పెంచడం, స్థానిక ప్రజలు సముద్ర కాలుష్య నివారణలో స్వచ్ఛందంగా పాల్గొనడం, ప్రపంచ సముద్ర జలాలన్నింటిని పాలసీ పరిధిలోకి ఉంచడం, ప్రభుత్వాలు తమ పరిధిలోని సముద్రాల యాజమాన్యం నిర్వహిస్తూ పొరుగు దేశాలతో సహకరించడం వంటి కర్తవ్యాలు నిర్వహించడం ద్వారా ప్రపంచ సముద్ర జల కాలుష్యాన్ని నివారించవచ్చునని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

పందిరి శ్రీనివాసులు
ఎంఏ (జాగ్రఫీ) బీఈడీ,
ఎంసీజే (జర్నలిజం), పి జి డి సి జె (జర్నలిజం)
ఉస్మానియా యూనివర్సిటీ.

అంగడి వస్తువు



తన వెంట ఎందరో పడుతున్నారని..
పరమానంద పడొద్దు యువతులారా !
చవకైన వాటి చుట్టే జనం మూగుతారు
ఖరీదైనవి అందరికీ సులభంగా దొరకవు !

తప్పును సరిచేసిన వారిని ద్వేషించకు
వారు నీ ఎదుగుదలకు నిచ్చెనగా నిలిచారు
తప్పు చేసినా మౌనంగా చూసిన వారు..
నీ పతనాగ్నికి ఆజ్యం పోస్తున్నట్లే !

నీవు అనుకున్నవన్నీ జరిగితే..
నీవే దేవుడిలా ఫోజు కొడతావు
జరిగిన వాటిని పునాదిగా చేసుకొని..
భవిష్యత్తును నిర్మించుకున్నోళ్లే హీరోలు !

అలు పెరుగని సంపాదన పరుగులో..
నిన్ను నువ్వు కోల్పోయి వెనక్కి చూస్తే..
నీ నీడ కూడా నిన్ను చూసి నవ్వుతుంది
మనశ్శాంతిని హరిస్తుంది నీ సంపాదన !

పేదోడికి ఆనందాల ఆస్తి ఉంది
ధనికుడి చేతులో సుఖ సౌఖ్యాలున్నాయి
సుఖాన్ని ఇచ్చే సౌకర్యాలను కొనుక్కోవచ్చు
సంతోష సంపద అంగడి వస్తువు కాదు !

మధుపాళీ
9949700037

అభివృద్ధికి ఎంపీ వంశీకృష్ణ అండ



మంచిర్యాల, అక్టోబరు 14 (సింగిడి): మురుగు నీటి సమస్యకు పరిష్కారం ఎప్పుడు దొరుకుతుందా..? రహదారులపై నీరు నిలవకుండా ఎప్పటికి డ్రైనేజీ నిర్మిస్తారా..? అంటూ ఏళ్లుగా ఎదురుచూస్తున్న స్థానికులకు ఎట్టకేలకు ఊరట లభించనుంది. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5, 8వ డివిజన్లలో ఎంపీ లాడ్స్ నిధులతో కల్వర్టు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రూ. 10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ పనులకు బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు మంథెన జగన్ మోహన్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచిర్యాల నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎంపీ లాడ్స్ నిధులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

రెండు దశాబ్దాల నిరీక్షణ...

5వ డివిజన్‌లో డ్రైనేజీ నిర్మాణం కోసం సుమారు 20 ఏళ్లుగా ఎదురు చూస్తున్నామని ఆ డివిజన్ కార్పొరేటర్ రాజేశ్వరి తెలిపారు. ఇన్నేళ్లుగా ఎదురవుతున్న సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు పడటంపై సంతోషం వ్యక్తం చేశారు. డ్రైనేజీ నిర్మాణంతో స్థానికులకు ఇబ్బందులు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణాల్లో రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టుల వంటి మౌలిక వసతులు ప్రజల రోజువారీ జీవనంతో ముడిపడి ఉంటాయి. చిన్నపాటి సమస్యగా కనిపించే మురుగునీటి పారుదల లోపం కూడా నివాసితులకు దీర్ఘకాలిక ఇబ్బందులు కలిగిస్తుంది. ఈ నేపథ్యంలో నిధుల కేటాయింపుతోపాటు పనులను నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయడం కీలకం. అప్పుడే స్థానికులకు అభివృద్ధి ఫలాలు అందుతాయి. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పలయ్య, వేణు, వనపర్తి రాజేష్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాతికేళ్లుగా దుర్గామాత సేవలో సుభాష్ యూత్

శాలవాడలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు.. ప్రతిరోజూ అన్నదానం, ప్రత్యేక పూజలు



జమ్మికుంట, అక్టోబర్ 14 (సింగిడి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని శాలవాడ లో సుభాష్ యూత్ ఆధ్వర్యంలో గత 25 ఏళ్లుగా దేవీ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కులమతాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అమ్మవారి అలంకరణలు, అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు. దాతల సహకారంతో భక్తులకు నిత్య అన్నదానం నిర్వహించడం ప్రత్యేకతగా నిలుస్తోంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు భక్తులు అమ్మవారి పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించు కుంటున్నారు.

అమ్మవారి ఆశీస్సులతోనే ఇదంతా సాధ్యం: ప్రశాంత్ కుమార్

సుభాష్ యూత్ ఆధ్వర్యంలో 25 ఏళ్లుగా నవరాత్రి ఉత్సవాలను నిరంతరాయంగా నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. యువత అమ్మవారి దీక్షలు చేపట్టి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించడం సంతోషకరమన్నారు. దాతల సహకారంతో ప్రతిరోజూ అన్నదానం చేపట్టడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, యువకులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం

హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్



జమ్మికుంట, అక్టోబర్ 14 (సింగిడి): అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ ఆర్థిక భరోసా కల్పించి, సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తోందని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. హుజూరా బాద్ పట్టణంలోని 29వ వార్డులో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటిని నిర్మించుకోవాలనే తమ కల కాంగ్రెస్ ప్రభుత్వంతో నెరవేరిందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, వొడితల ప్రణవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు త్వరలోనే ఇళ్లు మంజూరు చేస్తామని ప్రణవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, స్థానిక కౌన్సిలర్ మొగిలి, ఇతర కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ మున్సిపాలిటీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని



జమ్మికుంట, అక్టోబర్ 14(సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని హుజురాబాద్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం సంబరాలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొని ఉత్సాహంగా బతుకమ్మవేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుహాసిని మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, రాష్ట్ర సంస్కృతి వైభవానికి ప్రతీక అని అన్నారు. సంప్రదాయాలను గౌరవిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఐకమత్యంతో పండుగను జరుపుకోవాలని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ ఆర్. భూపాల్ రెడ్డి, మెప్మా టీఎంసీ మల్లేశ్వరి, సీఆర్పీలు రమాదేవి, స్వరూప, టీఎల్ఎఫ్ ఆర్పీ అనూషతో పాటు ఓబీలు, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కోమటిచెరువు వద్ద పారిశుద్ధ్య నిర్వహణ లోపాలు

- టూరిజం అధికారులపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం
- ప్రశాంతమైన వాతావరణంలో బతుకమ్మ పండుగ జరుపుకోవాలి



సిద్దిపేట, అక్టోబర్ 14 (సింగిడి): బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులకు ఆదేశించారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు, ఎర్రచెరువు లతో పాటు పలు చెరువులను మున్సిపల్ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ వేడుకలను ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్ల లతో పాటు మహిళలు, చిన్నారులు, వృద్ధుల పట్ల జాగ్రత్త వహించాలని అధికారులను ఆదేశించారు. కోమటి చెరువు వద్ద పారిశుద్ధ్యం నిర్వహణ లోపాలు ఉండడం వల్ల నిర్వహణ ఇన్చార్జి, టూరిజం డిపార్ట్మెంట్ వారిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర బతుకమ్మ పండుగ సద్దుల బతుకమ్మ వరకు పూర్తిస్థాయిలో పారిశుధ్యంతో పాటు నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.టూరిజంశాఖ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే కలెక్టరేట్ కి రావాలని హెచ్చరించారు. టూరిజం మరియు మున్సిపల్ అధికారులు సమన్వయంతో పగడ్బందీగా కోమటి చెరువుపై ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కోమటి చెరువుపై వెంటనే పిర్యాదుల పెటిక ను అమలులోకి తీసుకరావాలని మున్సిపల్ డీఈ ప్రేరణ పాండ కు సూచించారు. చెరువుల వద్ద మహిళలు, పిల్లలు, పెద్దలు లోపలికి వెళ్లకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలనీ, ప్లాస్టిక్ బాటిల్స్, ఇతర వస్తువులు ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలనీ పెండింగ్ పనులు సద్దుల బతుకమ్మ వరకు పూర్తి చేయాలనీ హెచ్చరించారు. బతుకమ్మ వేడుకలు నిర్వహించే ప్రదేశాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రహదారుల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. బతుకమ్మ నిమజ్జనం జరిగే చెరువులు, కుంటల వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా పోలీస్, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన బారికేడ్లు, లైటింగ్, వైద్య సదుపాయాలు, అత్యవసర సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రజక సమాజ అభ్యున్నతి కోసం టీఆర్ఎస్ పనిచేస్తుంది

తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ చిన్నరంగారి

సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షుడిగా మామిడిపల్లి వెంకటేష్ నియామకం



సిద్దిపేట: అక్టోబర్,14 (సింగిడి): తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించనున్న 4వ మహాసభను విజయవంతం చేయడంతో పాటు, రజకుల ఐక్యతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో మండల కమిటీల ఏర్పాటు కార్యక్రమాన్ని వేగవంతం చేయడం జరుగుతుందని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ చిన్నరంగారి అన్నారు. రూరల్ మండల గౌరవ అధ్యక్షుడిగా మామిడిపల్లి వెంకటేష్ (తోర్నాల) మండల అధ్యక్షుడిగా మామిడిపల్లి వెంకటేష్ (పుల్లూరు) ఉపాధ్యక్షులు భూంపల్లి మహేష్ (బుస్సాపూర్), గుండెల్లి స్వామి (చింతమడక) ప్రధాన కార్యదర్శి లు కోడూరి రమేష్ (రాఘవపూర్), కనకయ్య (చింతమడక) వర్కింగ్ ప్రెసిడెంట్ గుండెల్లి వెంకటేష్ (చింతమడక) యూత్ అధ్యక్షుడు తాడేపు శ్రీనివాస్ (రాఘవాపూర్) మండల కార్యదర్శి భూంపల్లి భాస్కర్ (వెంకటాపూర్) కోశాధికారి లింగంపల్లి రవి (ఇర్కోడ్) మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం రాజు (పుల్లూరు) యూత్ ప్రధాన కార్యదర్శి లింగంపల్లిప్రశాంత్ (ఇర్కోడ్)సోషల్ మీడియా కన్వీనర్ జోగరి రాకేష్ (పుల్లూరు) నియమించడం జరిగింది. రూరల్ మండలం కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసిన అనంతరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ.. సిద్దిపేట రూరల్ మండల కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 13మండల కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తయిందని రాష్ట్రమరియు జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ కార్యక్రమానికి రజక ప్రజానీకం నుంచి మంచి స్పందన లభిస్తోందనీ తెలిపారు. రజక సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవడానికి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడానికి, రజకుల హక్కుల సాధనకు సంఘటితంగా పోరాడడానికి మండల స్థాయిలో కమిటీల ఏర్పాటు కీలకమని విజయ్ గణేష్ పేర్కొన్నారు.రజకులందరూ కుల, ప్రాంతీయ విభేదాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలని, యువత సంఘ నిర్మాణంలో చురుకుగా పాల్గొనాలని విజయ్ గణేష్ పిలుపునిచ్చారు. జిల్లాలోని మిగిలిన మండలాల్లో కూడా కమిటీల ఏర్పాటు పూర్తి చేసి, సిద్దిపేట జిల్లాలో నిర్వహించనున్న తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి 4వ మహాసభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల సత్యస్వామి, జూపల్లి నర్సింలు, శ్రీశైలం, ఇతర గ్రామాల రజక నాయకులు పాల్గొన్నారు.

జమ్మికుంట రైస్‌మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ సోదాలు

రెండు మిల్లుల్లో భారీగా ధాన్యం నిల్వల వ్యత్యాసం

కనగర్తి మిల్లులో రూ.6.31 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి!



జమ్మికుంట, అక్టోబర్ 14 (సింగిడి) : జమ్మికుంట పట్టణంలోని ఐదు రైస్ మిల్లు ల్లో టాస్క్ ఫోర్స్ ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. మహేశ్వర ట్రేడింగ్ లో 1,350 క్వింటాళ్లు, అన్నపూర్ణ ట్రేడింగ్ లో 650 క్వింటాళ్ల ధాన్యం నిల్వల్లో వ్యత్యాసాన్ని గుర్తించినట్లు సమాచారం. లక్ష్మి సాయి, కారుణ్య, రాజరాజేశ్వర రైస్ మిల్లుల్లోనూ తనిఖీలు నిర్వహించగా, ధాన్యం నిల్వల్లో ఎలాంటి వ్యత్యాసాలు గుర్తించలేదని తెలిసింది.

రూ.6.31 కోట్ల ధాన్యం పక్కదారి?

ఇల్లందకుంట మండలం కనగర్తి గ్రామంలోని ప్రేమ్ సాయి రైస్ మిల్లులో పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. 2023--24 సంవత్సరానికి సంబంధించి మిల్లుకు 22,141 క్వింటాళ్ల సీఎంఆర్ ధాన్యాన్ని కేటాయించారు. ఇందులో ప్రభుత్వానికి 14,835 క్వింటాళ్ల బియ్యం అందించాల్సి ఉండగా, కేవలం 1,721 క్వింటాళ్లు మాత్రమే అందించినట్లు అధికారులు గుర్తించారు. దీంతో రూ.6,31,71,106 విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. పౌరసరఫరాల శాఖ మేనేజర్ రజనీకాంత్ ఫిర్యాదు మేరకు మిల్లు యజమానులు చంద్రశేఖర్, సాయికృష్ణలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎఫ్‌సీఐలోనూ శాంపిళ్ల సేకరణ

బుధవారం జమ్మికుంట పట్టణంలోని ఎఫ్‌సీఐ కేంద్రంలో అధికారులు తనిఖీలు నిర్వహించి, సోదాలు జరిగిన మిల్లుల నుంచి వచ్చిన ధాన్యం నమూనాలను సేకరించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ తనిఖీల్లో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

జర్నలిస్టులపై దాడుల ఆరోపణలు, స్వతంత్ర విచారణ జరపాలి

గాండ్ల శ్రీనివాస్ డిమాండ్ బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి



కరీంనగర్, అక్టోబర్14(సింగిడి): గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ వ్యవహారశైలిపై వార్తలు ప్రచురించిన 'ఏక్ దమ్ న్యూస్' జర్నలిస్టులు సంపత్, ఎడిటర్ పొత్తూరి శేఖర్‌పై పోలీసులు దాడి చేసి, చిత్రహింసలకు గురిచేశారన్న ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరిపించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐతోపాటు సంబంధిత పోలీసులను సస్పెండ్ చేసి, క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఐపై వరుస కథనాలు ప్రచురించిన నేపథ్యంలో జర్నలిస్టులపై కేసు నమోదైంది. అనంతరం సంపత్, పొత్తూరి శేఖర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, అరెస్టుకు ముందు నోటీసులు ఇవ్వలేదని బాధితులు ఆరోపించారు. పోలీసు వాహనం లోనే దూషిస్తూ బూట్లు, బెల్టులతో కొట్టారని, గంభీ రావుపేట, కోనరావుపేట పోలీస్ స్టేషన్లలోనూ లాఠీలు, బెల్టులు, రబ్బరు టైర్లతో దాడి చేశారని పేర్కొన్నారు. పోలీసులు మొబైల్ ఫోన్లు తీసుకోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఆలస్యంగా అందిందని తెలిపారు. న్యాయమూర్తి ఎదుట హాజరైనప్పుడు తమపై జరిగిన దాడులను బాధితులు వివరించగా, వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అనంతరం జర్నలిస్టులు కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. గాండ్ల శ్రీనివాస్ ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. అరెస్టు సమయంలో చట్టపరమైన నిబంధనలు పాటించారా, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారా, వైద్య పరీక్షలు నిర్వహించి గాయాలను నమోదు చేశారా అనే అంశాలపై విచారణ జరపాలని శ్రీనివాస్ కోరారు. ఈ ఘటనలో ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్ పాత్రపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

సాక్ష్యాలు భద్రపరచి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి..

గంభీరావుపేట, కోనరావుపేట పోలీస్ స్టేషన్ల నిఘా కెమెరాల దృశ్యాలు, పోలీసు వాహనాల ప్రయాణ వివరాలు, స్టేషన్ డైరీలు, అరెస్టు పత్రాలు, అత్యవసర ఫోన్ కాల్ వివరాలు, వైద్య నివేదికలను భద్రపరచాలని శ్రీనివాస్ కోరారు. బాధితులకు, వారి కుటుంబాలకు రక్షణ కల్పించి, వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించాలని విజ్ఞప్తి చేశారు. వార్తల్లో తప్పులుంటే చట్టబద్ధంగా ఖండించాలే తప్ప, జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం సహించ రానిదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎలగందుల రవీందర్ పాల్గొన్నారు.

శ్రీనివాస్ నగర్ గ్రామంలో 'జలసిరి' కార్యక్రమం

బోర్ వెల్ రీఛార్జి ఇంకుడు గుంత పనులు ప్రారంభం



మానకొండూర్, అక్టోబర్14(సింగిడి): భూగర్భ జలాల పెంపకమే ధ్యేయంగా శ్రీనివాస్ నగర్ గ్రామంలో 'జలసిరి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా, గ్రామ సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బోర్ వెల్ రీఛార్జి ఇంకుడు గుంత నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వర్షపు నీటిని వృథా చేయకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా రాబోయే రోజుల్లో గ్రామంలో తాగునీరు, సాగునీటి ఎద్దడిని నివారించవచ్చని ఆయన తెలిపారు. గ్రామస్తులందరూ ఈ 'జలసిరి' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, నీటి పొదుపుపై అవగాహన పెంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

పలు మండపాల్లో ప్రత్యేక పూజలు, చండీ హోమం, అన్నప్రసాద వితరణలో పాల్గొన్న యాదగిరి సునీల్‌రావు, అపర్ణ దంపతులు



కరీంనగర్, అక్టోబర్14(సింగిడి): శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర ఉప మేయర్ యాదగిరి సునీల్‌రావు తన భార్య అపర్ణతో కలిసి నగరంలోని పలు దుర్గామాత మండపాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాంగడ్డలోని క్రాంతి యువజన సంఘం, కార్మీర్‌గడ్డలోని ఫండస్ పాఠశాల సమీపంలో గణేష్ యువజన సంఘం, భగత్‌నగర్‌లో పెద్దమ్మ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాలను సందర్శించారు. అనంతరం భగత్‌నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చండీ హోమం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మండపాల నిర్వాహకులు, కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బతుకమ్మ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

మహిళలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి

అధికారులకు కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ ఆదేశం



జమ్మికుంట, అక్టోబర్ 14 (సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని బతుకమ్మ సౌళ్లలో సద్దుల బతుకమ్మ పండుగ కోసం చేపడుతున్న ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత, తగినంత లైటింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పూలను ప్రకృతి స్వరూపంగా భావించి పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని ప్రణవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా యంత్రాంగం పనితీరు భేష్

ఎస్పీ నరసింహా

సూర్యాపేట, అక్టోబర్ 14 (సింగిడి): సమాచార హక్కు చట్టం 2005 అమలు తీరులో జిల్లా యంత్రాంగం పనితీరు అభినందనీయమని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్‌ను ఆయన కార్యాలయంలో శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాలన, పారదర్శకత, జవాబుదారితనం పెంపొందించడంతో పాటు సమాచార హక్కు చట్టం అమలులో గుర్తింపు లభించడం జిల్లాకే గర్వకారణమని అన్నారు.

శివ సాయి కార్యాలయంలో బతుకమ్మ కోలాహలం!

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టిన వేడుకలు

నాగుల శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు..

ముఖ్య అతిథులుగా నాగుల కమల, మాజీ మేయర్ జాలి రాజమణి



గోదావరిఖని, అక్టోబర్ 14 (సింగిడి): తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ శివ సాయి మల్టీ ప్రొడ్యూసర్ కంపెనీ గోదావరిఖని బ్రాంచ్ కార్యాలయంలో వైభవంగా జరిగింది. కంపెనీ ఎండీ సార్ ఆదేశాల మేరకు షేర్‌హోల్డర్ నాగుల శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఈ వేడుకల్లో ఉద్యోగులంతా ఒక్కటై పండుగ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. పూల పండుగ సందడితో కార్యాలయం పండుగ శోభను సంతరించుకుంది.

పూల పండుగ.. ఆత్మీయతల కలయిక!

బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని కంపెనీ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని తమ ఆనందాన్ని పంచుకున్నారు. సంస్థలో పనిచేస్తున్న సీనియర్లు, ఇన్‌చార్జీలు, ఉద్యోగులు, ఎంఎస్‌లు, వీఎస్‌లు, నూతన సభ్యులంతా కలిసికట్టుగా వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఉద్యోగుల మధ్య ఐక్యతను, పరస్పర ఆత్మీయతను చాటిచెప్పేలా కార్యక్రమం సాగింది. ఈ బతుకమ్మ సంబరాలకు శివ సాయి మల్టీ ప్రొడ్యూసర్ కంపెనీ సీనియర్ డైరెక్టర్ శ్రీమతి నాగుల కమల, మాజీ మేయర్ జాలి రాజమణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేడుకల్లో పాల్గొని ఉద్యోగులతో తమ సంతోషాన్ని పంచుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగలను అందరూ కలిసి జరుపుకోవడం విశేషమని ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు.

ఉద్యోగులంతా ఒక్కటై.. వేడుకను విజయవంతం చేసి!

షేర్‌హోల్డర్ నాగుల శ్రీధర్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో కంపెనీ సీనియర్లు బండారు సరిత, దొంత కనకలక్ష్మి, బుర్ర రజిత, గుండేటి సరిత, జనగామ సుగుణ, పెనుగొండ స్వాతి, అనిశెట్టి స్వప్న, నాగుల సాయిప్రియ, కొమ్మరాజుల స్వరూప, కుంచపు రాజేశ్వరి పాల్గొన్నారు. అలాగే సీనియర్ ఇన్‌చార్జి చిలుక ప్రేమలత, జూనియర్ ఇన్‌చార్జి పులికంటి సుజాత, చిలుక నారాయణ, ఇనుగాల రజిత, కంటే పద్మ, కరెంగుల మాధవి, దబ్బేట రజిత, బోయిన శ్రీలత, జూపాక నిర్మల, గొరై స్వాతి, దుడ్డేల జీవిత, రంగం కళ్యాణితో పాటు ఇతర ఉద్యోగులు, ఎంఎస్‌లు, వీఎస్‌లు, నూతన సభ్యులు పాల్గొని వేడుకలకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా సీనియర్ డైరెక్టర్ నాగుల కమల మాట్లాడుతూ, శివ సాయి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఉద్యోగులందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి ఆత్మీయ వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పించిన కంపెనీ ఎండీ సార్‌కు ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మేయర్ జాలి రాజమణి మాట్లాడుతూ, శివ సాయి సంస్థ నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగలో భాగస్వామిని చేసినందుకు కంపెనీ ఎండీ సార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులందరితో కలిసి వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

సంప్రదాయాల పరిరక్షణ.. ఐక్యతకు ప్రతీకగా సంబరాలు

తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగను శివ సాయి సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం ఉద్యోగుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. సంస్థ కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి ఆనందంగా వేడుకలు జరుపుకోవడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. సంప్రదాయాల పరిరక్షణతో పాటు ఉద్యోగుల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేసేలా ఈ బతుకమ్మ సంబరాలు నిలిచాయి.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి



- మాజీ ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డి
- మెరుగైన వైద్య సేవలు అందించడంలో వారి పాత్ర కీలకం
- ఉద్యోగులు నిరవధిక సమ్మెకు గండ్ర సంఘీభావం

భూపాలపల్లి, అక్టోబర్ 14(సింగిడి): మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఎన్ హెచ్ ఎం జేఏసీ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు గండ్ర సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు వైద్య సేవలు అందించిన వారి సేవలను ప్రభుత్వం గుర్తించి, తగిన గౌరవం కల్పించాలని కోరారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ న్యాయం జరగాలని, వేతనాల్లో ఉన్న వ్యత్యాసాలను పరిశీలించి సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వారి డిమాండ్లను నెరవేర్చి ఉద్యోగులకు న్యాయం చేయాలని గండ్ర ప్రభుత్వాన్ని కోరారు.

వైద్య సేవల లక్ష్య సాధనకు ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



యాదాద్రి ప్రతినిధి, అక్టోబర్ 14(సింగిడి): జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుంచి వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, వైద్య ఆరోగ్య శాఖ పనితీరు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా వైద్య సేవలు, గర్భిణుల నమోదు, ఎఎన్సి పరీక్షలు, ప్రసవానంతర సేవలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన గర్భిణులందరికీ సకాలంలో వైద్య పరీక్షలు అందేలా చూడాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై ప్రతి వైద్యాధికారి తమ పరిధిలోని ఆరోగ్య కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించకుండా, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్ వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

బుల్లెట్ ట్రైన్ సాధన సమితి దీక్షకు బిజెపి మద్దతు



సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 14(సింగిడి): బుల్లెట్ ట్రైన్ సాధన సమితి 61వ రోజు దీక్షకు మంగళవారం బిజెపి శ్రేణులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా తుంగతుర్తి మాజీ శాసనసభ్యుడు తెలంగాణ రాష్ట్ర బిజెపి నాయకులు సంకినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సూర్యాపేట మీదుగా అలైన్మెంట్ మార్పుపై కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక అధికార పార్టీ నాయకులు తమ వైఖరిని తక్షణమే స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరిస్తే రాబోయే గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ ఎన్నికలలో ప్రజలు, నిరుద్యోగులు ఓటు రూపంలో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని అన్నారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సూర్యాపేటకు రైల్వే లైన్ కనెక్టివిటీ లేకపోవడంతో భారత ప్రధాని నరేంద్ర మోడీ బుల్లెట్ ట్రైన్ అలైన్ మెంట్ మంజూరు చేసిందని గుర్తు చేశారు. బుల్లెట్ ట్రైన్ మార్గం జాతీయ రహదారి 65 సమాంతరంగా చౌటుప్పల్ సూర్యాపేట, కోదాడ మీదుగా వెళ్లాల్సి ఉండగా సూర్యాపేటకు స్టేషన్ మంజూరైన ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేయడానికి రూటును మార్చి ఫ్యూచర్ సిటీ అని చెప్పి హేలియా, వాడపల్లి మీదుగా కేంద్రానికి పంపి సూర్యాపేట ప్రజల నోటి కాడ కూడును లాగేసుకుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్దల రియల్ ఎస్టేట్ లాభాల కోసమే అలైన్మెంట్ను మార్చాలని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, చల్లమల్ల నరసింహ, ఎండి అభిద్, కర్నాటి కేశన్, నలిగంటి వీరేందర్, సైదిరెడ్డి, మధు రామారావు, సుసిందర్ రెడ్డి, ధనుంజయ గౌడ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఉత్సవ రథం పనులను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



హన్మకొండ, అక్టోబర్ 14(సింగిడి): చారిత్రక వరంగల్ శ్రీ భద్రకాళి దేవాలయంలో రథోత్సవ నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రూపుదిద్దుకుంటున్న ఉత్సవ రథం పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. రథోత్సవ ఏర్పాట్ల వివరాలను ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, ఆలయ కార్య నిర్వహణాధికారి సునీతను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆలయ మాడవీధుల్లో ఉత్సవ రథం సజావుగా తిరిగేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భద్రకాళి చెరువులో తగినంత నీటి వసతి లేనందున తెప్పోత్సవానికి తాత్కాలికంగా నీటి కొలను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ రాంప్రసాద్, అధికారులను ఆదేశించారు. అదేవిధంగా భద్రకాళి తాగునీటి జలాశయాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సాగునీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. భద్రకాళి తాగునీటి జలాశయానికి దేవాదుల నీరు చేరేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఇరిగేషన్ డీఈ మధుసూదన్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉచ్చులే అశోక్ మృతికి కారణం

- మృతదేహాన్ని వాగు ఒడ్డున పొదల్లో పడేసిన నిందితులు
- ఇద్దరి అరెస్ట్.. మరొకరి కోసం పోలీసుల గాలింపు



కాటారం/ మహాముత్తారం, అక్టోబర్ 14(సింగిడి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల పరిధిలో జడల అశోక్ మృతి కేసులో మిస్టరీ వీడింది. అటవీ జంతువులను వేటాడేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల ఉచ్చులకు తగిలి అశోక్ మృతిచెందినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ ఘటనలో తమ పాత్ర బయటపడుతుందనే భయంతో మృతదేహాన్ని వాగు ఒడ్డున ఉన్న పొదల్లో పడేసినట్లు గుర్తించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నిందితులు అటవీ జంతువులను వేటాడేందుకు అక్రమంగా విద్యుత్ తీగల ఉచ్చులు ఏర్పాటు చేసేవారు. యామన్‌పల్లి--నిమ్మగూడెం ప్రధాన రహదారి సమీపంలోని 11 కేవీ విద్యుత్ లైన్ నుంచి ఇనుప బైండింగ్ వైర్లకు విద్యుత్ సరఫరా కలిపి అటవీ ప్రాంతంలో ఉచ్చులు అమర్చేవారు. ఈ క్రమంలో యామన్‌పల్లి శివారులోని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చులకు పోడు భూమి పనుల నిమిత్తం అక్కడికి వచ్చిన అజ్మీనగర్‌కు చెందిన జడల అశోక్ (32) తగిలి శుక్రవారం రాత్రి అక్కడికక్కడే మృతిచెందాడు. మరుసటి రోజు తెల్లవారుజామున ఉచ్చులను పరిశీలించేందుకు వెళ్లిన నిందితులు అశోక్ మృతదేహాన్ని గుర్తించారు. తమ ఉచ్చుల కారణంగానే అతడు మృతిచెందిన విషయం బయటపడితే పోలీసులకు చిక్కుతామనే భయంతో మృతదేహాన్ని ఓ కర్రకు కట్టి మోసుకెళ్లి, సుమారు కిలోమీటరు దూరంలోని వాగు ఒడ్డున ఉన్న పొదల్లో పడేసినట్లు విచారణలో తేలింది. అనంతరం పోలీసులకు చిక్కకుండా అడవిలో దాక్కొని మహారాష్ట్రకు పారిపోయేందుకు ప్రయత్నించారు. నమ్మదగిన సమాచారం మేరకు కాటారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగార్జునరావు నేతృత్వంలో ఎస్ఐలు, పోలీసు సిబ్బంది యామన్‌పల్లి శివారులోని చెరువు సమీపంలో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న రత్నం వంశీకృష్ణ (31), రత్నం రాజు అలియాస్ రాజేందర్, తలారి రాజేందర్‌లను గుర్తించారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా రత్నం వంశీకృష్ణ, రత్నం రాజు అలియాస్ రాజేందర్‌లను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి నేరానికి ఉపయోగించిన ఇనుప బైండింగ్ వైర్, కాటన్ వైర్, ఒక స్మార్ట్‌ఫోన్, ఒక కీప్యాడ్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన ఇద్దరిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన కాటారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగార్జునరావు, ఎస్ఐలు రమేష్, మహేందర్‌కుమార్, సీహెచ్. శ్రీనివాస్, మహేష్‌తో పాటు పోలీసు సిబ్బంది రాజు, హరీష్, సత్యనారాయణ, లక్ష్మీరాజు, విక్రమ్, హరికుమార్, తిరుపతి, మశుక్, ఐటీ కోర్ వేణులను ఉన్నతాధికారులు అభినందించారు. అటవీ జంతువులను వేటాడేందుకు విద్యుత్ తీగల ఉచ్చులు ఏర్పాటు చేయడం ప్రమాదకరమైన, చట్టవిరుద్ధమైన చర్య అని కాటారం డీఎస్పీ తెలిపారు. ఇలాంటి ఉచ్చుల వల్ల అటవీ జంతువులతో పాటు మనుషుల ప్రాణాలకు సైతం ముప్పు వాటిల్లుతుందన్నారు. ఎక్కడైనా అక్రమ విద్యుత్ ఉచ్చులు కనిపించినా, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

నిర్మాణ పనులను పరిశీలించిన కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



హన్మకొండ, అక్టోబర్ 14(సింగిడి): వరంగల్ బస్ స్టేషన్ నిర్మాణ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి అన్నారు. వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న బస్ స్టేషన్ పనులను, వాటి పురోగతిని హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయితో కలిసి కుడా చైర్ పర్సన్ మంగళవారం పరిశీలించారు. బస్ స్టేషన్ నిర్మాణ, అభివృద్ధి పనులకు సంబంధించిన మ్యాపును పరిశీలించారు. పనుల పురోగతిని గురించి నిర్మాణ సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ వరంగల్ బస్ స్టేషన్ త్వరగా పూర్తయ్యే విధంగా నిర్మాణ పనులు సాగాలన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వరంగల్ బస్ స్టేషన్ నిర్మాణ పనులు వేగవంతం చేయడంలో భాగంగా అదనంగా మరింత మంది వర్కర్స్ ను ఏర్పాటు చేయాలన్నారు. కాలమ్స్, స్లాబ్స్ రిటెయినింగ్ వాల్ పనులను ఏకకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కుడా ఈఈ భీమ్ రావు, డీఈ జలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు భూమి కబ్జాపై ఇరిగేషన్ నోటీసులు!

కోదాడ, అక్టోబర్ 14(సింగిడి): అనంతగిరి మండలం ఖానాపురం పరిధిలోని కోదాడ పెద్దచెరువు శిఖం భూమిలో సుమారు ఎకరం భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్లు నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని ఇరిగేషన్ సబ్‌డివిజన్ నంబర్-1 అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే చేపట్టిన నిర్మాణాలు, గోదలు, నిర్మాణ సామగ్రిని ఏడు రోజుల్లోగా తొలగించి భూమిని యథాస్థితికి తీసుకురావాలని ఆదేశించారు. సదరు భూమికి సంబంధించి చట్టబద్ధమైన అనుమతులు, పత్రాలు ఉంటే మూడు రోజుల్లో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. చెరువు శిఖం భూమి ఆక్రమణతో నీటి నిల్వసామర్థ్యం తగ్గడంతో పాటు మత్స్యకార కుటుంబాల జీవనోపాధి, సాగునీటి అవసరాలు, భూగర్భ జలాల పునరుద్ధరణపై ప్రభావం పడుతుందని అధికారులు పేర్కొన్నారు. నోటీసులను పాటించకపోతే వాల్టా చట్టం, తెలంగాణ ఇరిగేషన్ చట్టం ప్రకారం నిర్మాణాల తొలగింపుతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



దొంగల లెక్కవచ్చిన్లు....

మా షాపులను కూలగొట్టిండ్లు

ఇదెక్కడి ప్రజాపాలనా..మేమెట్ల బతకాలి

అవేదన వ్యక్తం చేస్తున్న చిరు వ్యాపారులు



హన్మకొండ, అక్టోబర్ 14(సింగిడి): రెక్కాడితే కానీ డొక్కాడని మా నిరుపేద కుటుంబాల బతుకులపై మట్టి పోసారు. మేమేం పాపం చేశాం చిరు వ్యాపారాలు చేసుకుంటూ మా కుటుంబాలను పోషించుకుంటున్నాం,మున్సిపాలిటీల్లో వచ్చిండ్లు మా షాపులను కూలగొట్టిండ్లు అంటూ బాధిత చిరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాద చారులకు ఉపయోగపడే ఫూట్ పాత్ ను చిరు వ్యాపారులు ఆక్రమించుకున్నారని ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయనే కారణంతో గత కొన్ని రోజుల నుంచి బల్దియా అధికారులు రోడ్లకు ఇరువైపుల ఉన్న షాపులను కూలగొడుతూ వస్తున్నారు. రోడ్లపై ఆక్రమణలో ఉన్న షాపుల స్థలాలు హనుమకొండ పోలీస్ హెడ్ క్వాటర్స్ నుండి భీమారం వరకు, గోపాలపూర్ కల్లుమండప నుండి జవహర్ నగర్ క్రాస్ రోడ్ వరకు, అంబేద్కర్ విగ్రహం నుండి వడ్డేపల్లి చర్చి వరకు ఉన్న రహదారులను చిరువ్యాపారులు ఆక్రమించి ఫుట్ పాత్ లపైన వ్యాపారాలు నిర్వహిస్తుండడం వల్ల (రోడ్డులకు ఇరువైపులా) వాహనాదారులకు, పాదాచారులకు ఇబ్బందులు అవుతున్నాయని గమనించిన కలెక్టర్, బల్దియ అధికారులు రోడ్డుకి ఇరువైపులా స్థలాలను ఖాళీ చేయాలని పలుమార్లు సూచించారు. అయినప్పటికీ అధికారుల ఆదేశాలను ఖాతరు చేయలేదనే నెపంతో మున్సిపాలిటీ అధికారులు, రాత్రికి రాత్రి మున్సిపాలిటీ స్థలాలను ఖాళీ చేసే క్రమంలో చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న వ్యాపార సముదాయాలను కూల్చివేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో బాధిత చిరు వ్యాపారులు జిల్లా ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



యువతకు ఉచిత శిక్షణ

న్యాక్ ఆధ్వర్యంలో 90 రోజుల ఉచిత శిక్షణ

నల్గొండ ప్రతినిధి అక్టోబర్ 14(సింగిడి): ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు జాతీయ నిర్మాణ అకాడమీ (న్యాక్) ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇచ్చి, నూరు శాతం ఉపాధి కల్పిస్తున్నట్లు ఎస్. శ్రీనివాస్ నల్లగొండ జిల్లా సహాయ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హతలు – అందుబాటులో ఉన్న కోర్సులు

18 నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. 90 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుంది. ఇందులో భూపరిశీలన (ల్యాండ్ సర్వే), పర్యవేక్షణ (సూపర్ వైజర్), విద్యుత్ పనులు (ఎలక్ట్రీషియన్), సౌర విద్యుత్ (సోలార్) తదితర కోర్సులలో శిక్షణ ఇస్తారు. అందించే సౌకర్యాలుశిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారు. అలాగే పుస్తకాలు, దుస్తులు, రక్షణ శిరస్త్రాణం (హెల్మెట్), చేతి సంచి ఉచితంగా అందజేస్తారు శిక్షణ పూర్తి చేసుకున్న వారి నైపుణ్య ధృవీకరణ పత్రంతో పాటు 100% ఉద్యోగ అవకాశం కల్పిస్తారుసంప్రదించాల్సిన వివరాలుఆసక్తి గల అభ్యర్థులు కలెక్టరేట్ సమీపంలోని మిర్యాలగూడ రోడ్డులో ఉన్న న్యాక్ కార్యాలయంలో నేరుగా సంప్రదించవచ్చు ఇతర వివరాల కోసం 8297431655, 9848017796 చరవాణి సంఖ్యలలో సంప్రదించాలని కోరారు.

శ్రీ అన్నపూర్ణాదేవి రూపంలో దుర్గాదేవి దర్శనం

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. శివలీలల హరికథాగానం



చింతపల్లి, అక్టోబర్ 13 (నినాదం): మండల కేంద్రంలోని శ్రీ సాయిసన్నిధి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మూడో రోజు అన్నపూర్ణాదేవి అవతారంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 10.00 గంటలకు కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం భక్తిపూర్వకంగా నిర్వహించారు. అనంతరం సాయినాథునికి మధ్యాహ్న హారతి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ్య పావని దంపతులు ఎంతో భక్తి ప్రపత్తులతో 108 కలశాల నెయ్యితో సాయినాథునికి విశేష అభిషేకం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం వావిలాల నాగరాణి భాగవతారణి ఆధ్వర్యంలో శివలీలలపై హరికథాగానం నిర్వహించారు. భక్తులను ఆకట్టుకున్న హరికథాగానంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయినాథుని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా నిరంతర కృషి

దసరా పండుగ నేపథ్యంలో గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టిన సర్పంచ్ కాసారపు శ్వేతా శ్రీనివాస్



చింతపల్లి, అక్టోబర్ 14(సింగిడి): గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నట్లు స్థానిక సర్పంచ్ కాసారపు శ్వేతా శ్రీనివాస్ తెలిపారు. దసరా పండుగను పురస్కరించుకుని గ్రామంలో పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలోని అన్ని వీధుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యంగా ఆరో వార్డు, 12వ వార్డులతోపాటు గ్రామంలోని వివిధ వీధుల్లో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను జేసీబీలు, డోజర్ల సహాయంతో తొలగించారు. దీంతో రహదారుల వెంట పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించి వీధులను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. అదేవిధంగా గ్రామంలోని వీధుల్లో తగినంత వెలుతురు లేని ప్రాంతాలను గుర్తించి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించారు. మహిళలు బతుకమ్మ వేడుకలను సంతోషంగా నిర్వహించుకునేందుకు వీలుగా గ్రామ కూడళ్లలో పారిశుద్ధ్య పనులు చేపట్టడంతోపాటు అవసరమైన చోట్ల విద్యుత్ దీపాల సౌకర్యాన్ని కల్పించారు. పండుగల సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం, వీధి దీపాల ఏర్పాటు, మురుగుకాలువల శుభ్రత, రహదారుల వెంట ఉన్న కంపచెట్ల తొలగింపు వంటి సమస్యలకు ప్రాధాన్యమిస్తూ పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ శ్వేతా శ్ర

అతివ Athiva

సింగిడి

ఆర్థరైటిస్ నొప్పులను అంతం చేసే మొనగాడు మూలిక

ప్రకృతిలో ఎన్నో రకాల ఔషధ మొక్కలు దాగున్నాయి.. అవి సహజ ఔషధాలుగా పనిచేయడంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయపడతాయి. కొన్ని వందల సంవత్సరాల నుంచి మన ఆయుర్వేదంలో ఎన్నో రకాల మొక్కలను పలు రకాల చికిత్సలకు మెడిసిన్‌గా వాడుతున్నారు. అయితే.. మనకు తెలిసిన ఆయుర్వేద మూలికలు చాలానే ఉన్నప్పటికీ, అద్భుతమైన ఔషధ గుణాలు ఉండి చాలామందికి తెలియని మూలికల్లో 'గంభారి' ఒకటి.













దీనిని సాధారణంగా గుమ్మడి టేకు లేదా 'చందహర చెట్టు' అని కూడా పిలుస్తారు. దీని శాస్త్రీయ నామం (గ్మెలినా అర్బోరియా).. ఈ చెట్టు హిమాలయాలు, నీలగిరి కొండలతో పాటు భారతదేశంలోని తూర్పు, పశ్చిమ తీర ప్రాంతాల్లో ఎక్కువగా పెరుగుతుంది. ఆయుర్వేదంలో ప్రసిద్ధి చెందిన 'దశమూల చూర్ణం'లో ఉపయోగించే ముఖ్యమైన మూలికల్లో ఇది ఒకటి.. ఇది ఆర్థరైటిస్ నొప్పులకు అద్భుతమైన ఆయుర్వేద మూలిక అని నిపుణులు చెబుతున్నారు.

ఆయుర్వేద నిపుణుల ఆధారంగా, గంభారి మొక్క వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, ఆర్థరైటిస్ నొప్పులను తగ్గించడంలో దీని పాత్ర, దీనిని ఎలా ఉపయోగించాలో వివరంగా తెలుసుకుందాం..

గుమ్మడి టేకుతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు:

ఆర్థరైటిస్ (కీళ్ల నొప్పుల) నివారణ: గంభారీలో అనాల్జేసిక్ (నొప్పి నివారిణి), యాంటీ ఇన్ఫ్లమేటరీ (వాపులను తగ్గించే) గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్ వల్ల వచ్చే వాపులు, నొప్పులను సమర్థవంతంగా తగ్గిస్తాయి.

వాత దోష సమతుల్యత: ఆయుర్వేదం ప్రకారం శరీరంలో 'వాతం' అసమతుల్యత వల్ల కీళ్ల నొప్పులు వస్తాయి. గంభారి శరీరంలోని వాతాన్ని సమతుల్యం చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది.

జీర్ణ సమస్యల నివారణ: ఈ మూలికలో ఉన్న లాక్సేటివ్ గుణాలు రకరకాల జీర్ణ సంబంధిత సమస్యలను నివారించి, జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.

గంభారీని ఎలా ఉపయోగించాలి?

గంభారీని ఆరోగ్య ఆయుర్వేద నిపుణుల ప్రకారం.. శరీరానికి అంతర్గతంగా (నోటి ద్వారా తీసుకోవడం), బాహ్యంగా (పైపూతగా) కూడా ఉపయోగించవచ్చు:

ఆకుల వినియోగం: గంభారి (గుమ్మడి టేకు) ఆకులను కషాయంగా లేదా నేరుగా తీసుకోవడం, లేదా ఆకుల పేస్ట్‌ను నొప్పులు ఉన్నచోట పైపూతగా రాయడం వల్ల ఆర్థరైటిస్ నొప్పుల నుండి ఉపశమనం లభిస్తుంది.

పొడి రూపంలో: ప్రస్తుతం మార్కెట్‌లో గంభారి చూర్ణం/పొడి లభిస్తోంది.
మోతాదు: 2 నుండి 3 గ్రాముల గంభారి పొడిని గోరువెచ్చని నీటిలో కలిపి రోజుకు 1 లేదా 2 సార్లు తీసుకోవచ్చు.
ఈ చూర్ణాన్ని తప్పనిసరిగా భోజనం చేసిన తర్వాతే తీసుకోవాలి.

జాగ్రత్తలు:

అధిక మోతాదు ప్రమాదకరం:
గంభారీని పరిమితికి మించి ఎక్కువ మోతాదులో తీసుకుంటే సైడ్ ఎఫెక్ట్స్ (దుష్ప్రభావాలు) వచ్చే అవకాశం ఉంది.

వైద్యుని సలహా తప్పనిసరి: దీనిని వాడటం ప్రారంభించే ముందు ఒక అర్హత కలిగిన ఆయుర్వేద వైద్యుడిని (Doctor) సంప్రదించి, మీ శరీర తత్వానికి తగిన మోతాదును తెలుసుకోవడం శ్రేయస్కరం.

ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన ఆయుర్వేద మూలికల్లో గంభారి ఒకటి. సరైన మోతాదులో, నిపుణుల సలహాతో దీనిని ఉపయోగిస్తే కీళ్ల నొప్పుల నుండి సహజంగా ఉపశమనం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.



చేతుల శుభ్రతతో వ్యక్తిగత ఆరోగ్యం

(15 అక్టోబర్ "ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవం" సందర్భంగా)

మన ఆరోగ్యం మన చేతుల్లోనే. చేతులతో అన్నం కలుపుకొని తింటాం. నీటిని తాగుతాం. పిల్లలు వేళ్లను నోట్లో పెట్టుకుని ఆడతారు. అన్నం తినే మన చేతులు శుభ్రంగా లేని కారణంగా పలు అంటువ్యాధులు సంక్రమిస్తాయని తెలుసుకోవాలి. మనం తాగే నీరు, పీల్చే గాలి స్వచ్ఛంగా లేకపోవడంతో కూడా వ్యాధులు తెగ ముసురుకుంటాయి. దాదాపు 40 శాతం ప్రపంచ జనాభా చేతి శుభ్రత లేని కారణంగా అనేక నివారించదగిన వ్యాధులను కొని తెచ్చుకుంటున్నరని నివేదికలు పేర్కొంటున్నాయి. చేతులు అశుభ్రంగా ఉండడం వల్ల ప్రతి ముగ్గురిలో ఒకరికి డయేరియా, ఐదుగురిలో ఒక్కరికి శ్వాస సంబంధిత సమస్యలు వస్తున్నాయి. చేతి శుభ్రతతో 40 శాతం వరకు డయేరియా, 29 – 57 శాతం మందికి జీర్ణనాళ వ్యాధులు వస్తున్నాయి. చేతులు శుభ్రం చేసుకోవడంతో డయేరియా వ్యాధిగ్రస్తుల్లో 58 శాతం మందికి శ్వాస కోశ సంబంధిత వ్యాధులు అరికట్టబడుతున్నాయి. కరోనా అకాలంలో చేతుల శుభ్రత, సానిటైజర్ల వాడకం ప్రయోజనాలు అర్థం అయ్యాయి.

చేతుల శుభ్రతతో ఆరోగ్య సౌభాగ్యం :
పేదరికం, నిరక్షరాస్యత, అధిక జనాభా లాంటి సమస్యలు రాజ్యమేలుతున్న భారతంలో చేతులు శుభ్రంగా లేని కారణంగా పలు రోగాలతో సంసారం ఈదుస్తున్నారు. చేతుల శుభ్రత ప్రాధాన్యాన్ని అవగాహన పర్చడానికి ప్రతి ఏట 15 అక్టోబర్ రోజున "ప్రపంచ చేతి శుభ్రత దినోత్సవం (గ్లోబల్ హాండ్ వాషింగ్ డే)" పాటించడం 2008 నుంచి ఆనవాయితీగా మారింది. 2026 గ్లోబల్ హాండ్ వాషింగ్ డే ఇతివృత్తంగా "ఆచరణతో ప్రాణాలను నిలబెట్టింది (ఆక్షన్ సేవ్స్ లైఫ్)" అనబడే అంశాన్ని తీసుకోని ప్రచారం నిర్వహిస్తున్నారు.

చేతుల శుభ్రత పట్ల విద్యాలయాలు, పౌర సమాజంలో పూర్తి అవగాహన కల్పించడం జరగాలి. చేతులు శుభ్రం చేసుకునే పద్ధతులు, వాడవలసిన సబ్బు, శుభ్రతలేమితో సోకే వ్యాధుల పట్ల అవగాహన పెంచాలి. బయట నుంచి ఇంటికి రాగానే చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. చేతుల శుభ్రతకు కనీసం 20 సెకన్లను కేటాయించాలి. వివిధ వస్తువులు, కరెన్సీని తాకే వారు చేతుల శుభ్రత పట్ల జాగ్రత్తగా ఉండాలి. టాయిలెట్ వెళ్లినపుడు, చెత్తను ముట్టినపుడు, వంటకు ముందు, అల్పాహారం చేసే ముందు, తిన్న తర్వాత, జంతువులను ముట్టినపుడు, జంతు మలమూత్రాలను తాకినపుడు, ముక్కు చీదినపుడు తప్పక చేతులు శుభ్రం చేసుకోవాలి. హెపటైటిస్, డయేరియా, ఫుడ్ పాయిజనింగ్ రామచిలుక అపరిశుభ్ర చేతుల వల్ల కలుగుతాయి.

మన జీవిత విధానంలో చేతుల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. శుభ్రమైన చేతులతో మాత్రమే ఆహారం తీసుకోవాలి. అవకాశం ఉన్నపుడు చెంచాలతో ఆహారం తీసుకోవాలి. చేతులకు ఇరువైపుల, వేళ్ల మధ్యలో, మణికట్టు వద్ద, అరచేయి, బొటనవేలు, గోర్ల భాగాల్లో సబ్బు (బార్ లేదా లిక్విడ్ సోప్) నురగలో ట్యాప్ వాటర్‌లో శుభ్రం చేసుకోవాలి. పాత్రల్లో నిలువ ఉన్న నీటికి బదులు ట్యాప్ వాటర్‌తో చేతులు శుభ్రం చేసుకోవాలి. చేతులు కడిగిన వెంటనే శుభ్రమైన టవల్ లేదా టిష్యూ పేపర్‌తో తుడుచుకోవాలి. టవల్ శుభ్రంగా లేని యెడల చేతులు శుభ్రం చేసుకున్నా ప్రయోజం ఉండదని గమనించాలి. నిత్యం చేతులు శుభ్రం చేసుకుంటూ ఆరోగ్య సౌభాగ్యాన్ని పొందుదాం.

కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037







పండగ ముందు బిగ్ రిలీఫ్..

భారీగా తగ్గిన బంగారం ధరలు..

దసరా, దీపావళి పండగల ముందు పసిడి ప్రియులకు బంగారం ధరలు గుడ్‌న్యూస్ చెప్పాయి. గత వారం రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం, వెండి ధరలు సడెన్‌గా దిగొచ్చాయి. పోల్చుకుంటే బుధవారం ఉదయం 10 గంటల సమయానికి 24 క్యారెట్ల తులం బంగారంపై రూ. 1000కి పైగా తగ్గగా.. ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల బంగారంపై రూ. 900కి పైగా దిగొచ్చింది. దీంతో ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,48,260 వద్ద ట్రేడవుతోంది.

ఇక బుధవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ. 1,48,260గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ. 1,35,900 వద్ద ట్రేడవుతోంది. అలాగే ఏపీలోని విశాఖపట్నం, విజయవాడలో సైతం దాదాపు హైదరాబాద్ తరహా రేట్లే కొనసాగుతున్నాయి. ఇక వెండి విషయానికి వస్తే హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ. 2,45,000 ఉంది.

దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ. 1,48,410 వద్ద ట్రేడవుతుండగా, 22 క్యారెట్ల ధర రూ. 1,36,050 గా ఉంది. అలాగే ముంబై, పుణె, బెంగళూరు వంటి నగరాల్లో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ. 1,48,260గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ. 1,35,900 గా ఉంది. వెండి కిలో ధర రూ. 2,34,900 లుగా ఉంది. ఇక చెన్నైలోనూ ఇదే తరహా రేట్లు కొనసాగుతున్నాయి.

ముఖ్యంగా నేడు బంగారం ధరలు తగ్గడానికి ప్రధాన కారణం ఆసియా–యూరోపియన్ ట్రేడింగ్ సెషన్ ప్రారంభంలో అంతర్జాతీయ మార్కెట్లో అమెరికన్ డాలర్ విలువ పుంజుకోవడమే అని విశ్లేషకులు అంటున్నారు. అలాగే గత సెషన్‌లో ట్రేడర్లు స్వల్పకాలిక లాభాలను పొందడానికి అమ్మకాలకు మొగ్గు చూపారని.. తద్వారా బంగారం ధరలు దిగొచ్చినట్టు తెలిపారు.

ప్రపంచంలోనే టాప్ కంపెనీల చిప్స్ భారత్‌లోనే డిజైన్: అశ్వినీ వైష్ణవ్



ప్రపంచ సాంకేతిక రంగంలో భారత్‌ను కీలక శక్తిగా నిలబెట్టే దిశగా దేశం అత్యంత పరిణతితో, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన ప్రతిష్టాత్మక 'బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్' సదస్సులో పాల్గొన్న ఆయన 'సాంకేతిక సార్వభౌమత్వం' (అనే అంశంపై మాట్లాడారు. టెక్ సార్వభౌమత్వాన్ని సంపూర్ణ స్వావలంబన కోణంలో కాకుండా వ్యూహాత్మక పరస్పర ఆధారపడటం, పటిష్టమైన సరఫరా వ్యవస్థల దృక్కోణంలో చూడాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఏయే రంగాల్లో ఉత్పత్తి, డిజైనింగ్, పూర్తిస్థాయి ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ సామర్థ్యాలు మన దేశంలోనే ఉండాలి.. ఏయే అంశాల్లో ఇతర దేశాలపై ఆధారపడాలనే స్పష్టత ప్రభుత్వానికి ఉందని తెలిపారు. టెక్నాలజీ అనేది ఎల్లప్పుడూ ప్రపంచ సరఫరా గొలుసుతో ముడిపడి ఉంటుందని, ఆ విలువైన వ్యవస్థలో భారత్ కీలక భాగస్వామి గా ఉంటూ అత్యున్నత విలువను జోడించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యంగా సెమీకండక్టర్ రంగాన్ని ఉదాహరణగా ప్రస్తావిస్తూ.. ప్రస్తుతం ప్రపంచ దిగ్గజ సంస్థలైన ఎన్విడియా క్వాల్‌కామ్ ఏఎండీ వంటి బడా కంపెనీలకు చెందిన సరికొత్త 2–నానోమీటర్, 3–నానోమీటర్ చిప్‌లన్నీ భారతదేశం లోనే డిజైన్ అవుతున్నాయని మంత్రి వెల్లడించారు. చిప్ డిజైనింగ్ రంగంలో భారత్ ఇప్పటికే అంతర్జాతీయ కేంద్రంగా నిలిచిందని, ఆ తర్వాత దశలైన సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ (ఖీఫుఎ), ఏటీఎంపీ – అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్) మరియు పూర్తిస్థాయి ప్రోడక్ట్ డిజైనింగ్ దిశగా దేశం సహజమైన పురోగతిని సాధిస్తోందని వివరించారు. కీలకమైన సాంకేతికతల్లో క్లిష్టమైన డిపెండెన్సీలను అధిగమిస్తూ, గ్లోబల్ వాల్యూ చైన్‌లో దేశ పాత్రను తిరుగులేని రీతిలో విస్తరించడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అశ్వినీ వైష్ణవ్ ఉద్ఘాటించారు.

డిజిటల్ విప్లవంలో 'రిలయన్స్' చెరగని ముద్ర.. ఇప్పుడు ఏఐతో కొత్త శకం

భారతదేశ పారిశ్రామిక ప్రస్థానంలో రిలయన్స్ సంస్థకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఒక చిన్న గదిలో ప్రారంభమైన వ్యాపార ఆలోచన నుంచి దేశవ్యాప్తంగా కోట్లాది ప్రజల జీవితాలను ప్రభావితం చేసే పారిశ్రామిక, డిజిటల్ సామ్రాజ్యం వరకు రిలయన్స్ ప్రయాణం సాగింది.

ఈ ప్రస్థానం వెనుక దూరదృష్టి, వ్యాపార దక్షత, కొత్త అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యం ఉన్నాయి. అంబానీ కుటుంబం తరతరాలుగా నిర్మించిన ఈ వారసత్వం నేడు భారత ఆర్థిక, పారిశ్రామిక, సాంకేతిక పరివర్తనలో తనదైన ముద్ర వేస్తోంది. రిలయన్స్ ప్రస్థానంలో వ్యాపార విజయాలతో పాటు సామాజిక సేవకు కూడా విశిష్ట స్థానం ఉంది. నీతా అంబానీ నాయకత్వంలో రిలయన్స్ ఫౌండేషన్ విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, క్రీడలు, మహిళా సాధికారత వంటి రంగాల్లో వివిధ కార్యక్రమాలను చేపడుతోంది. రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు 6.6 కోట్ల మందికి పైగా ప్రజలు డైరెక్టుగా, ఇన్ డైరెక్టుగా సహాయం పొందారు. అలాగే ఈ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 54,000కు పైగా గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధిని ప్రోత్సహించడం, యువతకు మెరుగైన భవిష్యత్తుకు మార్గం చూపడం రిలయన్స్ ఫౌండేషన్ సంస్థ ప్రధాన లక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

అందరికీ కృత్రిమ మేధస్సు పరిజ్ఞానం!

సామాజిక అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాదు. ప్రజలకు విద్య, నైపుణ్యాలు, ఆరోగ్య సదుపాయాలు, స్వయం అభివృద్ధికి అవసరమైన అవకాశాలను కల్పించడం కూడా అంతే ముఖ్యం. ఈ దిశగా రిలయన్స్ సంస్థ చేపడుతోన్న కార్యక్రమాలు సమాజంలో దీర్ఘకాలిక మార్పులకు పునాది వేస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న ప్రస్తుత ప్రపంచంలో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ –ూూ×) కీలక పాత్ర పోషిస్తోంది. విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, సమాచార రంగాలతో పాటు అనేక రంగాల్లో ఏఐ వినియోగం విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్తు తరాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం అత్యంత ప్రాధాన్యంగా మారింది. ఈ నేపథ్యంలో జియో 12 భారతీయ భాషల్లో కృత్రిమ మేధస్సుపై ఉచిత కోర్సును అందిస్తోంది. భాషా పరిమితులు లేకుండా విద్యార్థులు, యువత ఏఐ గురించి నేర్చుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయి. సాంకేతిక విప్లవం కొద్దిమందికే పరిమితం కాకుండా ప్రతి చిన్నారికీ చేరాలనే ఆలోచన డిజిటల్ సమానత్వానికి కీలకం. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన డిజిటల్ విద్య అందుబాటులోకి వస్తే, భవిష్యత్తులో ఆవిష్కరణలకు భారత యువత కేంద్రంగా మారే అవకాశం ఉంది.



రిలయన్స్ కథ కేవలం ఒక వ్యాపార సంస్థ ఎదుగుదలకు సంబంధించినది కాదు. అది భారతదేశంలో మారుతున్న పారిశ్రామిక ఆశయాలకు, సంపద సృష్టికి, కొత్త ఆలోచనలకు ప్రతీకగా నిలిచిన ప్రస్థానం. దశాబ్దాల క్రితం చిన్న స్థాయిలో ప్రారంభమైన వ్యాపారం కాలక్రమేణా అనేక రంగాలకు విస్తరించింది. పెట్రోకెమికల్స్, ఇంధనం, రిటైల్, టెలికమ్యూనికేషన్స్, డిజిటల్ సేవలు వంటి విభిన్న రంగాల్లో రిలయన్స్ తన కార్యకలాపాలను విస్తరించింది. ప్రతి దశలోనూ కొత్త అవకాశాలను గుర్తించడం, భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టడం, మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వ్యూహాలను రూపొందించడం సంస్థ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించాయి. ఒకప్పుడు పరిమిత వర్గాలకు మాత్రమే అందుబాటులో ఉన్న అనేక సేవలు నేడు సామాన్య ప్రజల జీవితాల్లో భాగమవుతున్నాయి. ముఖ్యంగా డిజిటల్ కనెక్టివిటీ విస్తరణతో సమాచార వినియోగం, ఆన్‌లైన్ విద్య, డిజిటల్ వ్యాపారాలకు కొత్త మార్గాలు ఏర్పడ్డాయి. భారతదేశ డిజిటల్ పరివర్తనలో జియో ప్రవేశం కూడా ఒక ముఖ్యమైన మలుపుగా నిలిచింది.

వర్తమాన విజయాల నుంచి భవిష్యత్తు అవకాశాల వరకు!

రిలయన్స్ భవిష్యత్తు ప్రయాణం అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, కొత్త వ్యాపార రంగాలు, మారుతున్న వినియోగదారుల అవసరాలతో ముడిపడి ఉంది. కృత్రిమ మేధస్సు, డిజిటల్ సేవలు, కొత్త తరం పరిశ్రమలు, ఇంధన పరివర్తన వంటి రంగాల్లో చోటుచేసుకుంటున్న మార్పులు సంస్థలకు కొత్త అవకాశాలను అందిస్తున్నాయి. అయితే, ఒక సంస్థ వారసత్వం అంటే కేవలం నిర్మించిన పరిశ్రమలు, సంపాదించిన సంపద, సాధించిన వ్యాపార విజయాలు మాత్రమే కాదు. ప్రజలకు అందించిన అవకాశాలు, సృష్టించిన ఉపాధి, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరించిన తీరు, దేశ అభివృద్ధికి అందించిన సహకారం కూడా దాని వారసత్వంలో భాగమే. ఈ కోణంలో చూస్తే రిలయన్స్ కథ గత విజయాలను గుర్తుచేసుకోవడానికే పరిమితం కాదు. భవిష్యత్తులో భారతదేశం సాధించగల అభివృద్ధి గురించి ఆలోచించడానికి కూడా ఒక సందర్భాన్ని అందిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా తమ దేశాల ఆర్థిక, పారిశ్రామిక రంగాలపై గణనీయమైన ప్రభావం చూపిన వ్యాపార కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. భారతదేశంలో అంబానీ కుటుంబం కూడా అలాంటి ప్రముఖ కుటుంబాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఒక తరం ప్రారంభించిన వ్యాపార ప్రస్థానాన్ని మరో తరం కొత్త రంగాలకు విస్తరించడం, మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యూహాలను మార్చుకోవడం ఈ ప్రయాణంలో కనిపించే ముఖ్యమైన అంశాలు. గుజరాత్‌లోని ఒక చిన్న గది నుంచి ప్రారంభమైన ప్రస్థానం నేడు దేశవ్యాప్తంగా ప్రజల చేతుల్లోని డిజిటల్ పరికరాల వరకు విస్తరించిందనే రూపకం రిలయన్స్ పరిణామాన్ని ప్రతిబింబిస్తుంది. అయితే, ఈ ఎదుగుదల వెనుక వ్యాపార నిర్ణయాలు, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగుల కృషి, మార్కెట్ మార్పులు వంటి అనేక అంశాలు ఉన్నాయి.

భారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటున్న తరుణంలో, పరిశ్రమలు మరియు సాంకేతికతల పాత్ర మరింత పెరుగుతోంది. ఈ ప్రయాణంలో రిలయన్స్ వంటి భారీ సంస్థల నిర్ణయాలు, పెట్టుబడులు, ఆవిష్కరణలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. రిలయన్స్ వారసత్వం అంటే గతంలో సాధించిన విజయాల సమాహారం మాత్రమే కాదు.. భవిష్యత్తులో కొత్త అవకాశాలను సృష్టించాలనే నిరంతర ప్రయత్నం కూడా. వ్యాపార ఆశయాలను జాతీయ అభివృద్ధితో అనుసంధానిస్తూ, సాంకేతిక పరివర్తనకు అనుగుణంగా ముందుకు సాగడం ఈ ప్రస్థానానికి ప్రత్యేకతను అందిస్తోంది.

సినీ గేయ రచయిత కందికొండ యాదగిరి జయంతి వేడుకలు



దుగ్గొండి, (సింగిడి): నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు నాగుర్లపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ కందికొండ యాదగిరి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు సినీ గేయరచనలో కందికొండ యాదగిరి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ బానోతు నవీన్ నాయక్, మండల బీజేపీ అధ్యక్షుడు తనుగుల అంబేద్కర్, మాజీ ఎంపీటీసీ మచ్చికనరసయ్యపాల్గొని కందికొండ యాదగిరికి నివాళులర్పించారు.
అనంతరం కందికొండ శ్రీధర్, ముప్పారపు గణేష్, పోలేబోయిన అశోక్, నల్ల మహేందర్, పెరుమల్ల చిన్న, కట్టస్వామి, తనుగుల సుధాకర్, జవాజి కుమారస్వామి, ఇల్లందుల భాస్కర్, కొర్ర పృథ్వీరాజ్, బానోత్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ యువజన విభాగం అధ్యక్షుల నియామకం



బుగ్గారం, (సింగిడి)::భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు ఆదేశాల మేరకు, బుగ్గారం మండల యువమోర్చా అధ్యక్షుడిగా బుగ్గారం మండల కేంద్రానికి చెందిన గొండ వెంకటేష్‌ను నియమిం చినట్లు మండల అధ్యక్షుడు మెడవేణి శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు మంచె రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతను సంఘటితం చేస్తూ,ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని,పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని శ్రీధర్, మంచె రాజేష్ సూచించారు.

దసరా సంబరాలకు బిక్కనూర్ సిద్ధం

అఖిలపక్షం ఆధ్వర్యంలో ఏర్పాట్లపై చర్చ..
స్థల పరిశీలన, శుభ్రత పనులకు శ్రీకారం



బిక్కనూర్, (సింగిడి):బిక్కనూర్ పట్టణంలో దసరా పండు గ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారం భమ య్యాయి. సర్పంచ్ బాల్యల రేఖ సుదర్శన్ ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు సమావేశమై ఉత్సవాల నిర్వ హణ, అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు.ఇందులో భాగంగా పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల వద్ద దసరా ఉత్సవాల నిర్వహణకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఉత్సవాలు నిర్వహించే ప్రాంగణంలో శుభ్రత పనులు చేపట్టారు. పండుగను ప్రజలందరి భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహిం చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నాయకులు చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాల్యల రేఖ సుదర్శన్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

ఆటపాటలతో సందడి..
చెరువులో బతుకమ్మల నిమజ్జనం



బిక్కనూర్, (సింగిడి):బిక్కనూర్ మండలం పెద్దమ ల్లారెడ్డి గ్రామంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను గ్రామంలోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరూ సుఖసం తోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.

పెద్దమ్మ గుడి దారికి మరమ్మతులు



బుగ్గారం, (సింగిడి): బుగ్గారం గ్రా మంలోని బెస్త సత్తన్న ఇంటి సమీపం నుంచి పెద్దమ్మ గుడికి వెళ్లే దారిలో రాకపో కలకు ఇబ్బందులు ఎదుర వుతున్నాయని రైతులు సర్పంచ్ నక్క రాజవ్వ--రాజయ్య దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్ సంబంధిత అధికారులతో మాట్లాడి, మంగళవారం దారిలో మొరం పోయించి మరమ్మ తులు చేయించారు. దీంతో రైతులు, గ్రామస్తులకు రాకపోకల ఇబ్బందులు తగ్గనున్నాయి. గ్రామ ప్రజలు, రైతుల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అక్బర్, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వంగర ప్రధాన రహదారిపై మృత్యుకూపం!

మూలమలుపు వద్ద పాడుబడ్డ బావి.. పొంచి ఉన్న ప్రమాదం
ప్రమాదం జరిగాకే స్పందిస్తారా?
అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

భీమదేవరపల్లి, (సింగిడి): ప్రమాదం పొంచి ఉందని తెలిసినా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ సమీపంలోని (మాట్ల ఎల్లయ్య ఇంటి వద్ద) ప్రధాన రహదారి పక్కన ఉన్న పాడుబడ్డ బావి ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే రహదారిపై, అదీ మూలమలుపు వద్ద బావి ఉండటంతో ఏ క్షణంలో ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రక్షణ గోడ లేదు.. హెచ్చరిక బోర్డు లేదు!

ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఈ బావికి కనీసం రక్షణ గోడ కూడా లేదు. ప్రమాదాన్ని సూచించే హెచ్చరిక బోర్డులనూ ఏర్పాటు చేయలేదు. మూలమలుపు కావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం వాహనదారులకు మరింత ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో వెలుతురు సరిగా లేకపోవడంతో ఈ మార్గంలో కొత్తగా ప్రయాణించేవారు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?

ప్రధాన రహదారిపై బావి ప్రమాదకరంగా ఉందని పలుమార్లు తెలియజేసినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నా పట్టించుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాతే అధికారులు మేల్కొంటారా? అంటూ ప్రశ్నిస్తున్నారు.



తక్షణమే బావిని పూడ్చివేయాలి

ఏదైనా అవాంఛనీయ ఘటన జరగకముందే గ్రామపంచాయతీ పాలకవర్గం, మండల అధికారులు స్పందించాలని ప్రయాణికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. పాడుబడ్డ బావిని వెంటనే పూడ్చివేయడంతోపాటు, అవసరమైన రహదారి భద్రత చర్యలు చేపట్టి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ నుంచి
బీఆర్‌టీయూలోకి భారీగా ఆశాల చేరికలు





సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె
రాష్ట్ర అధ్యక్షురాలు రావుల సంతోష, జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు హెచ్చరిక

దుగ్గొండి, (సింగిడి):కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని ఆశాల యూనియన్ బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు రావుల సంతోష, జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు హెచ్చరించారు. వరంగల్‌లోని రాజశ్రీ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పిట్ట శ్రీలత, సీఐటీయూ అనుబంధ సంఘం జిల్లా కార్యదర్శి సుజాత అధ్వర్యంలో ఖిలా వరంగల్, రంగశాయి పేట, ఎస్‌ఆర్‌ఆర్ తోట, సీకేఎం, ఎంజీఎం, పైడిపల్లి, రాయపర్తి తదితర ప్రాంతాల నుంచి సుమారు 200 మంది ఆశా కార్యకర్తలు బీఆర్‌టీయూలో చేరారు. ఈ చేరికలు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువాల లలిత, జిల్లా కార్యదర్శి గోలి సంధ్య ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలకు నెలకు రూ. 18 వేల స్థిర వేతనం చెల్లిస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి వెయ్యి రోజులు గడిచినా అమలు చేయలేదని విమర్శించారు. ఆశా కార్యకర్తలు తమ హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడుతుంటే నిర్బంధాలు ప్రయోగించి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. ఏఎన్‌సీ లక్ష్యాల పేరుతో వైద్యాధికారులు, ప్రభుత్వం కలిసి ఆశా కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే నెలలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 18 వేల మంది ఆశా కార్యకర్తలు నిరవధిక సమ్మెకు దిగుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బండారి మంజుల, హనుమకొండ జిల్లా కార్యదర్శి ప్రేమలత, పీహెచ్‌సీ అధ్యక్షులు అనిత, సాలమ్మ, నాగమణి, సునీత, రమ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సల్మాన్ ఖాన్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌కు జెర్సీలు స్పాన్సర్
బీఆర్ఎస్ యువ నాయకులు లక్కిరెడ్డి ప్రణతి, ప్రశాంత్ రెడ్డి సహకారం



మహాముత్తారం, (సింగిడి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ మాజీ ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్ స్మారకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో మహాముత్తారం మండలానికి చెందిన మహాముత్తారం ఎల్‌పీఆర్ లయన్స్ జట్టుకు బీఆర్ఎస్ యువ నాయకులు లక్కిరెడ్డి ప్రణతి, ప్రశాంత్ రెడ్డి జెర్సీలు, లోయర్లు స్పాన్సర్ చేశారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు ఈ సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాముత్తారం బీఆర్ఎస్ మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మార్కరాము గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెల్మరెడ్డి అనిల్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, బోర్లగూడెం సర్పంచ్ అజ్మీరా ధరం సింగ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మిర్జా సాలార్ బేగ్, నిమ్మగూడెం సర్పంచ్ జాడి రాజేష్, పోలారం సర్పంచ్ అంబాల రాజబాబు, మండల యువజన విభాగం కన్వీనర్ జాతోట్ జైపాల్ నాయక్, నాయకుడు పంగ సంపత్ తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు యువ నాయకులు ముందుకు రావడం పై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో ప్రధాన రహదారిపై
నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

బతుకమ్మ బండ వరకు లైట్లు ఏర్పాటు చేస్తాం: సర్పంచ్ పోలు సంపత్
మహిళలకు చీకటి ఇబ్బందులు లేకుండా చర్యలు

హన్మాన్‌కొండ (సింగిడి):హన్మాన్‌కొండ మండలంలోని గాంధీనగర్ గ్రామ ప్రధాన రహదారిపై నుంచి బతుకమ్మ బండ వరకు నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు, గ్రామస్తులు చీకటితో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం ఈ చర్యలు చేపట్టింది. గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి బతుకమ్మ పండుగ సమయంలో ప్రధాన రహదారిపై సరైన వెలుతురు లేక మహిళలు, గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం ప్రధాన రహదారిపై నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. త్వరలోనే వాటికి విద్యుత్ దీపాలను సైతం ఏర్పాటు చేసి, ప్రధాన రహదారి నుంచి బతుకమ్మ బండ వరకు వెలుతురు అందుబాటులోకి తీసుకువస్తామని సర్పంచ్ పోలు సంపత్ తెలిపారు. బతుకమ్మ పండుగకు వచ్చే మహిళలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ పనులను సర్పంచ్ పోలు సంపత్, ఉపసర్పంచ్ శ్రీశైలం దగ్గరుండి పర్యవేక్షించారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు, త్వరలో లైట్లు అమర్చేందుకు తీసుకుంటున్న చర్యలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



అనాథ కుటుంబానికి
అంబేద్కర్ యువజన సంఘం అండ..

పులి భాస్కర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్న యువత

ములుగు ప్రతినిధి, (సింగిడి):ఆపదలో ఉన్న పేద కుటుంబానికి అండగా నిలిచి అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు మానవ త్వాన్ని చాటుకున్నారు. మంగపేట మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పులి భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతి చెందారు. ఇప్పటికే తల్లిదండ్రులను కోల్పోయిన ఆకుటుం బంలో భాస్కర్ మరణంతో అక్క, చెల్లి మాత్రమే మిగిలారు. కుటుంబానికి సంపాదించే దిక్కు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని తెలుసుకున్న కోమటిపల్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గారె విష్ణు వర్ధన్, సంఘం సభ్యులు వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి నగదు రూపంలో ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గారె విష్ణు వర్ధన్ మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత్వానికి నిజమైన నిదర్శన మని అన్నారు. భాస్కర్ కుటుంబం తీవ్ర దుఃఖంలో ఉండటంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకొని తమ సంఘం తరఫున చిన్నపాటి సహాయం అందించినట్లు తెలిపా రు. సమాజంలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగి స్తామని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న పేద కుటుం బానికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన అంబేద్కర్ యువజన సంఘం సభ్యులను గ్రామ స్తులు, కుల సంఘం పెద్దలు ప్రత్యేకంగా అభినం దించారు. ఈ కార్యక్ర మంలో సంఘం అధ్యక్షుడు గారె విష్ణు వర్ధన్, కమిటీ సభ్యులు, కుల సంఘం పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఘనంగా సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలు





మారుమోగిన జై సిరికొండ నినాదాలు
బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్న బిఆర్ఎస్ శ్రేణులు

భూపాలపల్లి, (సింగిడి):
భూపాలపల్లి పట్టణంలో తెలంగాణ శాసనసభాపతి, బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులు, సిరికొండ మధుసూదనా చారి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు,కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లి పట్టణంలోని మంజూరు నగర్‌క్యాంపు కార్యాలయం నుంచి గణేష్ చౌక్ మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని కేక్ కట్ చేసి సిరికొండ మధుసూదనాచారి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధికి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా సాధనకు సిరికొండ మధుసూదనాచారి చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, సేవా భావం ఎందరికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో భూపాలపల్లి ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. భూపాలపల్లి పట్టణంలోని రహదారులపై ఎండలో జీవనోపాధి కోసం చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి గొడుగులను పంపిణీ చేశారు.

ఆర్టీసీ బస్టాండ్లను సందర్శించి పరిశీలించిన రిజినల్ జిల్లా మేనేజర్- ఆర్మూర్ డిపో మేనేజర్..

బస్టాండ్ స్థలాలను కబ్జాలకు గురికాకుండా ప్రజాప్రతినిధులు సహకరించాలి...
ప్రయాణికుల సౌకర్యార్థం అధిక బస్సులను ఏర్పాటు...

ఆర్మూర్, (సింగిడి): నిజామాబాద్ జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కృష్ణమూర్తి, ఆర్మూర్ డిపో మేనేజర్ పద్మా రెడ్డి లు బుధవారం రోజున ఆర్మూర్, పెర్కిట్, మోర్తాడ్,కమ్మర్‌పల్లి, పలు మండల కేంద్రాలలో గల ఆయా బస్టాండ్లను సందర్శించి పరిశీలించారు. బస్టాండ్లలో గల సమస్యలను, షట్టర్ రూమ్లను, మరుగుదొడ్లు, మూత్రశాలలు, బస్టాండ్లలో శుభ్రత పై పరిశీలించారు. ఈ సంద ర్భంగా రీజినల్ మేనేజర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ, బస్టాండ్ ప్రాంతాల స్థలాల సరిహద్దుల ప్రాంతాలను కబ్జాలకు ఎవరు పాల్పడకుండా స్థానిక ప్రజాప్ర తినిధులు పర్యవేక్షించాలని, ఎలా ఎవరైనా కబ్జాలకు పాల్పడితే వెంటనే సమాచారం అందించాలని ఆయన కోరారు. బస్టాండ్లలో ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని రెట్టింపు బస్సులు కొనసాగిస్తున్నమన్నారు. బస్టాండ్లలో ప్రయాణికులు తమ తిను బండారాలను స్థానిక బస్టాండ్లలో ఏర్పా టు చేసిన చెత్త డబ్బాలలో వేయాలన్నారు. ప్రయా ణికులు బస్టాండ్లను తమ ఇంటి మాదిరిగానే పరిశు భ్రత పాటించాలన్నారు. జర్నలిస్టులు అడిగిన పలు సమస్యలపై రీజనల్ మేనేజర్ కృష్ణమూర్తిమాట్లా డుతూ, సమస్యలపై నివేదికను ప్రభుత్వానికి అందజేసి, నిధులు మంజూరు కాగానే అభివృద్ధి పనులు చేపడతామన్నారు.



అన్నపూర్ణ దేవిగా దుర్గామాత దర్శనం

మార్కండేయ మందిరంలో 19వ వార్షికోత్సవ వేడుకలు..

బిక్కనూర్, (సింగిడి):బిక్కనూర్ మండలం కాచాపూర్ గ్రామంలోని మార్కండేయ మందిరంలో దుర్గామాత అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆలయంలో 19వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ వేడుకల్లో భాగంగా జంగం బాలప్రకాష్ కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని దుర్గామాతను ప్రార్థించారు.



దసరా సెలవులను తప్పనిసరిగా అమలు చేయాలి

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే ఆందోళనలు చేపడతాం: ఎన్ఎస్యూఐ మండల అధ్యక్షుడు సమీరుద్దీన్.



చేవెళ్ల, (సింగిడి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రకటించిన దసరా సెలవులను అన్ని విద్యాసంస్థలు తప్పనిసరిగా అమలు చేయాలని ఎన్ఎస్యూఐ చేవెళ్ల మండల అధ్యక్షుడు ఎండీ సమీరుద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ, దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించేందుకు ప్రయత్నించే విద్యాసంస్థల తీరును తప్పుబట్టారు. విద్యార్థులు చదువుతో పాటు కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకునే అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే ఎన్ఎస్యూఐ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణకు ఎన్ఎస్యూఐ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని సమీరుద్దీన్ స్పష్టం చేశారు.

బాసర ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి







గోదావరి పుష్కరాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ ప్రతినిధి, బాసర (సింగిడి): బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణంలో భాగంగా మంగళవారం బాసరలో పర్యటించిన కలెక్టర్, ముందుగా శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో చేపట్టిన నిర్మాణాలకు సంబంధించిన వ్యర్థాలను జాగ్రత్తగా తొలగించాలని సూచించారు. ఆలయ నిర్మాణ పనులన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షిస్తూ, నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోదావరి నదీ తీరంలోని పుష్కర ఘాట్లను పరిశీలించి, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని, వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పుష్కరాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఆర్ అండ్ బీ, నీటిపారుదల శాఖల ఈఈలు సుభాష్, అనిల్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బీసీలకు రాజ్యాధికారం రావాలి!

బీసీ బహుజనుల హక్కుల సాధనకు తీన్మార్ మల్లన్న పాదయాత్రకు సంఘీభావం

బిజినపల్లి, (సింగిడి): బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సామాజిక న్యాయం, సమాన హక్కులు కల్పించడంతో పాటు బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రిని చేయాలని బీసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బిజినపల్లి మండల కేంద్రంలోని బీసీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వేముల సత్యశీలసాగర్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపడుతున్న బీసీ పాదయాత్రకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బహుజనులకు అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యం దక్కడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న బహుజనులకు అధికారం, సామాజిక గౌరవం దక్కాలని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, నాణ్యమైన విద్య, వైద్యం, హాస్టల్ వసతులు, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, అసంఘటిత కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బహుజనుల సమస్యల పరిష్కారం, బీసీల రాజ్యాధికార సాధనే లక్ష్యంగా తీన్మార్ మల్లన్న చేపడుతున్న పాదయాత్ర ఈ నెల 15న ఉదయం 11 గంటలకు బిజినపల్లికి



చేరుకోనుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, యువత, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, మేధావులు, వివిధ రాజకీయ పార్టీల బహుజన నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ కమిటీ చైర్మన్ అంతటి రాజేందర్ గౌడ్, మండల గౌరవ అధ్యక్షుడు దాసర్ల వెంకటస్వామి, ఉపాధ్యక్షులు అతినారపు బాల్ లక్ష్మయ్య, ఉప్పనామొని శ్రీను, అప్పలి శ్రీనివాస్ యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలో పాల్గొన్న
కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, (సింగిడి): ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలపై జవాబుదారీతనం కోరుతూ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను నిర్ధారించాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని తన సంఘీభావాన్ని తెలిపారు. తెలంగాణ నుండి వెళ్లిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన నిరసనలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత పవిత్రమైనవని, ప్రతి ఓటరు ఓటుకు విలువ ఉండాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు జరగకుండా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా నుండి ఓట్ల తొలగింపు, అక్రమాలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఇండియా కూటమి చేస్తున్న ఈ పోరాటంలో తామంతా భాగస్వాములమని, ప్రజల గొంతుకను ఢిల్లీలో వినిపిస్తామని ఆయన స్పష్టం చేశారు.



గడ్డిఅన్నవరం క్షేత్రంలో అన్నపూర్ణాదేవి అలంకరణ..

భక్తులకు అన్నప్రసాద వితరణ

లోకకల్యాణం కోసం 17న లక్ష్మీ, వరుణ హోమాలు.. 18న చండీ హోమం



ఎల్బీనగర్, (సింగిడి): గడ్డి అన్నవరం క్షేత్రంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణాదేవి అలంకరణ నిర్వహించి, సుమారు 350 మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ దేవర లింగారెడ్డి మాట్లాడుతూ, ఆలయంలో భక్తులకు అనుగుణంగా ప్రతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతిరోజూ స్వామివారి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయని తెలిపారు. ఆలయ ప్రధాన కార్యదర్శి, అమ్మవారి విగ్రహ దాత చకిలం రమణయ్య మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలందరికీ స్వామివారి, అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని అన్నారు. ఆలయ కోశాధికారి వక్కలంక శ్రీనివాసరావు మాట్లాడుతూ, లోకకల్యాణం, వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ ఈ నెల 17న లక్ష్మీ హోమం, వరుణ హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ నెల 18న అమ్మవారి సన్నిధిలో చండీ హోమం నిర్వహించ నున్నట్లు ఆలయ సంయుక్త కార్యదర్శి భాషపాక సంతోష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ బచ్చు సత్యనారాయణ పాల్గొన్నారు.

చెత్త మధ్య బతుకులు.. భయం నీడలో ప్రజలు!

రేవల్లి నాలుగో వార్డులో పారిశుద్ధ్య సమస్య.. పట్టించుకునేదెవరు?

అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా మారని పరిస్థితి

రాత్రి వేళల్లో విషసర్పాల భయంతో బిక్కుబిక్కుమంటున్న కుటుంబాలు

రేవల్లి (సింగిడి): ఒక ఇల్లు కట్టుకోవడానికి జీవితకాలం కష్టపడతారు.. కుటుంబాన్ని సంతోషంగా ఉంచుకోవడానికి రెక్కలు ముక్కలు చేసుకుంటారు.. తమ పిల్లలు ఆరోగ్యంగా, సురక్షితంగా పెరగాలని ప్రతి తల్లిదండ్రి కోరుకుంటారు. కానీ ఇంటి చుట్టూ అపరిశుభ్రత, రాత్రి వేళల్లో విషసర్పాల సంచారం ఉంటే ఆ కుటుంబాలకు ప్రశాంతత ఎక్కడ ఉంటుంది? సొంత ఇంట్లోనే భయంతో బతకాల్సిన పరిస్థితి ఎదురైతే వారి బాధను ఎవరు అర్థం చేసుకుంటారు? వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలోని నాలుగో వార్డులో పారిశుద్ధ్య సమస్యపై స్థానికులు వ్యక్తం చేస్తున్న ఆవేదన ఇదే ప్రశ్నను లేవనెత్తుతోంది. వార్డు పరిసరాల్లో పరిశుభ్రత లోపించిందని, సమస్యను అధికారులకు, గ్రామపంచాయతీకి పలుమార్లు తెలియజేసినా పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రజలు నివసించే ప్రాంతాల్లో కనీస పారిశుద్ధ్య వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై లేదా? అని ప్రశ్నిస్తున్నారు.

పిల్లల భద్రతపై తల్లిదండ్రుల ఆందోళన

పారిశుద్ధ్యం అంటే రోడ్లపై చెత్తను తొలగించడం మాత్రమే కాదు.. ప్రజలు భయం లేకుండా తమ ఇళ్లలో, వీధుల్లో జీవించేలా చూడటం కూడా. ముఖ్యంగా చిన్నపిల్లలు ఇంటి ముందు ఆడుకునే సమయంలో, వృద్ధులు రాత్రి వేళల్లో బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు పరిసరాలు సురక్షితంగా ఉండటం ఎంతో అవసరం. అయితే నాలుగో వార్డులో రాత్రి వేళల్లో విషసర్పాలు బయటకు వస్తున్నాయని స్థానికులు చెబుతుండటంతో కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. ఏ క్షణంలో ఏ ప్రమాదం ఎదురవుతుందోననే భయం వారి దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తోంది. ఒక్కసారి ఆలోచించండి.. రాత్రి సమయంలో ఇంటి బయటకు వెళ్లాలన్నా భయపడే పరిస్థితి ఉంటే ఆ కుటుంబాలు ఎంతటి ఆందోళనకు గురవుతాయో! సమస్య చిన్నదని భావించి పక్కన పెట్టడం సులభమే.. కానీ ఆ సమస్యతో జీవించే ప్రజలకు మాత్రం అది ప్రతిరోజూ ఎదురయ్యే ఇబ్బంది.



ఫిర్యాదులు వినిపిస్తున్నాయి.. పరిష్కారం ఎప్పుడు?

ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేది గొడవ చేయడానికి కాదు.. తమకు కనీస సౌకర్యాలు కల్పించాలనే ఆశతోనే. పలుమార్లు విన్నవించుకున్నా పరిస్థితిలో మార్పు లేకపోవడం వారిలో అసంతృప్తిని పెంచుతోంది. ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. నాలుగో వార్డులో పారిశుద్ధ్య పనులు చేపట్టి చెత్తాచెదారాన్ని తొలగించడం, పిచ్చిమొక్కలను శుభ్రం చేయడం, విషసర్పాల ముప్పు తగ్గేలా అవసరమైన చర్యలు తీసుకోవడం అత్యవసరం. అంతేకాదు, ఒకసారి శుభ్రం చేసి వదిలేయకుండా నిరంతరం పారిశుద్ధ్య నిర్వహణ జరిగేలా చూడాలి. అధికారులకు ఒక విజ్ఞప్తి.. ప్రజల సమస్యను కేవలం ఫిర్యాదుగా చూడకండి. దానివెనుక ఉన్న కుటుంబాల భయాన్ని, పిల్లల భద్రతపై తల్లిదండ్రుల ఆందోళనను అర్థం చేసుకోండి. లిలి ప్రజలకు కావాల్సింది పెద్ద హామీలు కాదు.. తమ వీధి పరిశుభ్రంగా ఉండాలి, తమ పిల్లలు భద్రంగా ఉండాలి, తమ కుటుంబాలు ప్రశాంతంగా జీవించాలి. ఇది ప్రజలు కోరుతున్న కనీస హక్కు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేవల్లి నాలుగో వార్డు సమస్యకు పరిష్కారం చూపుతారా? లేక ప్రజలు తమ బాధలను చెప్పుకుంటూనే ఉండాలా?

ఓట్లను తొలగిస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలి

ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిలిపివేయాలి
-తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి
-సిఐటియు జిల్లా అధ్యక్షులు బి మల్లేష్
సిఐటియు ఆఫీసు నుండి ఐబీ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన

సంగారెడ్డి బ్యూరో, (సింగిడి): దేశంలో అన్యాయంగా 13 కోట్ల ఓట్ల తొలగింపుకు కారకులైన కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే తొలగించాలి SIR ప్రక్రియను నిలిపివేయాలి తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని సిఐటియు రైతు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిఐటియు రైతు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన సుందరయ్య భవన్ నుండి ఐబి వరకు జరిగింది ఈ సందర్భంగా బి మల్లేష్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఓటు విలువను కాపాడవలసిన కేంద్ర ప్రభుత్వం తనకు నచ్చని ఓట్లను తొలగించేందుకు ఎన్నికల కమిషన్ను పెట్టుకొని ఓట్లను తొలగించే కార్యక్రమం చేస్తుందని మోడీ చెప్పిన విధంగా ఓట్లను తొలగిస్తున్న నీఈసీ జ్ఞానేశ్ కుమార్ నువ్వు తొలగించాలని ఎస్ ఐ ఆర్ ను వెంటనే నిలిపివేయాలని తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు ప్రజాస్వామ్యంలో ఓటు ఉండాలని రాజ్యాంగం చెప్తుంటే మోడీ నచ్చని ఓట్లను



తొలగించేందుకు కుట్ర చేయడం సరైనది కాదన్నారు ఢిల్లీ లో జరుగుతున్న పోరాటం ఆగదని జ్ఞానేష్ కుమార్ ను తొలగించే వరకు పోరాటం కొనసాగుతుందని సిఐటియు ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి సాయిలు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం నరసింహులు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్ నాయకులు బాగారెడ్డి యాదగిరి మహిపాల్ ప్రసన్న మల్లారెడ్డి అశోక్ శివకుమార్ దుర్గయ్య వీరేశం శ్రీశైలం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి



కోడంగల్ (సింగిడి): కొడంగల్ నియోజకవర్గ పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటుకు అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని బీఎస్పీ కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి యు. రమేష్ బాబు పిలుపునిచ్చారు. డిగ్రీ పూర్తిచేసి మూడేళ్లు గడిచిన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన యువతీ యువకులు, పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టభద్రుల ఓటు హక్కుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, తమ సమస్యలను చట్టసభల్లో వినిపించే ప్రతినిధులను ఎన్నుకోవడంలో ఈ ఓటు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో ఓటు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకొని ప్రజాస్వామ్యంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని యు. రమేష్ బాబు విజ్ఞప్తి చేశారు.

రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కనువిప్పు కళా ప్రదర్శనలో చేర్యాల ఎస్ఐ అపూర్వరెడ్డి పిలుపు

చేర్యాల (సింగిడి): జిల్లా కలెక్టర్, హైమావతి జిల్లా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్ ఆదేశాల మేరకు పోలీస్ కనువిప్పు తెలంగాణ సాంస్కృతిక సారధి సంయుక్త ఆధ్వర్యంలో చేర్యాల మండలం గుర్జకుంట గ్రామంలో సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదాల నివారణ సైబర్ నేరాలపై డ్రగ్స్ నివారణ మరియు మూఢ నమ్మకాలపై పోలీస్ కనువిప్పు బృందం మరియు తెలంగాణ సారధి కళాబృందం ద్వారా ప్రజలను చైతన్య పరచగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేర్యాల ఎస్ఐ అపూర్వరెడ్డి హాజరై మాట్లాడుతూ సైబర్ నేరాలపై జాగ్రత్తగాఉండాలని మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలుఎక్కువగా జరుగుతున్నాయని బ్యాంకు అధికారులు అని ఫోన్ చేస్తే నమ్మవద్దు అని అకౌంట్ డీటెయిల్స్ పర్సనల్ గుర్తుతెలియని వ్యక్తులకు షేర్ చేయవద్దు అని ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలనితెలిపారు యువత బెట్టింగ్ లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆన్లైన్ గేమ్స్ ఆడి మీరు మీకుటుం బాలను రోడ్డున పడవేయవద్దని కోరారు చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్య చేసుకుని జీవితాలు నాశనం చేసుకోవద్దు అని మరియు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రతి ఒక్కరు హెల్మెట్ వాడాలని సూచించారు, యువత గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని విలువైన జీవితాలు ఆగం చేసుకోవద్దని కోరారు, తల్లిదండ్రులు వారి పిల్లలకు బాధ్యతనేర్పించాలని ప్రజలుమూ ధనమ్మకాలను వీడాలని శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఏదైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 100 కు ఫోన్ చేయాలని ప్రజలను



కోరారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాశెట్టి పాండు, ఉపసర్పంచ్ మల్లి పెద్ది మురళి, మరియు వార్డుసభ్యులు, పోలీస్ కనువిప్పు బృందం బాలు, రాజుతిరుమల, అశోక్, సాంస్కృతిక సారధి గజ్వేల్ టీమ్ లీడర్స్యామ్, పుల్లూరు యాదగిరి, సారధి కవి గాయకులు పిన్నింటి రత్నం, పన్నీరుశ్రీనివాస్ హరిప్రసాద్ ఎల్లసిద్దులు, బండారునర్సింలు, దప్పు తండ భిక్షపతి తదితర కళాకారులు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.

ఘనంగా డబుల్ బెడ్రూం కాలనీలో
ముద్దపప్పు బతుకమ్మ వేడుకలు



వనపర్తి ప్రతినిధి, (సింగిడి):: వనపర్తి జిల్లా కేంద్రంలోనిచిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో సోమవారం రాత్రి కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్దపప్పు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయం ముందు మహిళలు బొడ్డెమ్మ, కోలాటాలు వేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయ పాటలతో సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకలతో కాలనీలో పండుగ వాతావరణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కాలనీ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అందర్నీ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, బతుకమ్మ సంబరాల కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



రెడ్ క్రాస్ లో ఎన్నికల్లో గెలిచిన మానిటరింగ్ కమిటీ సభ్యులకు సన్మానం



నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి): రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల్లో విజయం సాధించిన బుస్స ఆంజనేయులు, నరాల సుధాకర్,రవీందర్ లను కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మల్యాల గోవర్ధన్,?నాయకులు దేవేందర్, శంకర్ ల సన్మానించారు. మంగళవారం కేర్ డిగ్రీ కళాశాలలో ఘనంగా సన్మానించారు. గెలుపు ఓటములు సేవకు ప్రతిబంధకం కావని అన్నారు. సేవా దృక్పథంతో ముందుకు వెళ్తున్న మీతో కలిసి వస్తామని రక్తదాన కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని స్ఫూర్తిదాయకంగా నిలుస్తామని తెలియజేశారు.

ఉచిత ఆరోగ్య పరీక్షలు

ప్రజల ఆరోగ్యమే లక్ష్యం..
కౌన్సిలర్ వేగోళం పద్మ అబ్బయ్యగౌడ్...
కౌన్సిలర్ కార్యాలయంలో ఎక్స్‌రే యంత్రం ఏర్పాటు..



సుల్తానాబాద్, (సింగిడి): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో ప్రజల ఆరోగ్య పరి రక్షణకు ఉచిత ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహిం చారు. వార్డు ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో కౌన్సిలర్ కార్యాలయంలో ఎక్స్‌రే యంత్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ కా ర్యక్రమానికి 14వ వార్డు కౌన్సిలర్ వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్ ముఖ్య అతి థిగా పాల్గొన్నారు. ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు అందు బాటులో ఉండేలా చేపట్టిన ఈ కార్యక్రమానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. పలువురు ప్రజలు ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సమీరా, సూపర్‌వైజర్ రోజా, ఏఎన్ఎం వినోద, ఆశా కార్యకర్తలు వసంత, పద్మ పాల్గొని వైద్య సేవల నిర్వహణలో సహకరించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు.

పండుగ వేళ పటిష్ట భద్రత కల్పించాలి

డీసీపీకి మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్ వినతి



ఆమనగల్లు, (సింగిడి): తెలంగాణ సాంప్ర దాయ పండుగలైన బతుకమ్మ, దసరా జమ్మి పూజల నేపథ్యంలో ఆమనగల్లు పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రత కల్పించాలని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్ కోరారు. ఈ మేరకు మంగళవారం తుక్కుగూడలో ఆయన డీసీపీని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండుగ రోజుల్లో బతుకమ్మ ఆడే ప్రాంతాలు, దసరా జమ్మి పూజా స్థలాల వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, కాబట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని డీసీపీని కోరారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డీసీపీ సానుకూలంగా స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, మున్సిపాలిటీ నాయకులు కండే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌లో లొసుగులు... కాంట్రాక్టర్‌కు కాసులు...!







- 4 టన్నులకు రాయల్టీ... 30 టన్నుల ట్రాన్స్పోర్ట్...!
- భూపాలపల్లి జిల్లా టు పెద్దపల్లి జిల్లా
- ఆర్డినరీ ఇసుక పేరిట మైనింగ్ అధికారుల పర్మిషన్
- కన్నెత్తి చూడని మైనింగ్ శాఖ

మహాదేవపూర్ (సింగిడి): మైనింగ్ పర్మిషన్ తీసుకున్నాం వే బిల్లుతో పట్టా భూమిలోని ఆర్డినరీ ఇసుకను ఇటుకబట్టిలకు తరలిస్తున్నాం...మైనింగ్ అధికారులు పర్మిషన్ ఇచ్చారు.. కానీ అక్కడనుండి ఆర్డినరీ ఇసుక పేరిట ఎంత ట్రాన్స్పోర్ట్ అవుతుందో చూడకపోవడం జయశంకర్ భూపాలపల్లి జిల్లామైనింగ్ అధికారుల తీరు చర్చనీయాంశమైంది. మైనింగ్ పర్మిషన్ తో కాంట్రాక్టర్ పట్టా భూమిలోని ఆర్డినరీ ఇసుక పేరిట పెద్దపెల్లి జిల్లాలో ఇటుక బట్టీలకు లారీలలో తరలిస్తూ లక్షల్లో కూడా పెట్టుకుంటున్నాడు. విషయానికొస్తే... జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం పంకెనలో సర్వేనెంబర్ 9/19 గరికపల్లి గ్రామ శివారు లోని1.651 ఎక్టెన్షన్ లో ఆర్డినరీ ఎర్త్ పేరిట భూపాలపల్లి మైనింగ్ శాక అధికారులు పెద్దపల్లి జిల్లా ఇటుక బట్టీలకు పర్మిషన్ ఇచ్చారు. కాగా మైనింగ్ అధికారులు వారికి టన్నుకు కొంత రూపాయల మేర ప్రభుత్వానికి రాయల్టీ కట్టించుకొని కాంట్రాక్టర్కు పర్మిషన్ ఇచ్చారు. ఇంతవరకు సబబుగానే ఉన్న పర్మిషన్ ఇచ్చాం కదా అని అధికారులుఅటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఇదే అదనుగా కాంట్రాక్టర్ నాలుగు టన్నులకుబదులు 26 నుండి 30 టన్నుల ఇసుకను తరలిస్తూ కాసులు దండుకుంటూ అసలు దందామొదలుపెట్టాడు.

4 టన్నుల వే బిల్లు 26 టన్నుల ట్రాన్స్పోర్ట్

పర్మిషన్ దొరికింది అని ఆ కాంట్రాక్టర్ ఏకంగా 4 టన్నుల వే బిల్లు తో లారీల్లో సుమారు 26 టన్నుల నుండి 30 టన్నుల వరకు ఆర్డినరీ ఇసుకను ట్రాన్స్పోర్ట్ చేస్తున్న మైనింగ్ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. తూతూ మంత్రంగా ప్రభుత్వానికి రాయల్టీ కట్టిన కాంట్రాక్టర్ తన ఇష్టారాజ్యంగా ఆర్డినరీ ఇసుకను తరలిస్తూ లక్షలు సొమ్ముచేసుకుంటున్నాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ట్రాన్స్పోర్ట్ టైమింగ్

పంకెన నుండి పెద్దపల్లి జిల్లాలోని ఇటుకబట్టి వరకు 130 కిలోమీటర్లు అని వే బిల్లులో మెన్షన్ చేశారు. దీనిని చేరుకోవటానికి సుమారు 10 గంటల సమయం ఇచ్చారు.

ఇదే అదను

10 గంటల సమయంలో ఆ కాంట్రాక్టర్ లారీలలో 4 టన్నులకు బదులు 26 నుండి 30టన్నులు తరలించడమే కాక ఒకే వే బిల్లుపై రెండు ట్రిప్పులు కొడుతున్నట్లుఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

మైనింగ్ లో లొసుగులతో అధికారులు కాంట్రాక్టర్లు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపణలు మండలంలో చర్చనీయాంశంగా మారాయి. ఇంత బహిరంగంగాదోచుకు తింటున్న పర్మిషన్ ఇచ్చిన మైనింగ్ అధికారులు మాత్రం ఇటువైపు



కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

లోడింగ్ వద్ద కనిపించని మైనింగ్ అధికారులు

పర్మిషన్ ఇచ్చిన మైనింగ్ అధికారులు ఇసుక తరలింపు జరిగే చోట కానీ.. తరలిస్తున్న లారీలను కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇసుక లోడింగ్ వద్దతప్పనిసరిగా మైనింగ్ అధికారులు ఉండాల్సి ఉండగా వారు ఆ వైపు కన్నెత్తిచూడకపోవటం విశేషం.

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

హన్మకొండ, (సింగిడి): జిల్లాలోని ఎస్టాబ్లిమెం ట్స్ చట్టం నిబంధనలు తప్పక పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. హనుమ కొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్యశాలల్లో తనిఖీలు నిర్వహించేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ అప్పయ్య తెలిపారు. ఈ నేపథ్యంలో నేడు డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య ఆకస్మికంగా పలు ఆసుపత్రులను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం, 2010 సంబంధిత నిబంధనలు, 2012 ప్రకారం ఆసుపత్రులు నిర్వహిస్తున్న వైద్య సేవలు, అవసరమైన అనుమతులు, ధ్రువపత్రాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉంచాల్సిన కింది అంశాలను అధికారులు తనిఖీ చేశారు. వైద్య సేవలకు సంబంధించిన టారిఫ్ జాబితా (చికిత్స రుసుముల వివరాలు) ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలి. ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యుల పేర్లు, అర్హతలు, విధుల వివరాలతో కూడిన వైద్యుల జాబితాను ప్రదర్శించాలి. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్ టీ పీ)కు సంబంధించిన ధ్రువపత్రాలు, అవసరమైన అనుమ తులను పరిశీలించారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. కాలుష్య నియం త్రణ మండలి నుంచి పొందిన అనుమతులు, ధ్రువ పత్రాలను పరిశీలించారు. మున్సిపల్ శాఖ నుంచి పొందిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తదితర అవస రమైన అనుమతులను తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన ఇతర రిజిస్ట్రేషన్లు, అనుమతులు, రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రుల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిం చినట్లు గుర్తించినట్లయితే సంబంధిత ఆసుపత్రులపై చట్టప్ర కారం చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ హెచ్చరిం చారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఆసుపత్రి బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లా



కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఐదు ప్రత్యేక బృందాలు జిల్లాలోని ఆసుపత్రులను తనిఖీ చేసి, నిబంధనల అమలును పర్యవేక్షిస్తాయని తెలిపారు. ఆసుపత్రుల యాజ మాన్యాలు అవసరమైన అన్ని అనుమతులు, ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకొని అధికారుల తనిఖీలకు సహకరించాలని సూచించారు.

భద్ర మారుతి, గృష్ణేశ్వర్ వెళ్లిన నిర్మల్ యాత్ర బస్సు



నిర్మల్ ప్రతినిధి, (సింగిడి): ఆర్టీసీ నిర్మల్ డిపోనుండి భద్ర మారుతి, గృష్ణేశ్వర్ కు ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపోమేనేజర్ కే పండరి తెలిపారు. ఈ బస్సు 13 అక్టోబర్ రోజు వెళ్లి బెండా నాగనాథ్ జ్యోతిర్లింగం దర్శించుకొని 14 తేదీ భద్ర మారుతీ, గృష్ణేశ్వర్ జ్యోతిర్లింగం దర్శించుకొని ఎల్లోరగుహలు వీక్షించి అక్కడ శివాలయం దర్శించుకొని ఔరంగా బాద్ లో గల మిని తాజమహల్ బిబికా మక్బరా చూసి తిరిగి 15 వ తేదీ ఉదయం 4 గంటలకు నిర్మల్ చేరుకుంటుందని ఆయన తెలిపారు. నిర్మల్ పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రయా ణికుల ఆధారాభిమాణాలతో 27 అక్టోబర్ రోజు 6 జ్యోతిర్లింగాలు గుజరాత్ యాత్ర బస్సు పెట్టడం జరిగిందని ఇంతకు ముందే 6 జ్యోతిర్లింగాలు పెట్టడం జరిగింది.ప్రయాణికులు చాలా ఆదరిం చారు.మళ్ళీ 27అక్టోబర్ రోజున మధ్యాహ్నం 1:30 ని!! లకు పెట్టడం జరిగింది.దానిలో ఇంకా 10 సీట్లు మిగిలి ఉన్నాయి ఆసక్తి కలవారు ముందుగా రిజర్వేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9959226003,9440018549 లో సంప్రదిం చాలని ఆయన కోరారు.

గ్రామాల్లో చేయూత పెన్షన్ల ధ్రువీకరణ

చింతలమానేపల్లి, (సింగిడి): చింతలమానేపల్లి మండలంలోని బాబాసాగర్, రుద్రాపూర్, బాలాజీ అనుకోడ, రవీంద్రనగర్, రణవెల్లి, బూరేపల్లి గ్రామాల్లో మంగళవారం చేయూత పెన్షన్ల ధ్రువీకరణ కార్యక్రమం ఎంపీడీఓ సత్యనారాయణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) భిక్షపతి గౌడ్ హాజరై పెన్షన్ లబ్ధిదారుల వివరాలను పరిశీలించి ధ్రువీకరణ చేపట్టారు. ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్న చేయూత పెన్షన్లు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం అందేలా సంబంధిత వివరాలను అధికారులు తనిఖీ చేశారు. పెన్షన్ లబ్ధిదారులకు సంబంధించిన రికార్డులు, ఇతర వివరాలను పరిశీలిస్తూ ధ్రువీకరణ ప్రక్రియను కొనసాగించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి సక్రమంగా అందేలా క్షేత్రస్థాయిలో వివరాల పరిశీలన చేపట్టడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా నిలిచింది. ఈ





కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని పెన్షన్ల ధ్రువీకరణకు అవసరమైన వివరాల పరిశీలనలో సహకరించారు. గ్రామస్థాయిలో పెన్షన్ లబ్ధిదారుల వివరాలను సేకరించి, సంబంధిత రికార్డులను అందుబాటులో ఉంచారు. చేయూత పెన్షన్ల ధ్రువీకరణ ద్వారా అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిరంతరాయంగా అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంతో ఆయా గ్రామాల్లో పెన్షన్లకు సంబంధించిన వివరాల పరిశీలనకు ప్రాధాన్యం లభించింది.

అన్నపూర్ణేశ్వరి అవతారంలో దుర్గామాత.. భక్తిశ్రద్ధలతో పూజలు..

నవరాత్రి ఉత్సవాల్లో 400 మందికి అన్నప్రసాద వితరణ..
పూసాల గ్రామంలో ఆధ్యాత్మిక సందడి...



సుల్తానాబాద్, (సింగిడి): దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాల గ్రామంలో భక్తి శ్రద్ధలతో కొనసాగు తున్నాయి. ఉత్సవాల్లో భా గంగా మూడో రోజు అన్నపూర్ణేశ్వరి అవతా రంలో దర్శనమి చ్చిన దుర్గామాతకు గ్రామ భక్తులు, ప్రజలు ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం నిర్వహించిన నిత్య అన్నదాన కార్యక్ర మంలో సుమారు 400 మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం కొనసాగుతుం డగా, గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సంద ర్భంగా దుర్గామాత కృపతో పూసాల గ్రామంతో పాటు సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని భక్తులందరి కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, అష్టైశ్వర్యాలు, ధనధాన్యాలు సమృద్ధిగా కలగాలని నిర్వాహకులు ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వలస నీలయ్య, వలస భాస్కర్, పెగడ కిషన్, నల్ల శంకరయ్య, బీకాం, వడ్నాల రమేష్, అడిగొప్పుల లింగమూర్తి, పెగడ అంజయ్య, నల్ల వెంకన్న, కండక్టర్ శంకరయ్యతో పాటు పూసాల గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 115 సెల్ ఫోన్ల రికవరీ.జిల్లా ఎస్పీ డా జి జానకి షర్మిల ఐపీఎస్

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 2492 మొబైల్ ఫోన్ల రికవరీ

నిర్మల్ ప్రతినిధి,(సింగిడి): నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను CEIR (Central Equipment Identity Register) పోర్టల్ ద్వారా గుర్తించి రికవరీ చేయడంలో నిర్మల్ జిల్లా పోలీసులు సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా రికవరీ చేసిన సుమారు రూ. 13 లక్షల 80 వేల విలువైన 115 సెల్‌ఫోన్లను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS బాధితులకు అందజేశారు. CEIR పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగిస్తూ జిల్లా పరిధిలో ఇప్పటివరకు మొత్తం 2492 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుత జీవన విధానంలో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ అత్యంత కీలకమైన పరికరంగా మారిందని, మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా చోరీకి గురైనా వెంటనే CEIR పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. బాధితులు స్వయంగా CEIRపోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చని, లేదా మొబైల్ ఫోన్‌కు సంబంధించిన వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలతో సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. CEIR ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను బ్లాక్ చేయడంతో పాటు, సాంకేతిక ఆధారాలతో గుర్తించి రికవరీ చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మార్కెట్లు, బస్టాండ్లు, బస్సులు, ఇతర



రద్దీ ప్రాంతాల్లో ప్రజలు తమ మొబైల్ ఫోన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రద్దీ సమయంలో మొబైల్ ఫోన్లు చోరీకి గురయ్యే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసే ముందు బిల్లు, IMEI నంబర్, ఫోన్ వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. సరైన ధ్రువీకరణ లేకుండా లేదా అనుమానాస్పదంగా విక్రయిస్తున్న మొబైల్ ఫోన్లను కొనుగోలు చేయవద్దని ప్రజలకు సూచించారు. పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందించేందుకు నిర్మల్ జిల్లా పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజలు CEIR సేవలను సద్వినియోగం



చేసుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు. మొబైల్ ఫోన్ల రికవరీలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ కృషి చేసిన ఐటీ కోర్ సిబ్బంది, సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్తో పాటు అదనపు ఎస్పీ డి. ఉపేందర్ రెడ్డి, ఆర్ఐ అడ్మిన్ రామ్ నిరంజన్, ఐటీ కోర్ సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు

మర్ద లక్ష్మీనర్సుకు బీఆర్ఎస్ నివాళి



దుగ్గొండి, (సింగిడి): గురిజాల గ్రా మానికి చెందిన ప్రముఖ సీని యర్ కమ్యూనిస్టు నాయకుడు మర్ద లక్ష్మీనర్సు అకాల మరణం చెంద డంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఆయన మృతి విషయం తెలుసుకున్న గురిజాల బీఆర్ఎస్ గ్రామ కమిటీ నాయకులు ఆయన పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించా రు. అ నంతరం లక్ష్మీనర్సు కుటుంబ సభ్యు లను పరామర్శించి సానుభూతి తెలిపారు. సీని యర్ కమ్యూ నిస్టు నాయకుడిగా గుర్తింపు పొందిన లక్ష్మీనర్సు మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం గ్రామానికి తీరని లోటని పేర్కొ న్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్ర మంలో గురిజాల బీఆర్ఎస్ గ్రామ కమిటీ నాయకులు పాల్గొని మర్ద లక్ష్మీనర్సుకు నివాళు లర్పించారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు టీమ్..

కోచ్‌గా మాడుగుల ప్రవీణ్

ప్రవీణ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు



భీమదేవరపల్లి (సింగిడి): అంతర్జాతీ య స్థాయి కరాటే ఛాంపి యన్‌షిప్ పోటీలకు టీమ్ కోచ్‌గా ముస్త ఫాపూర్ గ్రా మానికి చెందిన మాడుగుల ప్రవీణ్ ఎంపిక య్యారు. ఈ నెల 17, 18 తేదీల్లో శ్రీలంకలోని వెన్నపూవ్వ నగరంలో జరగనున్న ఈ పోటీలకు ఆయన కోచ్‌గా వ్యవహరించ నున్నారు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు కోచ్‌గా ఎంపిక కావడంతో ముస్తఫాపూర్ గ్రామంతో పాటు భీమదేవరపల్లి మం డలం లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు గ్రామ, మండల నాయకులు మాడుగుల ప్రవీణ్‌ను అభినందిం చారు. అంతర్జాతీయ వేది కపై క్రీడాకారులకు మార్గనిర్దేశం చేసే అవకాశం దక్కడం విశేషమని పేర్కొన్నారు. ప్రవీణ్ ఎంపిక స్థానిక క్రీడాకా రులకు స్ఫూర్తినిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మూడు రోజులుగా నీళ్లు బంద్.. మహిళల నిరసన



కాటారం, (సింగిడి): మండలంలోని గుండ్రాత్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో మహిళలు మంగళ వారం నిరసన తెలిపారు. మూడు రోజులుగా నీళ్లు రాకపో వడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చెడిపోయిన బోరు వద్ద ఖాళీ బిందెలతో తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. కాలనీలో పది రోజుల క్రితం నీటి మోటార్ స్టార్టర్ చెడిపోవడంతో సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లామని కాలనీవాసులు తెలిపారు. దీంతో మరమ్మ తులు చేయించి తిరిగి అమర్చినప్పటికీ, మూడు రోజుల క్రితం మళ్లీ స్టార్టర్ పాడైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరు మోటార్ స్టార్టర్‌కు మరమ్మతులు చేయించి, కాలనీలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని మహిళలు కోరారు.

అమ్మవారిని దర్శించుకున్న

అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామా బాద్ ప్రతి నిధి, (సింగిడి): దేవి శరన్నవ రా త్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని 36వ డివిజన్ లో గల నాందేవ్ వాడలో అమ్మవారి మండపాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మంగళవారం దర్శించుకు న్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్ర మంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో 36వ డివిజన్ కార్పొ ంటర్ ధాత్రిక రేవతి పరమేశ్వర్ ,మండపం నిర్వాహకులు పాల్గొన్నారు.

రైతుల ఆవేదనకు స్పందన..

పంట పొలాలకు ఎస్సారెస్పీ నీరు!

రైతుల విజ్ఞప్తి మేరకు నీటి విడుదలకు చర్యలు తీసుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల / బుగ్గారం, (సింగిడి): రైతుల కష్టాలను గుర్తించి, వారి విజ్ఞప్తికి స్పందిస్తూ పంట పొలాలకు సాగునీరు అందించేందుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చర్యలు తీసుకున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో నీటిమట్టం తక్కువగా ఉన్నప్పటికీ, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సంబంధిత వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నీటి విడుదలకు చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లా బుగ్గారం మండలంలోని పలు గ్రామాల రైతులకు సాగునీరు అందించే అంశంపై మంత్రి మాట్లాడుతూ.. రైతుల ఆవేదన, ఆందోళనను ప్రభుత్వం అర్థం చేసుకుంటోందని పేర్కొన్నారు. ప్రజాపాలనలో రైతులకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.



బతుకమ్మ పండుగతో పాటు సాగునీటి అవసరాలకు ఉపయోగకరం

దసరా పండుగ సందర్భంగా ఆడబిడ్డలు జరుపుకునే బతుకమ్మ పండుగకు నీరు ఉపయోగపడటంతో పాటు, పంట పొలాలకు సాగునీటి అవసరాలు కూడా తీరేలా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు మంత్రి వివరించారు. రైతుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత సన్నిధిలో గ్రంథాలయ చైర్మన్

ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు



బిక్కుూర్, (సింగిడి): రామేశ్వర్‌పల్లి గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు పంటల దిగుబడి బాగుండి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని దుర్గామాతను ప్రార్థించారు.

సఫాయి కార్మికులకు

నిత్యావసర సరుకులు, ప్రమాద బీమా ధ్రువపత్రాల పంపిణీ





బతుకమ్మ పండుగ సందర్భంగా

రెండు జతల దుస్తుల అందజేత

గ్రామ పరిశుభ్రతలో కార్మికుల సేవలు వెలకట్టలేనివి: సర్పంచ్ తోడేటి రమేష్

హుస్నాబాద్ (సింగిడి): గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా నిత్యం శ్రమిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న సఫాయి కార్మికుల సేవలను గుర్తిస్తూ పందిళ్ళ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏడుగురు సఫాయి కార్మికులకు 19 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయడంతో పాటు ప్రమాద బీమా ధ్రువపత్రాలను అందజేశారు. అదేవిధంగా బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ప్రతి కార్మికుడికి రెండు జతల దుస్తులను అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తోడేటి రమేష్ మాట్లాడుతూ.. ఉదయం కోడి కూసినప్పటి నుంచి రాత్రి పొద్దుపోయే వరకు గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ప్రజలకు అవసరమైన ఎన్నో పనులను చేస్తూ కార్మికులు నిరంతరం సేవలందిస్తున్నారని తెలిపారు. గ్రామంలోని వీధులు శుభ్రంగా ఉండటం, చెత్తాచెదారం తొలగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వెనుక సఫాయి కార్మికుల కష్టం, అంకితభావం ఎంతో ఉందన్నారు. ఎండ, వాన అని తేడా లేకుండా తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా గ్రామ ప్రజల ఆరోగ్యం కోసం పనిచేసే కార్మికుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని పిలుపునిచ్చారు. సఫాయి కార్మికులు కేవలం తమ విధులను నిర్వర్తించే వారు మాత్రమే కాదని, గ్రామ అభివృద్ధిలో కీలక భాగస్వాములని పేర్కొన్నారు. వారి కష్టానికి తగిన గుర్తింపు, గౌరవం లభించాలని, పండుగ వేళ వారి కుటుంబాల్లో సంతోషం నింపాలనే ఉద్దేశంతో నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రమాద బీమా ధ్రువపత్రాల అందజేతతో కార్మికులకు భద్రత కల్పించే దిశగా చర్యలు తీసుకున్నామన్నారు. గ్రామ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే కార్మికుల సంక్షేమానికి గ్రామపంచాయతీ పాలకవర్గం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పందిళ్ళ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలో కాంగ్రెస్ నిరసన...

పాల్గొన్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి...



ఆర్మూర్ , (సింగిడి): ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఓట్ చోరీకి వ్యతిరేకంగా, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈ సీ) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి జిల్లాకు చెందిన పలువురు నేతలతో కలిసి తరలి వెళ్లి, ఢిల్లీలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నా రు. ప్రజా స్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు గౌరవం, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లక్ష్యంగా కాం గ్రెస్ పార్టీ చేపట్టిన ఈ నిరసన కార్య క్ర మానికి రాష్ట్ర ముఖ్య మంత్రి సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కు మార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సల హాదా రులు బోధన్ ఎమ్మెల్యే పొద్దు టూరు సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపాల్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు నగేష్ రెడ్డి ఆధ్వ ర్యంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికల నర్సారెడ్డి, ఆర్మూర్ ఏ.బీ.చిన్న సైతం ఢిల్లీకి తరలి వెళ్లి సంఘీభావం గా నిరసన తెలియ జేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువై నదని, ప్రతి ఓటరుకు తన ఓటు హక్కుపై పూర్తి విశ్వాసం ఉండేలా ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్ర జాస్వామ్య విలువలను కాపాడేందుకు, ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఈ సంద ర్భంగా తెలిపారు.

సహకార రంగంలో ములుకనూరు సంఘం సేవలు భేష్!

సంఘం కార్యకలాపాలను పరిశీలించిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తౌటం రోహిత్ నేత

భీమదేవరపల్లి, (సింగిడి): రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి తోడ్పాటునం దిస్తున్న ములుకనూరు సహకార సంఘం కార్యకలాపాలను హనుమకొండ జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తౌటం రోహిత్ నేత మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం అందిస్తున్న సేవలు, నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి జనరల్ మేనేజర్ ఎం. రాం రెడ్డి ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు ఆదిరెడ్డి, భీమదేవరపల్లి మండల వ్యవసాయ అధికారి పద్మ, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు కమలహాసన్, సంతోష్, సంఘ వ్యవసాయ అధికారులు సంగ శ్రీనివాస్, ముచ్చ అచ్యుత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తుడుందెబ్బ నేతల వ్యాఖ్యలపై చాద మల్లయ్య తీవ్ర ఖండన

దాడి ఘటనపై నా వద్ద పూర్తి ఆధారాలున్నాయి..

త్వరలో వాస్తవాలు బయటపెడతా..

ములుగు ప్రతినిధి, (సింగిడి): ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) నేతలు తనపై చేసిన వ్యాఖ్యలను చాద మల్లయ్య తీవ్రంగా ఖండించారు. ఆదివారం తాను ఏర్పాటు చేసిన ఆదివాసి నాయకపోడు సేవా సంఘం సమావేశంలో తనపై దాడి చేసిన వ్యక్తి పేరు, కులం, సంఘం, గ్రామం వివరాలను ఎక్కడా ప్రస్తావించలేదని ఆయన స్పష్టం చేశారు. అలాంటప్పుడు తుడుందెబ్బ నాయకులు పూనెం ప్రశాంత్, నల్లెబోయిన లక్ష్మణ్, కబ్బక లక్ష్మణ్, పొడెం నాగేశ్వరరావు, ఎట్టి సదయ్య, ఈసల భాగ్యరాజ్, కమరం లక్ష్మీపతి, బలయ్య, నాగేశ్వరరావు తదితరులు చొరవ తీసుకొని తనపై జరిగిన దాడి ఆరోపణలు అసత్యమని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. ఈ ఘటనకు సంబంధించి తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. 'గుమ్మడికాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లు' వారి వ్యాఖ్యలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం రెండు సంఘాల మధ్య వైరం సృష్టిస్తున్నాననే ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. అలాంటి ఉద్దేశం తనకు ఉంటే ఆదివాసి నాయకపోడు సేవా సంఘం సమావేశంలోనే దాడి చేసిన వ్యక్తి పూర్తి వివరాలను వెల్లడించేవాడినని తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ మధ్యాహ్నం 3.25 గంటలకు తనకు ఫోన్ చేసింది ఎవరు? సాయంత్రం 4.30 గంటల సమయంలో తనను కారులో తీసుకెళ్లింది ఎవరు? ఏ ఉద్దేశంతో, ఎక్కడికి తీసుకెళ్లారు? దాడి వెనుక ఎవరున్నారు? అనే విషయాలను త్వరలోనే ఆధారాలతో సహా వెల్లడిస్తానని హెచ్చరించారు. పార్టీపై ఉన్న అభిమానంతోనే ఇప్పటివరకు తనపై దాడి చేసిన వ్యక్తుల పేర్లను బయటపెట్టలేదని చాద మల్లయ్య తెలిపారు. తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని మరోసారి స్పష్టం చేశారు. పదవులు పెరిగే కొద్ది జ్ఞానం, ఓర్పు, సహనం, సమానత్వం, ఐక్యత పెరగాలని, కుల వివక్షకు పాల్పడటం, దాడులు చేయడం ఎంతవరకు సమంజసమో ప్రజలే ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మంగపేట మండల అధ్యక్షుడు చాద శేఖర్, సంఘం నాయకులు పోలం తిరుపతి, బోడ్డు సుధాకర్, చాద హరిబాబు, బోడ్డు కృష్ణ, పెద్దల దేవేందర్, రెడ్డి కిరణ్, చాద వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సబ్సిడీ విత్తనాల పంపిణీపై సమగ్ర విచారణకు డిమాండ్

అనర్హులకు విత్తనాల పంపిణీ.. బ్లాక్ మార్కెట్‌కు తరలింపుపై ఆరోపణలు

బీజేవైఎం నాయకుడు కర్ణకంటి నరేష్ డిమాండ్

హుస్నాబాద్ (సింగిడి): అక్కన్నపేట మండలంలో సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీపై సమగ్ర విచారణ జరిపించి, లబ్ధిదారుల జాబితాను బహిర్గతం చేయాలని బీజేవైఎం నాయకుడు కర్ణకంటి నరేష్ డిమాండ్ చేశారు. అర్హులైన రైతులకు అందాల్సిన సబ్సిడీ విత్తనాలు కొందరి చేతుల్లో పక్కదారి పడుతున్నాయని, మరికొందరు వాటిని గృహ అవసరాలకు వినియోగిస్తున్నారని, ఇంకొందరు వంటనూనె తయారీకి లేదా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సబ్సిడీ విత్తనాల పంపిణీలో వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా అర్హులైన రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. విత్తనాలు పొందిన లబ్ధిదారులు ఎవరెవరు, ఒక్కొక్కరు ఎన్ని సంచులు తీసుకున్నారు, వారు ఎన్ని ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తున్నారు అనే వివరాలను అధికారులు సేకరించి క్షేత్రస్థాయిలో పంటల సర్వే నిర్వహించాలని కోరారు. అనర్హులకు సబ్సిడీ విత్తనాలు అందించినట్లు తేలితే సంబంధిత అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సకాలంలో విత్తనాలు అందక అర్హులైన రైతులు ఇబ్బందులు పడుతుంటే, విత్తనాలు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు రావడం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని అరికట్టి, అర్హులైన రైతులందరికీ సబ్సిడీ విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై అర్హులైన రైతులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని కర్ణకంటి నరేష్ ప్రకటనలో హెచ్చరించారు.

అంగన్వాడీ ఉద్యోగాలకు సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

భీమదేవరపల్లి, (సింగిడి): అంగ న్వాడీ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. నియామక ప్రక్రియలో భాగంగా సర్టిఫికెట్ల పరిశీలనకు అధికారులు శ్రీకారం చుట్టారు. గ్రామాల వారీగా వెరిఫికేషన్ తేదీలను ఖరారు చేయడంతో అభ్య ర్థులు తమ ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాల్సి ఉంది. నిర్దీత తేదీల్లో అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని భీమదేవరపల్లి సీడీపీఓ సూచించారు. హనుమకొండ జిల్లా భీమదే వరపల్లి మండలంలో అంగన్వాడీ ఉద్యోగా లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు మండల కేంద్రం భీమదేవరపల్లి గ్రామానికి చెందిన అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు.

గ్రామాల వారీగా వెరిఫికేషన్ షెడ్యూల్

ఈనెల 14న ముత్తారం, గట్ల నర్సింగాపూర్, వంగర, రత్నగిరి గ్రామాలకు చెందిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. 15న కొత్తపల్లి గ్రామంలోని రెండు కేంద్రాలు, మల్లారం గ్రామం లోని ఒక కేంద్రానికి సంబంధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల వెరిఫికేషన్ నిర్వహించ నున్నారు. దసరా సెలవుల అనంతరం ఈనెల 23న మాణిక్యా పూర్, ధర్మారం గ్రామాలకు చెందిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. 24న కొప్పూరు గ్రామా నికి సంబంధించిన వెరిఫికేషన్‌తో మండలంలోని అంగన్వాడీ ఉద్యోగాల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ముగియనుంది.

ఒరిజినల్ ధ్రువపత్రాలు తప్పనిసరి

సంబంధిత అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు ఐసీడీఎస్ కార్యాలయంలో హాజరుకా వాలని సీడీపీఓ తెలిపారు. కుల, నివాస ధ్రువపత్రా లతో పాటు ఇతర అవసరమైన ధ్రువపత్రాల ఒరిజినల్స్‌ను వెంట తీసుకురావాలి. వాటి జిరాక్స్ ప్రతులపై గెజిటెడ్ అధికారుల ధ్రువీకరణ పొందిన పత్రాలను కూడా సమర్పించాలి. నిర్దీత తేదీన సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని అభ్యర్థులను అనర్హులుగా ప్రకటిస్తామని అధికారులు స్పష్టం చేశారు. దీంతో అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీని గమనించి, అవసరమైన పత్రాలతో సమయానికి హాజరుకావాల్సి ఉంది.



పనుల్లో పురోగతి సాధించాలి..

ఖిల్లా రామాలయం పై రోప్ వే డీపీఆర్ సిద్ధం చేయాలి...

ఆర్ అండ్ బి అధికారులతో ఎమ్మెల్యే ధన్ పాల్ సమీక్ష...

నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి): నియోజకవర్గానికి సంబంధించి ఆర్ అండ్ బీ పనుల్లో పురోగతి సాధించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ క్యాంప్ కార్యాలయంలో ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇందూరులో చారిత్రక కట్టడమైన ఖిల్లా రామాలయ అభివృద్ధి కొరకు అనేకసార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా స్పందించిన ప్రభుత్వాలు రోప్ వేకొరకు డిపిఆర్ సిద్ధం చేయాలని సూచించింది అన్నారు. ఇటీవల ఆర్ అండ్ బి అధికారులతో పాటు రోప్ వే నిర్మాణ కంపెనీ ప్రతినిధులు పరిశీలించారని గుర్తు చేశారు. ప్రధానంగా నగరంలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పాత పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. అంతకుముందు పబ్లిక్ హెల్త్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందూరులో కొనసాగుతున్న యూజీడీ, టీయూఎఫ్ఐడీసీ 60 కోట్ల పనుల పురోగతిపై చర్చించారు. ప్రధానంగా యుజిడి పనులు నత్తనడకన సాగుతున్నాయని, దీనిపై అధికారులకు తగు సూచనలు అందజేశారు.



గడువులోపు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ అండ్ బీ డీఈ లు నాందేవ్, రామ్మోహన్, ఏఈ సాయి కుమార్, పబ్లిక్ హెల్త్ డీఈ యోగేష్, ఏఈ శివకృష్ణ, యూజీడీ వర్క్ మేనేజర్ జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజుల ముద్దుబిడ్డ నీలం మధుకు బీసీ కోటాలో ఎమ్మెల్సీ కేటాయించాలి..

బాల్కొండ నియోజకవర్గ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు జక్కం అశోక్

ఆర్మూర్, (సింగిడి): రాష్ట్ర ముదిరాజుల ముద్దుబిడ్డ నీలం మధుకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కేటాయించి ముదిరాజ్ వర్గాల ప్రజలకు ప్రాథమిక ముఖ్యమంత్రి ఇవ్వాలని బాల్కొండ నియోజకవర్గ మహాసభ అధ్యక్షులు జక్కం అశోక్, ముదిరాజ్ సంఘాల నాయకులు, ముదిరాజ్ యువజన సంఘాల నాయకులు ముఖ్యమంత్రి కి పత్రిక ముఖంగా విన్నవించడం జరుగుతుందని వారు ముఖ్యమంత్రిని కోరారు. సామాజిక వర్గానికి చెందిన ముదిరాజులకు నీలం మధుకు ఎమ్మెల్సీ పదవి అందించి రాష్ట్ర వ్యాప్త ముదిరాజులకు ప్రాధాన్యత నిచ్చి న్యాయం చేయాలని వారు కోరారు. ముదిరాజ్ వర్గానికి ఎమ్మెల్సీ పదవి గవర్నర్ కోటాలో అందించాలంటూ సీ.ఎం. రేవంత్ రెడ్డిని స్వయంగా ముదిరాజులు కలిసి వినతి పత్రం అందిస్తామని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా నీలం మధుకు పదవి కేటాయిస్తే ముదిరాజులకు పెద్దపీట వేసిన వారవుతారని, చిత్తశుద్ధితో నీల మధు అటు పార్టీకి ఇటు ప్రభుత్వానికి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తానని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ బాల్కొండ నియోజకవర్గ కులసంఘాల పెద్దలు, సంఘ సభ్యులు, ముదిరాజ్ యువకులు, పలువురు, పాల్గొన్నారు.



singidinews@gmail.com

మా డ్రెస్సులు మాయం చేస్తున్నారు..

ఏఐ దుర్వినియోగంపై శ్రియ శరణ్ ఫైర్

గత కొద్ది కాలంగా ఏఐ టెక్నాలజీ హీరోయిన్ల పాలిట శాపంగా మారుతోంది. కొంతమంది కేటుగాళ్లు పలు హాట్ వీడియోలను నెట్టింట షేర్ చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఎంతో మంది హీరోయిన్లు ఆవేదన వ్యక్తం చేయగా.. తాజాగా, హీరోయిన్ శ్రియా శరణ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సాంకేతికత పేరుతో కొందరు ఆకతాయిలు హీరోయిన్ల ఫోటోలను క్రియేట్ చేస్తూ ఆన్‌లైన్‌లో వదులుతున్న తీరుపై ఆమె స్పందించారు. తాను కూడా ఈ ఏఐ మోర్ఫింగ్ బాధితురాలినేనని చెప్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆన్‌లైన్‌లో తన మార్ఫింగ్ ఫోటోలు చక్కర్లు కొట్టడంపై శ్రియ మాట్లాడుతూ.. కొన్నిసార్లు ఆ ఫొటోలు చూస్తే అసలు అక్కడ ఉన్నది నేనేనా అని తనకు కూడా నవ్వొస్తుందని సరదాగా అన్నారు.

మన శరీర భాగాల సైజులను ఇష్టమొచ్చినట్లు మార్చేయడం, మనం వేసుకున్న డ్రెస్సులను ఏఐ సాయంతో మాయం చేయడం లాంటివి చేస్తుంటారని తెలిపారు. ఇలాంటి పిచ్చి పనులను చూసి మొదట్లో తేలిగ్గా తీసుకున్నప్పటికీ, రోజురోజుకూ ఇది చాలా విసుగు తెప్పిస్తోందని, అసలు ఇది పద్ధతే కాదని ఆమె మండిపడ్డారు. ఏఐ టెక్నాలజీ వల్ల ఎన్నో లాభాలు ఉన్నప్పటికీ, దానివల్ల జరిగే నష్టాలు కూడా అంతే ప్రమాదకరంగా ఉంటాయని శ్రియ హెచ్చరించారు. టెక్నాలజీ అనేది ప్రతిసారీ ఒకలా ఉండదని, కాలం మారుతున్న కొద్దీ ఇలాంటి సరికొత్త సమస్యలతో ఎలా జీవించాలో లేదా వాటిని ఎలా ఎదుర్కోవాలో మనం నేర్చుకోవాల్సిందేనని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం శ్రియ చేసిన వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.



సస్పెన్స్ థ్రిల్లర్‌తో పూజిత కోలీవుడ్ ఎంట్రీ..

తెలుగు అమ్మాయిగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి, టాలీవుడ్‌లో పలు చిత్రాల్లో నటించిన యంగ్ బ్యూటీ పూజిత పొన్నాడ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అయినప్పటికీ సరైన హిట్ పడకపోవడంతో స్టార్ రేంజ్‌ని దక్కించుకోలేకపోయింది. ఇక ఇప్పుడు తమిళ చిత్ర పరిశ్రమలో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతుంది. సస్పెన్స్ థ్రిల్లర్ సిగ్నల్ ఎట్ 11:30' మూవీతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. సంతోష్ ప్రతాప్, భవ్య త్రిఖ ముద్దల ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. మలర్విళి నాటేసన్ రచన, దర్శకత్వంలో రాబోతుంది. డి. ఇమ్మాన్ సంగీతం అందిస్తుండగా.. అలార్ స్టూడియోస్ బ్యానర్‌పై మలర్విళి నాటేసన్, శివాని సుబ్రమణి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 30న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న పూజిత ఈ సినిమాతో కోలీవుడ్‌లో తనకంటూ ఒక మంచి గుర్తింపు తెచ్చుకోవాలనే ఉత్సాహంతో ఉన్నట్లు తెలిపారు. మహిళా డైరెక్టర్ మలర్విళి ఈ కథ చెప్పిన వెంటనే తనకు బాగా నచ్చిందని, మహిళా దర్శకులు మహిళా పాత్రలను ఎంతో భావోద్వేగంతో, అందంగా తెరపై ఆవిష్కరించగలరని పూజిత అన్నారు. నిజ జీవితంలో డ్రైవింగ్ అంటే భయపడే ఆమె, అర్ధరాత్రి సమయంలో ట్రాఫిక్ లేని సమయాలలో థ్రిల్లింగ్ కార్-చేజ్ సీక్వెన్స్ పూర్తి చేశానని తెలిపారు. ఆ భయమే తనకు ఇష్టమైన జ్ఞాపకంగా మారిందని పేర్కొన్నారు. హిల్ స్టేషన్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే రొమాంటిక్ సీన్స్ సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని ఆమె చెప్పారు. సహ నటుడు సంతోష్ ప్రతాప్‌తో పనిచేయడం చాలా సౌకర్యంగా అనిపించిందని, అలాగే చాలా ఏళ్ల క్రితం యాడ్‌లో కలిసి పనిచేసిన భవ్య త్రిఖాతో మళ్లీ ఈ సినిమా ద్వారా కలవడం సంతోషంగా ఉందని పూజిత పొన్నాడ చెప్పుకొచ్చారు.

నా వైఫ్ మిస్సింగ్ నుంచి అరెరే వినవా సాంగ్ రిలీజ్



వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సరికొత్త థ్రిల్లర్ సిరీస్ 'నా వైఫ్ మిస్సింగ్'. లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బ్యానర్ పై శివ కంఠంనేని నిర్మించారు. స్వాతిప్రకాష్ మంత్రిప్రగడ దర్శకత్వం వహించారు. ఆహా ఒరిజినల్‌లో ఈ నెల 22వ తేదీ నుంచి తెలుగుతో పాటు తమిళంలోనూ స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఈ మేరకు తాజాగా దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు చేతుల మీదుగా 'నా వైఫ్ మిస్సింగ్' నుంచి 'అరెరే వినవా..' సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా కె రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. 'నా వైఫ్ మిస్సింగ్ అనే టైటిల్‌తోనే ఈ సినిమా చూడాలనే ఆసక్తి కలుగుతోంది. అరెరే వినవా పాట చాలా బాగుంది. సాయి కార్తీక్ ఈ పాటను ఆకట్టుకునేలా కంపోజ్ చేశారు. స్వాతి ఈ చిత్రంతో డైరెక్టర్‌గా పరిచయమవుతోంది. ప్రొడ్యూసర్ శివకంఠంనేని ఆయన స్నేహితులు అందరికీ ఈ సినిమా పెద్ద విజయం అందివ్వాలని కోరుకుంటున్నా. అలాగే ఆహా కూడా ఇలాంటి మంచి కంటెంట్ ఉన్న మూవీస్‌ను ఎంకరేజ్ చేయాలి' అన్నారు. ఈ పాటకు సాయి కార్తీక్ బ్యూటిఫుల్ ట్యూన్ కంపోజ్ చేయగా, అనురాగ్ కులకర్ణి అంతే అందంగా పాడారు. శ్రీ సాయి కిరణ్ క్యాచీ లిరిక్స్ అందించారు. 'అరెరే వినవా..' ఎలా ఉందో చూస్తే – 'అరెరే వినవా కదిలే కలవా.. నా ఊహల్లోను నా ఆశల్లోను అందంగా దాచుకుంటున్నానే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట. భాగ్యశ్రీ బోర్సే..భావోద్వేగం

'లెనిన్'లో అఖిల్‌కు జోడీగా భారతి పాత్రలో నటించి ఆకట్టుకున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమా కోసం టీమ్ ఎంతో కష్టపడిందని ఆమె తెలిపారు. తాజాగా ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో భాగ్యశ్రీ మాట్లాడుతూ.. తన అభిమానులు తనను నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉన్నారని ఈ చిత్రబృందంతో పాటు వాళ్లందరి వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. హైదరాబాద్ తనకు కర్మభూమి అని చెప్పారు.

సినిమా సింగిడి
Cinma Singidi
గురువారం
15-10-2026

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737